SRI VENKATESVARA ORIENTAL INSTITUTE STUDIES—No. 3

EDITOR :—P. V. RAMANUJASWAMI, M.A.

# ANNAMACHARYACHARITRAMU

## (LIFE OF ANNAMACHARYULU)

BY

V. PRABHAKARA SASTRI,


*Reader in Telugu, Sri Venkatesvara Oriental Institute, Tirupati.*

TIRUPATI

TIRUPATI DEVASTHANAMS PRESS

1949

[Price Rs. 1—0—0



సంకీర్తనముల రేకులు

## పత్రిక-విషయసూచిక.


| | | | పేజి. |
|---|---|---|---|
| 1 | అవతరణిక | ... | 1 |
| 2 | అన్నమయ వంశము | ... | 2 |
| 3 | అవతారము | ... | 2 |
| 4 | బాల్యము | ... | 3 |
| 5 | స్వామిసాక్షాత్కారము | ... | 4 |
| 6 | తిరుపతికిపయనము | ... | 5 |
| 7 | శేషాద్రిదర్శనము | ... | 9 |
| 8 | తలయేరుగుండు | ... | 11 |
| 9 | శ్రీపాదములు | ... | 12 |
| 10 | కురువనంబి | ... | 13 |
| 11 | పెద్దయెక్కుడు | ... | 15 |
| 12 | కర్పూరపుంగాలువ | ... | 15 |
| 13 | మోకాళ్లముడుపు | ... | 15 |
| 14 | త్రో వభాష్యకారులు | ... | 17 |
| 15 | స్వామిపుష్కరిణి | ... | 18 |
| 16 | దేవాలయప్రవేశము | ... | 19 |
| 17 | విష్వక్సేనుఁడు | ... | 20 |
| 18 | హానుమంతుఁడు | ... | 20 |
| 19 | ప్రసాదములు | ... | 21 |
| 20 | స్వామిదర్శనము | ... | 22 |
| 21 | స్వామియభయహస్తము | ... | 24 |

| | | | పేజి. |
|---|---|---|---|
| 22 | స్వామిమహిమలు | ... | 25 |
| 23 | శుక్రవారాభిషేకదర్శనము | ... | 31 |
| 24 | అన్నమయగురువు | ... | 35 |
| 25 | ఇంటికిఁబంపునము | ... | 36 |
| 26 | శఠకోపయతి | ... | 41 |
| 27 | రాజాశ్రయము | ... | 42 |
| 28 | రాజదౌర్జన్యము | ... | 43 |
| 29 | అన్నమయపాట | ... | 49 |
| 30 | శృంగారసంకీర్తనము | ... | 51 |
| 31 | రాజధిక్కారము | ... | 52 |
| 32 | ఆచార్యునిసంకెల | ... | 55 |
| 33 | రాయలకైంకర్యములు | ... | 57 |
| 34 | నాఁటియన్నమయ | ... | 58 |
| 35 | కొండకుఁబయనము | ... | 59 |
| 36 | అన్నలజోల | ... | 60 |
| 37 | అన్నమయజోల | ... | 61 |
| 38 | అన్నమయలాలి | ... | 62 |
| 39 | అన్నమయమహిమలు | ... | 64 |
| 40 | అన్నమయ పురందరదాసులు | ... | 66 |
| 41 | సంకీర్తనసంఖ్య | ... | 68 |
| 42 | ద్విపదరామాయణము | ... | 69 |
| 43 | వెంకటాచలమాహాత్మ్యము | ... | 70 |
| 44 | ఇతరగ్రంథములు | ... | 72 |
| 45 | అన్నమాచార్య విగ్రహము | ... | 73 |

| | | | పెజి. |
|---|---|---|---|
| 46 | సంగీతరచన | ... | 76 |
| 47 | అన్నమయసంతానము-నరసింగన్న | ... | 81 |
| 48 | పెదతిరుమలయ్య | ... | 84 |
| 49 | ఆంధ్రవేదాంతము | ... | 88 |
| 50 | సంకీర్తనభండారము | ... | 90 |
| 51 | చినతిరుమలయ్య | ... | 91 |
| 52 | పెదతిరువెంగళనాథుడు | ... | 92 |
| 53 | చిన్నన్న | ... | 93 |
| 54 | ధర్మకైంకర్యములు | ... | 93 |
| 55 | కోనేటి తిరువెంగళనాథుడు | ... | 96 |
| 56 | తిరువెంగళప్ప | ... | 96 |
| 57 | తిరుపతి శాసనములు | ... | 97 |
| 58 | నేటితాళ్లపాకవారు | ... | 98 |
| 59 | నందవరీకులు—వైష్ణవత | ... | 99 |
| 60 | అన్నమాచార్యులుతిరిగినదేశములు | ... | 100 |
| 61 | కీర్తించినవేల్పులు | ... | 100 |
| 62 | సంకీర్తనముద్రాసామ్యములు | ... | 101 |
| 63 | అన్నమయపలుకుబళ్లు | ... | 101 |
| 64 | ఛాయాపహారులు | ... | 102 |
| 65 | భాషావిశేషములు | ... | 105 |
| 66 | కవితారీతులు | ... | 106 |
| 67 | వైష్ణవులనఁగా | ... | 107 |
| 68 | లక్ష్మీవిలాసములు | ... | 111 |
| 69 | తత్త్వవిచారణ | ... | 112 |

| | | | పేజి. |
|---|---|---|---|
| 70 | పెండ్లితిరునాళ్లు | ... | 117 |
| 71 | అంపకాలు | ... | 118 |
| 72 | రెండు శృంగారసంకీర్తనలు | ... | 119 |
| 73 | ఆళ్వార్లు అన్నమాచార్యుఁడు | ... | 121 |
| 74 | ఆంధ్రసంకీర్తనములు-ద్రవిడపాశురములు | | 122 |
| 75 | శ్రీవెంకటేశ్వరవైభవము | ... | 1·3 |
| 76 | అన్నమాచార్యచరిత్రపరిశోధనము | ... | 127 |


## పీఠిక సంస్కరణములు.

| పుట. | పంక్తి. | ఉన్నది, | ఉండవలసినది. |
|---|---|---|---|
| 41 | 13 | యున్నాఁడిదెయితఁడు | యిదెయున్నాఁడితఁడు |
| 61 | 15 | నీవని | నీవన |
| 69 | 15 | వేలుండును | వేలనాల్గువందలుండును. సంకీర్తనములు పదునాల్గువేలుండును. |
| 70 | 14 | హాత్మ్యము | మాహాత్మ్యము |
| 78 | 18 | చూడ | చూడా |
| 81 | 18 | క్రీ 1453 | క్రీ 1553 |
| 84 | 15 | 1453 | 1·53 |
| 88 | 3 | తిరుమయ్య | తిరుమలయ్య |
| 99 | 5 | ముడుంపాడు | మాచనూరు |
| 131 | 14 | కొండవాఁడ | కొండలవాఁడ |
| 132 | 11 | యనవార్త | యనువార్త |
| 133 | 6 | పౌరంకొంటి | పౌరంటికొంటి |

# అన్నమాచార్యచరిత్రపీఠిక.

## అవతరణిక

అన్నమాచార్యచరిత్రము కథాపురుషుని మనుమఁడే రచించినది కాఁబట్టి విలువగల ప్రామాణిక చరిత్ర గ్రంథము. తెనుఁగున ప్రాచీన కాలపుఁజరిత్రగ్రంథములు కవీశ్వరులవి, ప్రాచీనులే ఆయా కవీశ్వరుల దగ్గఱి కాలమువారే కవితతో రచించినవి, చాలఁ దక్కువ.

బసవపురాణము, పాండితారాధ్యచరిత్రము, తిక్కనచరిత్రము (దశకు- ౧ ఆ.) కృష్ణరాయచరిత్రము, రఘునాథనాయకాభ్యుదయము నృసింహగురుచరిత్రము, ఇట్టివి కొన్నిమాత్రమే వ్రేళ్లలెక్క కెక్కియున్నవి. అం దీయన్నమాచార్యచరిత్రము మతపాండిత్యకవితాప్రఖ్యాతి గన్న మహనీయుని చరిత్రమై చాలఁగా జరగిన విషయములనే సవదరించునదిగా నిరూపణకెక్కి నా కెక్కువమక్కువ గొల్పినది.

దీనిరచయిత చినతిరువెంగళనాథుఁడని నిండుపేరుగల చిన్నన్న. ఈతని విషయము 'అన్నమాచార్యసంతతి' అనుపట్టున వివరింతును.[1]

[1]ఈ యన్నమాచార్యచరిత్రమునుబట్టియే కాక, అన్నమాచార్య రచితము లయిన సంకీర్తనములఁ బట్టి, తత్ప్రసక్తము లయిన శాసన

(1) ఈయన్నమాచార్యచరిత్ర కాగితపుప్రాఁతపుస్తకము కడపజిల్లా రాయచోటి తాలూకా మడితాడుగ్రామవాసి శ్రీతాళ్లపాక సూర్యనారాయణయ్యగారు తిరుపతి వెంకటేశ్వరప్రాచ్యగ్రంథాలయమున కొసఁగిరి. ప్రాఁత తాటాకుప్రతి ననుసరించి వారు దానిని 1940 సం॥లో వ్రాసిరట. దానితో రేవణూరి వెంకటాచార్యుని శ్రీపాదరేణుమాహాత్మ్యమును, తాళ్లపాక చిన్నన్న తామ్రశాసనమును గూడ వారీగ్రంథాలయమున కొసఁగిరి. తామ్రశాసనమును, శ్రీ మా. రామకృష్ణకవిగారు ఇక్కడి జర్నల్ వాల్యూం 1 పార్టు 1 లో ప్రకటించిరి.

ఈ యన్నమాచార్యచరిత్రవ్రాఁతప్రతిలో గ్రంథము ముగిసినతర్వాత 7 పుటలో "తాళ్లపాకతిరువెంగళనాథుని జీవితచరితము కార్వేటినగరసంస్థానములో ఉన్నది. చూడవలెను." అని కలదు. అట్లది కార్వేటినగరమునఁ గలదేమో.

ములఁబట్టి, అన్నమాచార్యుల పుత్రపౌత్రాదులు రచించిన సంకీర్తన కావ్యాదులనుబట్టి, కూడఁ దచ్చరిత్రము కొంత గుర్తింపనగును. నలు దెఱఁగుల సాధనములను గ్రుచ్చి యెత్తి హృద్యమయిన తచ్చరిత్రము నుద్ధరింప యత్నింతును.

## అన్నమయ వంశము

అన్నమాచార్యుఁడు నందవరవైదిక బ్రాహ్మణవంశమున జన్మించినాఁడు. ఈవంశమువారు ఋగ్వేదులు. ఆశ్వలాయనసూత్రులు. భరద్వాజగోత్రులు. పొత్తపినాఁటిలోని తాళ్లపాకగ్రామమున[1] నుండినవారు.

లభించిన తాళ్లపాకవారి యితరగ్రంథములలో నెందుఁగాని యన్నమయ పితృపితామహాదులప్రశంస లేదు. ఇందే అది కలదు. (చూ. 4 నుండి 8 పుటలు.) అన్నమాచార్యునితాత విద్యాభ్యాసమునకు ఊటుకూరను బంధుగ్రామమున కరిగినట్లున్నది.[2]

## అవతారము

అన్నమాచార్యునితల్లి లక్కమాంబ [3]మాడుపూరి మధవస్వామి భక్తురాలట. అది యామె పుట్టినింటివారి యూరు గాఁబోలును. అన్నమయ శక. 1346 క్రీ. 1424 క్రోధి వైశాఖమాసమున విశాఖా నక్షత్రమున జన్మించినాఁడు. పన్నిద్దరాళ్వార్లలో ముఖ్యులగు నమ్మాళ్వార్లు (శఠకోపయతి) కూడ వైశాఖవిశాఖనే జన్మించిరి. జన్మోత్సవము పుట్టిన నక్షత్రమును బట్టియును, నిర్యాణోత్సవము చనిపోయిన తిథిని బట్టియును జరపుట సంప్రదాయము. వైశాఖమాసమున విశాఖా నక్షత్రము ప్రాయికముగా పూర్ణిమాతిథికి వచ్చును. కనుక వైశాఖ

(1) తాళ్లపాక నేఁటికడపజిల్లా రాజంపేట తాలూకాలోనిది.

(2) చినతిరుమలయ్య ఊటుకూరి చెన్నరాయనిమీఁద సంకీర్తనములు రచించెను. ఊటుకూరు తాళ్లపాకదగ్గఱనే రాజంపేట తాలూకాలోనే నేఁడున్నది.

(3) మాడుపూరు, కడపజిల్లా సిద్ధవటముతాలూకాలో నున్నది.

పూర్ణిమ జన్మతిథిగాఁ గూడ నిర్ణయింపవచ్చును. శక. 1424. క్రీ శ. 1503 దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశినాఁ డాతఁడు దివ్యధామమందినాఁడు. ఆతని జీవితపరిమాణము 79 ఏండ్లు. ఇటుచూడఁగా నేఁటి కాతఁడు జన్మించి 524 ఏండ్లయినది. దివ్యత్వమంది 445 ఏండ్లయినది.

వేదాంతదేశికులు శ్రీవెంకటేశ్వరస్వామివారి ఘంటయంశమున నవతరించిరని ప్రఖ్యాతి. మనయన్నమాచార్యులు స్వామి నందకము (ఖడ్గము) నంశమున నవతరించిరని ప్రఖ్యాతి. (చూ. 10 పుట.)

## బాల్యము

అన్నమాచార్యునకు బాల్యమునఁ దల్లిదండ్రులు వదినెయన్నలు పనులు చెప్పుటయు, భగవద్భక్తిపరాయణుఁడై యాతఁడు వానినిఁ జేయఁజాలక చీకాకుపడుటయు జరగెను. (చూ. 11, 12 పుటలు.) కుటుంబమువారివలనఁ దాను జీకాకు పొందుటను సూచించు సంకీర్తనములు కొన్ని యన్నమాచార్య సంకీర్తనములలోఁ గలవు. అందొకటి :—

సామంతం

అయ్యో పోయం బ్రాయముఁ గాలము ।
ముయ్యంచుమనమున నే మోహమతి నైతి ॥ పల్లవి ॥

చుట్టంబులా తనకు సుతులుఁ గాంతలుఁ జెలులు ।
వట్టియాసలఁ బెట్టువారే కాక ।
నెట్టుకొని వీరు గడు నిజ మనుచు హరి నాత్మఁ ।
బెట్టనేరక వృథా పిరివీకులైతి ॥ అయ్యో ॥ 1

తగుబంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును ।
వగలఁ బెట్టుచుఁ దిరుగువారే కాక ।
మిగుల వీరలపొందు మే లనుచు హరి నాత్మఁ ।
దగిలించలేక చింతాపరుఁడ నైతి ॥ అయ్యో ॥ 2

అంతహితులా తనకు సన్నలునుఁ దమ్ములును ।
వంతువాసికిఁ బెనఁగువారే కాక ।
అంతరాత్ముఁడు వెంకటాద్రీశుఁ గొలువ కిటు ।
సంతకూటములయాలజడికి లోనైతి ॥ అయ్యో ॥ 8

అన్న. అధ్యా. 29, తేకు.

## స్వామి సాక్షాత్కారము

అన్నమయకుఁ బదునాఱవయేఁట స్వామి ప్రత్యక్ష మయినట్లాయన సంకీర్తనముల తొలిరాగిరేకుమీఁదఁ జెక్కఁబడియున్నది. నాఁట నుండియే స్వామియానతిచొప్పున నాతఁడు సంకీర్తనములు రచింప నారంభించెను. నమ్మాళ్వార్లు (శఠకోపయతి) కూడఁ బదునాఱవయేఁటనే ప్రజ్ఞాపూర్ణులై దివ్యప్రబంధరచన సాగించిరి. అన్నమయ తనకు స్వామి బాల్యమున దర్శనమిచ్చుట నిట్లు సంకీర్తనములఁ జెప్పుకొన్నాఁడు.

భూపాలం.

ఇప్పు డిటు కలగంటి నెల్లలోకములకు ।
నప్పఁడగు తిరువెంకటాద్రీశుఁ గంటి ॥ పల్లవి ॥

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి ।
ప్రతిలేనిగోపురప్రభలు గంటి ।
శతకోటిసూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి ।
చతురాస్యుఁ బొడగంటిఁ జయ్యన మేలుకంటి ॥ ఇప్పు ॥ 1

కనకరత్నకవాటకాంతు లిరుగడఁగంటి ।
ఘనమైనదీపసంఘములు గంటి ।
అనుపమమణీమయ మగుకిరీటము గంటి ।
కనకాంబరము గంటిఁ గ్రక్కన మేలుకంటి ॥ ఇప్పు ॥ 2




తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారు

అరుదైనశంఖచక్రాదు లిరుగడఁ గంటి ।
సరిలేనియభయహస్తము గంటిని ।
తిరువెంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి ।
హరిఁ గంటి గురుఁ గంటి నంతట మేలుకంటి ॥ ఇప్పు ॥ 3

అన్న. అధ్యా. 6 రేకు.

పాడి.

సందేహ మెక్కడా లేదు సంతోషించుకొంటి నేను ।
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను ॥ పల్లవి ॥

నున్నఁగా సంకీర్తన నానోరి కిచ్చితి గనుక ।
నన్నురక్షింతువే యనుచు నమ్మితి నేను ।
పిన్ననాఁడే నీవు నన్నుం జేరుకొంటివి గనుక ।
యెన్నంగ నీడేర్తు వని యియ్యకొంటి నేను ॥ సందే ॥ 1

శ్రీకాంతుఁడ నీమూర్తి నాచిత్తములో నిల్పఁగాను ।
నాకు నీవు గల వని నమ్మితి నేను ।
దాకొని లోకములో నీదాసుం డనిపించఁగా ।
ఈడక నేలితి వని యెఱిఁగితినేను ॥ సందే ॥ 2

కైవసమై నీవు నాకుఁ గలలో నానతియ్యఁగా ।
నావద్ద నున్నాఁడవని నమ్మితినేను ।
ఏవేళా శ్రీవేంకటేశ యెదుటనే వుండఁగాను ।
పావనమై యిన్నిటాను బ్రబలితి నేను ॥ సందే ॥ 3

అన్న. అధ్యా. II వాల్యూం 244 పేజి.

## తిరుపతికిఁ బయనము

అన్నమయ కాడినమాటల్ల నమృతకావ్యముగాను పాడినపా

పెల్లఁ బరమగానముగాను గాఁ జొచ్చినవి. తిరుపతి యాత్రకుఁ బయనమయ్యెను. పరుసగుంపువారిట్లు పాడఁజొచ్చిరి. (చూ 13 పుట.)

వేడుకొందామా వెంకటగిరి వెంకటేశ్వరుని ॥ పల్లవి ॥

ఆమటి మ్రొక్కులవాఁడే ఆదిదేవుఁడే వాఁడు
తోమని పళ్యాలవాఁడే దురితదూరుఁడే ॥ వేడు ॥ 1

వడ్డికాసులవాఁడే వనజనాభుఁడే పుట్టు
గొడ్డురాండ్రకు బిడ్డలనిచ్చే గోవిందుఁడే ॥ వేడు ॥ 2

ఎలమిఁగోరినవరా లిచ్చే దేవుఁడే వాఁడు
అలమేల్మంగా శ్రీవేంకటాద్రినాథుఁడే ॥ వేడు ॥ 3

తాళ్లపాక శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

దిగువతిరుపతి క్షేత్రము పొలిమేరలో తాళ్లపాకగంగమ్మ యను గ్రామదేవత గలదు. తాతాయగుంట గంగమ్మ[1] అంకాళమ్మ ఇత్యాది నామముల గ్రామసీమాదేవత లింకను గలరు. అందరకంటెఁ దాళ్లపాక

(1) తాతాయగుంటగంగమ్మను గూర్చి యీకథ గలదు:— ఎప్పుడో తిరుపతి నుండి తిరుమలతాతాచార్యులవారు శిష్యసంచారము చేయుచు కడపప్రాంతముల నొక యూరి కరుగఁగా జరిగినది:- ఆయూర నెన్నఁడో వెలసియున్న గంగానమ్మ భయంకరవ్యాధులచే ప్రతివత్సరము నసంఖ్యాకజనమును నాహుతి గొనుచుండుటయు నొకప్పుడు జాత్ర జరగుచుండఁగా నామె జాలి దలఁచి యేఁడాదికొకనిఁ బలి యిచ్చుచో నీమారణ మాపివేయుదు ననుటయు గ్రామస్థు లందుల కంగీకరించుటయు జరిగెను. ఏఁటేఁట జాతరనాళ్లలో బాటసారిగా వచ్చిన పరాయియూరివాని నొకని బలిపెట్టుట జరగుచుండెను. ఒకయేఁట తాతాచార్యులుగారు చిక్కిరి. గురువుగారిని గోల్పోవుటాయని యూరివారు తటపటాయింపసాగిరి. ఎట్లో తెలిసి ఆచార్యులవారు భీముని వలె బలి యగుదుమని వెఱపు మాన్పిరి. బలి గావలసిననాఁడు జాతరచోట అష్టాక్షరీ నారాయణకవచాదుల ననుసంధించుచు శిష్యులకుఁ జేయు శంఖచక్రముద్రాంకితముల తీరునఁ గాక కణకణ నిప్పు రగిల్పించి శంఖచక్రముద్రల నెఱ్ఱఁగఁ గాల్చి యుంచిరి.

గంగమ్మ ప్రాచీనదేవతయట. ఇప్పటికి నాదేవి తిరుపతి పొలిమేరలోనే కలదు. పూర్వము తిరుపతియాత్రకు వచ్చు యాత్రికు లాక్షేత్రదేవత నర్చించి క్షేత్రప్రవేశము చేయుచుండెడివారట. అన్నమయ యాదేవతకు మ్రొక్కు చెల్లించెను. (చూ. 14 పుట.) తొలుత నాదేవతను తాళ్లపాక యన్నమయ యర్చించుటచేతనేమో యామెకు తాళ్లపాక గంగమ్మ యని పేరయ్యెను. తిరుపతిలో నేఁటేఁట జరుగు గంగమ్మ జాతర యీగంగానమ్మలకై యేర్పడినదే.

అన్నమయ యంతటఁ దిగువతిరుపతికి విచ్చేసి యిట్లు సంకీర్తనము చేసెను.

మలహరి.

అదె చూడు తిరువేంకటాద్రి నాలుగుయుగము ।
లందు వెలుఁగొందీ ప్రభ మీఁఱఁగాను ॥ పల్లవి ॥
తగనూటయిరవై యెనిమిది తిరుపతుల గల
స్థానికులును చక్రవర్తి పీఠకములును ।

---

జాతరలో నమ్మవారి పూనకముతో నొకబత్తుఁడు బలిబలి యనుచు వారిమీఁదికి దూఁకెను. ఆచార్యులవారు పట్టుకార్లతో శంఖచక్రముద్రల నాపూనకమువాని రెండు భుజములమీఁద గట్టిగా నంటించఁ బోయిరి. శివశక్తి పాటిపోఁజూచి వెనుదిరిగెను గాని మంత్రప్రభావముచే నడుగు సాగక నిలిచిపోయెను. ముద్ర వీవుమీఁదఁ బడెను. తాతాచార్యులుగారిముద్ర భుజముదప్పినా వీవుతప్పదన్న సామెత తదాదిగా వెలసెను. గంగానమ్మ యా యాచార్యులవారి కాళ్లపై వ్రాలి శరణాగతురా లయ్యెను. ఆమెకు శిష్యత ననుగ్రహించి యాచార్యులవారు తిరుపతికిఁ దోడ్తెచ్చి యూరివెలుపల నెలకొల్పిరి. నాఁటితో నాగ్రామపువారికి కామెవలని పీడ తొలఁగెను. నాఁటనుండి తిరుపతిలో తాతాచార్యులవారియనుమతి నామె కేఁటేఁట జంతుబలులతోను మద్యపుఁ జాఁటలతోను నిన్నటిదాఁక జాతర సాగినది. మహాత్ములయనుగ్రమున నేఁడామె శుద్ధసాత్త్వికురాలై మద్యపుఁజాఁటను జంతుబలిని విడనాడినది.

అగణితంబైన దేశాంతరులమఠంబులును
నధికమై చెలువొందఁగాను ।
మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేనిదివ్యతపసు లున్నగృహములును ।
వాగినొరఁగుఁ బెరుమాళ్లవునికిపట్టయి వెలయు
దిగువ తిరుపతి గడవఁగాను ॥ అదె ॥

పొదలి యరయోజనము పొడవుననుఁబోలుపొంది
పదినొండుయోజనంబుల పరపుననుఁ బరగి ।
చెదర కేవంకఁ జూచినమహాభూజములు
సింహశార్దూలములును ।
కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడగంధర్వ యక్షులును విద్యాధరులు ।
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవాఱఁగాను ॥ అదె ॥ ౨

ఎక్కువల కెక్కువై యెసగి వెలసినపెద్ద
యెక్కు డతిశయముగా నెక్కి నంతటిమీఁద ।
అక్కజంబైన పల్లవరాయనిమఠము
అలయేట్లపేడగడవఁగ ।
చక్క నేఁగుచు నవ్వచఱి గడచి హరిఁదలఁచి
మ్రొక్కుచును మోఁకాళ్ల ముడుగు గడచినమీఁద ।
నక్కడక్కడ వెంకటాద్రీశుసంపదలు
అంతంతఁ గాన రాఁగాను ॥ అదె ॥ ౩

బుగులుకొను పరిమళంబుల పూవుఁదోఁటలును
పొందైననానావిధంబుల వనంబులును ।

నిగిడి క్రిక్కిఱిసి పండినమహావృక్షముల
 నీడలను నిలిచి నిలిచి।
గగనంబు దాఁకి శృంగారరసభరితమై
 కనకమయమైన గోపురములనుఁ జెలువొంది।
జగతీధరునిదివ్యసంపదలుగల నగరు
 సరగునను గానరాఁగాను ॥ అదె ॥ 4

ప్రాకటంబైన పాపవినాశనములోన
 భరితమగు దురితములు పగిలిపాఱుచునుండ।
ఆకాశగంగతోయములు సోఁకిన భవము
 లంతంత వీడిపాఱఁగను।
ఈకడనుఁ గోనేట యతులు బాశుపతుల్ మును
 లెన్న నగ్గలమై వున్న వైష్ణవులలో।
నేకమై తిరువెంకటాద్రీశుఁ డాదరిని
 యేప్రొద్దు విహరించఁగాను ॥ అదె ॥ 5

అన్న. అధ్యా. 37 రేకు.

## శేషాద్రి దర్శనము.

శ్రీరాగం.

అదివో అల్లదివో హరివాసము।
పదివేల శేషుల పడగలమయము ॥ పల్లవి ॥

అదె వేంకటాచల మఖిలోన్నతము।
అదివో బ్రహ్మాదుల కపురూపము।
అదివో నిత్యనివాస మఖిలమునులకు।
నదె చూడుఁ డదె మ్రొక్కుఁ డానందమయము ॥ అది ॥ 1

చెంగట నల్లదివో శేషాచలము।
నింగి నున్న దేవతల నిజవాసము।
ముంగిట నల్లదివో మూలనున్న ధనము।
బంగారుశిఖరాల బహుబ్రహ్మమయము ॥ అది ॥ 2

కైవల్యపదము వేంకటనగ మదివో।
శ్రీవెంకటపతికి సిరు లయినది।
భావింప సకలసంపదలరూప మదివో
పావనముల కెల్లఁ బావనమయము ॥ అది ॥ 3

అన్న. అధ్యా. 4 రేకు.

రామక్రియ.

కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ।
తెట్టె లాయ మహిమలే తిరుమలకొండ ॥ పల్లవి ॥

వేదములే శిలలై వెలసినది కొండ।
యేదెసఁ బుణ్యరాసులే యేఱులైనది కొండ।
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనలకొండ।
శ్రీదేవుఁ డుండేటి శేషాద్రి యీకొండ॥ కట్టె ॥ 1

సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ।
నిర్వహించి జలధులే నిట్టచఱులైన కొండ।
వుర్విఁ దపసులే తరువులై నిలిచిన కొండ।
పూర్వపు టంజనాద్రి యీపొడవాటికొండ ॥ కట్టె ॥ 2

వరములు కొటారుగా వక్కాణించిపెంచేకొండ।
పరగులక్ష్మీకాంతు సోబనపుఁ గొండ।
కురిసి సంపద లెల్ల గుహలనిండినకొండ।
విరివైన దిదివో శ్రీవేంకటపుఁ గొండ ॥ కట్టె ॥ 3

అన్న. అధ్యా. 282 రేకు.

ఆహిరి.

తోరణములే త్రోవ వెల్లా ।
మూరట బారట ముంచినలతల ॥ పల్లవి ॥

కూరిమి మటములు గోపురంబులును ।
తేరుపడగలే తెరు వెల్లా ।
కోరినపండ్లు గురిసేటి తరువులు ।
తోరములైన వెదురుజొంపములు ॥ తోర ॥ 1

ఆటలుఁ దిరుపులు సందపు టురుపులు ।
పాటలు వనవైభవ మెల్లా ।
కూటువనెమిళ్ల కోవిలగుంపులు ।
పేటలఁ దేటల పెనుఁగూటములును ॥ తోర ॥ 2

వింజామరలును విసనకఱ్ఱలును ।
గొంజెగొడుగులే కొండెల్లా ।
అంజనగిరిరాయఁడు వెంకటపతి ।
సంజీవని పరుషల కొదవఁగను ॥ తోర ॥ 3

అన్న అధ్యా. 20 తేకు.

అన్నమయ దిగువతిరుపతినుండి వేకువజామున బయలుదేరి అడిపడి నరసింహుని, తలయేరుగుండును, పెద్దయెక్కుడును, కపురపుఁగాలువను, దర్శించుచు జామెక్కుసరికి మోఁకాళ్లముడుపుకడ కేఁగెను.

## తలయేరుగుండు.

అడిపడిదగ్గఱనే గొప్పచింతచెట్టు నేఁడును గలదు. శ్రీవేంకటేశ సేవాక్రమమున నది ప్రస్తుతిగన్నది. అన్నమాచార్యుఁడు దీనిఁ జేర్కొన్నట్టు లేదు.

చించా మున్నిద్రసుభగాం దివ్యాం తన్మూలత శ్శుభే ।
శ్రీనివాసపదాంభోజే స్వసంకల్పాత్ సముత్థితే
తన్మూలతస్స్వయంవ్యక్తౌ సరోయోగిముఖానపి ।
లక్ష్మీనృసింహం శేషాద్రిం ప్రణిపత్య కృతాంజలిః ॥ సేవాక్రమః.

చింతచెట్టు దాటినతర్వాత నరసింహస్వామి, తలయేరుగుండు, అక్కడనే శ్రీపాదములు, నున్నవి. కొండమీఁది కెక్కువారును దిగువారును తలనొప్పి కాలునొప్పి కలుగకుండుటకై యాగుండును దలతో మోఁకాళ్లతోఁ దాఁకుదురు. కనుకనే దానికిఁ దలయేరుగుం డన్న పే రయ్యెను. (చూ 14 పుట.)

## శ్రీపాదములు.

శ్రీరామానుజాచార్యులవారు తిరుపతికి విచ్చేసి కొండపై స్వామి సన్నిధిని మూన్నాళ్లు వసించి యటుపై దిగువ తిరుపతిలో నొకవత్సరము నెలకొని తిరుమలనంబిగారికడ రామాయణరహస్యార్థములఁ దెలిసికొనిరట ! తిరుమలనంబి ప్రొద్దుట స్వామిని సేవించి కొండదిగి యడిపడికడ దలయేరుగుండు దగ్గటిమండపమునకు రాఁగా రామానుజాచార్యులవారు గోవిందరాజ సన్నిధినుండి యక్కడికరిగి రహస్యార్థములఁ దెలిసికొనుచుండెడివారట. తిరుమలనంబి యొకనాఁడు స్వామి సన్నిధిని మధ్యాహ్నపూజ సాగదయ్యెఁగదా యని ఖిన్నుఁడు కాఁగా స్వామి నీకా కొఱఁత తొలఁగిపోఁగలదు దుఃఖింపకుమని స్వప్నదర్శనము కావించిరట. మఱునాఁడు ప్రాతఃకాల పూజచేసి వచ్చి రామానుజులకుపదేశము చేయుచుండఁగా మధ్యాహ్నపూజా సమయమునకు దివ్యకుసుమ తులసీ మృగమదకర్పూర సుగంధముతో స్వామిపాదములు ప్రత్యక్షమయ్యెనట. తదాది శ్రీపాదములకక్కడ ప్రతిష్ఠకలిగెను. ఇతిహాసమూలలోనే ఈకథ.

ముఖారి.

బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దా నీపాదము ॥ పల్లవి ॥

చెలఁగి వసుధ గొలిచిన నీపాదము ।
బలి తలమోపిన పాదము ।
తలఁకక గగనము దన్నినపాదము ।
బలరిపు గాచిన పాదము ॥ బ్రహ్మ ॥ 1

కామిని పాపము గడిగిన పాదము ।
పాము తల నిడిన పాదము ।
ప్రేమపు శ్రీసతి పిసికేటిపాదము ।
పామిడి తురగపు బాదము ॥ బ్రహ్మ ॥ 2

పరమ యోగులకుఁ బరిపరి విధముల ।
పరమొసఁగెడి నీపాదము ।
తిరువేంకటగిరి తిరమనిచూపిన ।
పరమపదము నీపాదము ॥ బ్రహ్మ ॥ 3

అన్న. అధ్యా. 31 రేకు.

## కురువనంబి.

తలయేరుగుండు దాటిన తర్వాత కుమ్మరమండపమని యొక స్థలము గలదు. అదినేఁడు చెడినది. అక్కడితాళ్లు మెట్లకుఁ బ్రక్కగోడ ఱాళ్లుగా మాఱినవి. ఆఱాళ్ల మీఁదఁ గురువనంబి కథాశిల్పము లున్నవి.

ఒక కుమ్మరి స్వామికిఁ బ్రతిదినము వంటకుండలుచేసి యర్పించుచు దానియాయతిచే జీవించుచుండెను. అనుదినము నెడతెగక యాపని యుండుటచే నాతనికి స్వామిదర్శనము తఱచుగా లభింపదయ్యెను. కొయ్యతో శ్రీనివాసమూర్తిని గల్పించుకొని యాతఁడు కుండలు

చేయఁగా మిగిలిన మట్టితోఁ బుష్పములు గావించి యామూర్తి నర్చించుచుండెను. తొండమానుఁడనురాజు ప్రతిదినము స్వామికి బంగారుపూలతో దొలిపూజ జరుపుచుండెను. ఒకనాఁడు రాజు స్వామిపాదములపై నర్పించిన బంగరుపూలొకప్రక్కకు జాతియుండుటయు మట్టిపూవులు శ్రీపాదములపై నుండుటయుఁ గానవచ్చెను. రాజుచూచి విచారింపఁగా కుమ్మరి తనయున్నచోట నర్చించుచుండినపూవు లవి యగుట తెలియవచ్చెను. రాజు కుమ్మరిని దర్శించి, తన కట్టియోగ్యత నర్థించెను. స్వామి కుమ్మరికిని అహంకృతి తొలఁగించుకొనిన రాజునకును సాన్నిధ్యమొసఁగెను. ఈకథ వెంకటాచలమాహాత్మ్యమునను గలదు.

## కురువనంబి.

కాంబోది.

కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రతికె కిరీటము గలరాజు ॥ పల్లవి ॥

దవ్వులామటనుండి నీవు పువ్వులఁ బూజించితే అవి ।
చివ్వన అప్పనియడుగుఁదామెరలపై చెలఁగియప్పుడే నిలిచె ।
పువ్వులకు తెక్కలున్నవో లేక పుండరీకాక్షుని మహిమో ।
నివ్వటిల్లు నీభక్తిమో కాని నేఁడు నాతోఁ జెప్పవే ॥ కురు ॥ 1
పొంకపుదోసిటి యడుసున పెస్స పొరలిన గన్నెరుఁ బువ్వులు ।
కుంకుమగంధ మాకల్పములపై కోరివేడి నిలిచె ।
బంకమన్నది యెంతవాననో లేక పారిజాతముల కెక్కుడో ।
వెంకటపతికెంత వేడుకో నాకు వివరింపవె అప్పయ్య ॥ కురు ॥ 2
దోసిటిలోపలఁ బెట్టిన శ్రీతులసి సేవంతిపువ్వులు ।
వాసిగ జగమెల్ల కుక్షిలో నిడుకొన్నవాని మేనెల్లనిండె ।
వేసదారి యలమేలుమంగ శ్రీవేంకటేశ్వరుని మహిమో నీ ।
దాసరితనము బలమో కాని తలఁపునాతోఁ జెప్పవే ॥ కురు ॥ 3

శేషాచార్యులుగారి వ్రాఁతప్రతి.

## పెద్దయెక్కుడు.

ఇక్కడ మెట్లు నిట్టనిలువ్వనను చాలాయెత్తుగాను నుండును. తిరుమల యెక్కుటలో నెక్కువశ్రమకర మయినయెక్కు డిది.

## కర్పూరపుఁ గాలువ.

"కపురంపుఁదావులు గడు నూలు కొలుపు కపురంపుఁగాలువ" యట. పెద్దయెక్కుడు దాటినతర్వాత మోఁకాళ్ల ముడుఁపునకుఁ బూర్వమీఁకాలువ గలదట. అక్కడ నాసెలయేటిజాలునీళ్ళు సుగంధము గలిగి యుండునట. సేవాక్రమమున నిట్లున్నది. "తతఃకర్పూరసురభి తీర్థం కర్పూరనిర్ఝరమ్"

## మోఁకాళ్ల ముడుపు.

సాలగ్రామమయ మైనది గనుక నీకమీఁదఁ బర్వతము పాదములతోఁ గాక మోఁకాళ్లతో నడచుట జరిగెడిదట. కాన మోఁకాళ్ల ముడు పనిపే రయ్యె నందురు. ఒక్కొకమెట్టు మోఁకాలి యెత్తుగలిగి మోఁకాళ్లు ముడుచుకొనుచు నెక్కవలెను. గనుక నా పేరయ్యెననియు నందురు.

"అలమేలుమంగకు నాశుమార్గమున
సలలితంబుగ నొక్కశతకంబు సెప్పె"

తెలియక చెప్పుఁగాళ్లతోఁ గొండ నెక్కుచు బడలి మోఁకాళ్ల ముడుపుదగ్గఱ నన్నమయ వెదురుపొదక్రింద నొకబండపై మైమఱచి నిద్రించుచుండఁగా నలమేలుమంగాంబ దర్శనమిచ్చి యూఱడించి, చెప్పులు విడిచి కొండ నెక్కుమని తెలిపి దివ్యప్రసాదము ప్రసాదించి యాఁకలిదీర్చి యరుగుట, మెలకువగొని కళవళముంది యాతఁడది నిజమో

కాదేమో యనిసంశయించి, కడకు నమ్మి యాశుకవితగా నమ్మవారి మీఁద శతకముచెప్పుట జరిగినది.

చ॥ అరసెలు నూనెబూరియలు నౌఁగులుఁ జక్కెరమండెగల్ వడల్
బురుజులు పాలమండెఁగ లపూపము లయ్యలమేలుమంగ నీ
కరుదుగ విందువెట్టుఁ బరమాన్నశతంబుల నూపకోట్లతో
నిరతవినిర్మలాన్నముల నేతులసోనల వేంకటేశ్వరా !

ఉ॥ చొచ్చితిఁ దల్లి నీమఱుఁగు సొంపుగ నీకరుణాకటాక్ష మె
ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి యోయలమేలుమంగ నీ
మచ్చిక నందు నీతరుణిమన్నన నే నినుఁ గంటి నీకు నా
బచ్చెనమాట లేమిటికి ప్రాతివి చూడఁగ వేంకటేశ్వరా !

ఉ॥ యోగ్యత లేని కష్టుఁడ నయోగ్యుఁడ నన్నిటఁ జూడ గర్భని
ర్భాగ్యుఁడ నీకృపామతికిఁ బ్రాప్తుఁడ నోయలమేలుమంగ నా
భాగ్యము నీకృపాగరిమఁ బ్రాప్యము కావు మటంచు సారె నీ
భాగ్యవతీశిరోమణిని బ్రస్తుతిచేసెద వేంకటేశ్వరా !

ఉ॥ అమ్మకుఁ దాళ్లపాకఘనుఁ డన్నఁడు పద్యశతంబు సెప్పెఁ గో
కొమ్మసి వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలుమంగకుఁ
నెమ్మది నీవు చేకొని యనేకయుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మద మంది వర్ధిలుము జవ్వనిలీలల వేంకటేశ్వరా ! *

'వేంకటేశ్వరా' యని పద్యాంతసంబోధన మున్నను నిందుఁ బ్రతిపద్యమును నలమేలుమంగాంబికా ప్రస్తుతిపరమే. కడపద్యములో కవికూడ- అమ్మకు అలమేల్మంగకు పద్యశతము చెప్పితిననెను- కనుక నిదియలమేల్మంగాంబికాస్తుతి శతకమేయనఁదగినది.

* దీనిని వావిళ్లవారు ప్రకటించిరి

అన్నమాచార్యచరిత్రలో నన్నమయ కొండ నెక్కునాఁటి కెనిమిదేండ్ల వాఁడనియున్నది గాని, దాని నుపనయనముచే ద్విజత్వము వచ్చిన దాదిగా నని యన్వయించుకొని యెనిమిదేండ్ల వాఁడవి, మాతృగర్భమున నుండి పుట్టినదాది పదునాఱేండ్ల వాఁడని సరిచూచుకొవలెను. కొండనెక్కునాఁటి కాతఁడు సంకీర్తనకర్త. పదునాఱవయేఁట స్వామిప్రత్యక్షమై సంకీర్తన రచనానుగ్రహము చేసినాఁడని రాగితేకుమీఁదనున్నది.

## త్రోవభాష్యకారులు.

దేశాళం.

గతులన్ని ఖిలమైన కలియుగ మందును ।
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము ॥ పల్లవి ॥
ఈతనికరుణనేకా యిల వైష్ణవులమైతి ।
మీతనివల్లనే కంటి మీతిరుమణి ।
యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరమంత్ర ।
మీతఁడే రామానుజులు ఇహపరదైవము ॥ గతు ॥ 1
వెలయించె నీతండెకా వేదపురహస్యములు ।
చలిమి నీతండె చూపె శరణాగతి ।
నిలిపినాఁ డీతండెకా నిజముద్రాధారణము ।
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥ గతు ॥ 2
నియమము లీతండెకా నిలిపెఁ బ్రపన్నులకు ।
దయతో మోక్షము చూపెఁ దగ నీతండె ।
నయమై శ్రీవేంకటేశునగ మెక్క వాకిటను ।
దయఁ జూచీ మమ్ము నిట్టె తల్లిదండ్రి దైవము ॥ గతు ॥ 3

అన్న. అధ్యా. 175 రేకు.

అన్నమయ కొండ నెక్కి స్వామిపుష్కరిణిని దర్శించి తొలుత నందు స్నానముచేసినాఁడు. అప్పుడు పుష్కరిణి నిట్లు ధ్యానించినాఁడు. (18 పుట చూ.)

స్వామి పుష్కరిణి.

గుండక్రియ.

దేవుని కిదే వునికి నీతెప్పల కోనేరమ్మ ।
వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా ॥ పల్లవి ॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోబనాలు ।
అర్మిలి నాలుగువేదా లదే నీదరులు ।
నిర్మలపు నీజలము నిండు సప్తసాగరాలు ।
కూర్మము నీలోఁతువో కోనేరమ్మా ॥ దేవు ॥ 1

తగిన గంగాదితీర్థములు నీకడళ్ళు ।
జగతి దేవతలు నీజలజంతులు ।
గగనపుఁ బుణ్యలోకాలు నీదరిమేడలు ।
మొగి నీ చుట్టుమాఁకులు మును లోయమ్మా ॥ దేవు ॥ 2

వైకుంఠనగరమువాకిలే నీ యాకారము ।
చేకొను పుణ్యము లే నీజీవభావము ।
యేకడను శ్రీవెంకటేశుండె నీవునికి ।
దీకొని నీ తీర్థ మాడితిమి కావవమ్మా ॥ దేవు ॥ 3

అన్న. అధ్యా. 185 రేకు.

పెద్దగోపురమును నీడతిరుగనిచింతచెట్టును [1] గరుడగంభమును

1 ఈచింతచెట్టు శేషాంశమట. సేవాక్రమమునను వెంకటాచలమాహాత్మ్యమునను పరమయోగివిలాసమునను నీచింతచెట్టుస్తుతికలదు. ఈచెట్టు నేఁడులేదు కాని సేవాక్రమమున పర్వతారోహణోపక్రమమునఁగూడ నొకచింతచెట్టున్నట్టు వర్ణనమున్నది. ఆ చింతచెట్టు నేఁడును గలదు.

చంపకప్రదక్షిణమును దివ్యప్రసాదము లొసఁగుప్రదేశమును అక్కడిప్రసాదములను నడగోపురమును శ్రీనివాసుని భాష్యకారులను నరసింహుని జనార్దనుని అలమేలుమంగను ర౯ాగశాలను ఆనందనిలయమును కళ్యాణ మంటపమును బంగారుగరుడుని శేషుని పునుఁగుచట్టలనుకాచి తైలముపడియఁగార్చుప్రదేశమును స్వామిని స్తుతించుచిలుకలపంజరములను శ్రీభండారమును బంగారుగాదెలను బంగారువాకిటిని దర్శించి స్తుతించి లోనికి స్వామిని సేవింప నరిగెను. ఈసందర్భములలోఁబెక్కింటికి సంకీర్తనము లున్నవి.

## దేవాలయప్రవేశము.

పాడి.

సేవించి చేకొన్నవారి చేతిభాగ్యము ।
వేవేగ రారో రక్షించీ విష్ణుఁ డీడను ॥ పల్లవి ॥

గరుడగంభముకాడ కదుఁ బ్రాణాచారులకు ।
వరము లొసఁగీని శ్రీవల్లభుండు ।
తిరమై కోనేటిచెంతఁ దీర్థఫలము లెల్ల ।
పరుమల కొసఁగీని పరమాత్ముఁడు ॥ సేవించి ॥ 1

సేనమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము ।
నానాగతిఁ బుట్టించీని నారాయణుండు ।
కానుక పైఁడిగాదెలకాడ నిజరూపు ।
ఆనుక పొడచూపీని అఖిలేశుఁడు ॥ సేవించి ॥ 2

సన్నిధి గర్భగృహాన చనవిచ్చి మాటలాడి ।
విన్నపాలు వినీ శ్రీవేంకటేశుఁడు ।
ఎన్నికెం బొదాలవద్ద ఇహము పరముఁ జూపీ ।
మన్ననల నలమేలుమంగవిభుఁడు ॥ సేవించి ॥ 3

అన్న. అధ్యా. 288 రేకు.

## విష్వక్సేనుఁడు.

లలిత.

నీవేకా చెప్పఁ జూప నీవేకా ।
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి ॥ పల్లవి ॥

నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద ।
దేవతలఁ గనిపించే దేవుండవు ।
యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ ।
సేవకుండవు నీవేకా సేనమొదలారి ॥ నీవేకా ॥ 1

పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ ।
దెసలఁ బంపులు వంపే ధీరుఁడవు ।
వసముగా ముజ్జగాలవారి నిందటిని నీ ।
సిసువులఁగా నేలినసేనమొదలారి ॥ నీవేకా ॥ 2

దొరవై యసురులఁ దుత్తుమురుసేసి జగ ।
తిరవుగా నేలితి వేకరాజ్యమై ।
పరగుసూత్రవతిపతివై వెంకటవిభు ।
సిరులపెన్నిధి నీవె సేనమొదలారి ॥ నీవేకా ॥ 3

అన్న. అధ్యా. 42 రేకు.

## హనుమంతుఁడు.

సాళంగనాట.

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు ।
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు ॥ పల్లవి ॥

పెట్టినజంగతోడి పెద్దహనుమంతుఁడు ।
పట్టెను యెడమచేత బలుముష్టి ।

మెట్టినాఁడు పాదముల మించురాకాసితలలు ।
కొట్టె ననుచు నెత్తె గొప్పవలకేలు ॥ మొక్కరో ॥ 1
వంచెను శిరసుమీఁద వాలుగాఁ దనతోఁక ।
పెంచెను మిన్నులు మోవఁ బెనుదేహము ।
నించినాఁడు రౌద్రము నిడుపాటిదవుడల ।
కాంచనపుఁబట్టుకాసె కడు బిగియించెను ॥ మొక్కరో ॥ 2
పెనఁచి తొడలుదాఁక పెద్దపదకము వేసె ।
తనువుపై వ్రేలాడేదండలతోఁడ ।
అనయము శ్రీవెంకటాద్రిదేవునిబంటు ।
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను ॥ మొక్కరో ॥ 3

అన్న. అధ్యా. 252 రేకు.

## ప్రసాదములు.

### దేసాక్షి.

ఏపొద్దు చూచిన దేవుఁ డిట్లానె యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండెనూ ॥ పల్లవి ॥
మేరుమందరాలవలె మెఱయు నిడ్డెనలు ।
సూరియచంద్రులవంటి చుట్టుఁబళ్లెలు ।
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను ।
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను ॥ ఏపొద్దు ॥ 1
పలుజలధులవంటి పైఁడివెండి గిన్నెలు ।
వెలిఁగొండ లంతలేసి వెన్నముద్దలు ।
బలసిన చిలువాలు పంచదార గుప్పఁగాను ।
ఫలధువెన్నెల రస మందిచ్చినట్లుండెను ॥ ఏపొద్దు ॥ 2

పండిన పంటలవంటి పచ్చళ్లఁగూరలును ।
వండి యలమేలుమంగ వడ్డించఁగా ।
అండనె శ్రీవెంకటేశుఁ డారగించి మిగులఁగ ।
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను ॥ ఏపొద్దు ॥ 3

అన్న. అధ్యా. 252 రేకు.

## స్వామిదర్శనము.

శంకరాభరణం. అటతాళం

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయఁడా ॥ పల్లవి ॥

కోరి మమ్ము నేలినట్టికులదైవమా, చాల ।
నేరిచి పెద్ద లిచ్చిన నిధానమా ।
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు ।
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా ॥ పొడ ॥ 1

భావింపఁ గైవసమైన పారిజాతమా, మమ్ము ।
చేవదేరఁ గాచినట్టిచింతామణీ ।
కామించి కోరిక లిచ్చే కామధేనువా, మమ్ము ।
తావై రక్షించేటిధరణీధరా ॥ పొడ ॥ 2

చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా, రోగా ।
లడఁచి రక్షించే దివ్యౌషధమా ।
బడిఁ బాయక తిరిగే ప్రాణబంధుఁడా, మమ్ము ।
గడియించినట్టిశ్రీవేంకటనాథుఁడా ॥ పొడ ॥ 3

రామక్రియ అటతాళం

కంటిఁగంటి నిలువుచక్కనిమేను దండలును
నంటుఁజూపులను జూచే నవ్వుమోముదేవుని ॥ పల్లవి ॥

కనకపుఁబాదములు గజ్జెలు నందెలును।
ఘనపీతాంబరము పైకట్టు కటారి।
మొనసిరియొడ్డాణపు మొగపుల మొలనూలు।
ఒనర నాభీకమల ముదరబంధములు॥ కంటి॥ 1

గరిమ వరదహస్తకటిహస్తములును।
సరస నెత్తినశంఖచక్రహస్తములు।
ఉరముపై కౌస్తుభ మొప్పగుహారములు।
.................. ॥ కంటి॥ 2

కట్టిన కంఠసరులు ఘనభుజకీర్తులు।
కట్టాణిముత్యాల సింగారనామము।
నెట్టన శ్రీవెంకటేశ నీకుఁ గర్ణపత్రములు।
నట్టసిరసుమీఁద నమరే కిరీటము॥ కంటి॥ 3

శేషా. వ్రాఁతప్రతి.

భూపాళం

పావనము గావో జిహ్వ బ్రదుకవో జీవుఁడా।
వేవేల కితని నింక వేమాఱుఁ బాడి॥ పల్లవి॥

హరినామములే పాడి అతనిపట్టపురాణి।
ఇరవై మించినయట్టియిందిరఁ బాడి।
సరస నిరువంకలాను శంఖచక్రములఁ బాడి।
వరదకటిహస్తాలు వరుసతోఁబాడి॥ పావ॥ 1

ఆదిపురుషునిఁ బాడి అట్టెభూమిసతిఁ బాడి।
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి।
మోదపుబ్రహ్మాండాలు మోచే వుదరముఁ బాడి।
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి॥ పావ॥ 2

శ్రీవెంకటేశుఁ బాడి శిరసుతులసిం బాడి।
శ్రీవత్సమాతో డురముఁ జెలఁగి పాడి।
లావుల పాపకరకుండలాలకర్ణములు పాడి।
ఆవటించి యితనిసర్వాంగములుఁ బాడి ॥ పావ ॥ 3

అన్న. అధ్యా. 178 రేకు.

## స్వామియభయహస్తము.

సామంతం.

ఇందరికి నభయంబు లిచ్చుచేయి
కందువ లగుమంచి బంగారుచేయి ॥ పల్లవి ॥

వెలలేనివేదములు వెదికి తెచ్చినచేయి।
చిలుకుగుబ్బలిక్రిందఁ జేర్చుచేయి।
కలికియగు భూకాంతఁ గాఁగిలించినచేయి।
వలనైన కొనగోళ్ల వాఁడిచేయి ॥ ఇంద ॥ 1

తనివోక బలిచేత దాన మడిగినచేయి।
ఒనరంగ భూదాన మొసఁగుచేయి।
మొనసి జలనిధి యమ్ముమొనకుఁ దెచ్చినచేయి।
ఎనయ నాఁగేలు ధరియించుచేయి ॥ ఇంద ॥ 2

పురసతుల మానములు పొల్లచేసినచేయి।
తురగంబుఁ బరపెడిదొడ్డచేయి।
తిరువెంకటాచలాధీశుఁడై మోక్షంబు।
తెరువు ప్రాణుల కెల్లఁ దెలిపెడిచేయి ॥ ఇంద ॥ 3

II వాల్యం 215 పుట.

## స్వామిమహిమలు.

శంకరాభరణం. పల్లవి.

ఎటువంటివాఁడవో నీమహిమ
లెట్టుదెలియవచ్చును ।
నిటలలోచనుఁడు అజుఁడు తెలియలేరు
ని న్నెట్లుదెలిసేరు మానవులు ॥ పల్లవి ॥
తిరుమలనంబి తాతాత యన్ననాఁడె
తెలిసెఁబో మీపెద్దతనములు ।
కురువనంబిగారి చేతిబంకమట్టి పువ్వులు
కొన్ననాఁడె తెలిసె మీభోగము ।
మఱియు ననంతాళ్వారి చెఱువుగట్ట
మన్నుమోయఁగా దెలిసె మీనటనలు ।
గరుడగంభముకాడ కాసు కొక్కవరమిచ్చి
గడియించఁ దెలిసె మీసంపద ॥ ఎటు ॥ 1
తొండమాంజక్రవర్తికి సంపద
తొలుత నియ్యఁగాఁదెలిసె మీయీవులు ।
అండయెఱుకువారి కొట్టుచేనియెన్ను
లారగించగాఁ దెలిసె మీరుచులు ।
వుండి గొల్లలకావిళ్ల పాలెల్ల
వుట్టుకోఁగఁ దెలిసె మీనేమములు ।
దండిగ సంపంగిమాఁకుల నడిపించ
దైవరాయ తెలిసె మీవిద్యలు ॥ ఎటు ॥ 2
మును దాసు తిమ్మన్న తుంబురుకొండకు
మోంటు మియ్యఁగా దెలిసె మీబుద్ధులు ।

పనివడి తాళ్ళపాకఅన్నమయ్యగారి
పదములలోఁ దెలిసె మీమోజలు ।
మొనయ శ్రీవెంకటనాథ యలమేమంగ
నెద నుంచఁగాఁ దెలిసె మీగోప్యము ।
వెనుకొని పరువవారికెదురు వోయి
వెంటరాఁగాఁ దెలిసె మీరాజసము ॥ ఎటు ॥ 3

శేషా. వ్రాఁతప్రతి.

బౌళి.

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్ర మెనీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతె నిప్పటి యన్నట్లు ॥ ప ॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుండని ।
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మ మనుచు ।
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁడనుచు ।
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు ॥ ఎంత ॥ 1

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీ వనుచు ।
దరిసెనముల మిము నానావిధులను తలఁపులకొలఁదుల భజింతురు ।
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలఁచినవారికి నల్పం బవుదువు ।
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు ॥ఎంత॥ 2

నీవలనఁ గొఱఁత లేదు మఱి నీరుకొలంది తామరవు ।
ఆవల భాగీరథిదరి బావుల ఆజలమే వూరినయట్లు ।
శ్రీవెంకటపతి నీవైతే మముఁ జేకొనివున్నదైవమని ।
యీవల నే నీశరణనియెద నిదియే పరతత్త్వము నాకు ॥ ఎంత ॥ 3

అన్న. అధ్యా. 179 రేకు

బౌళి.

ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను
ఏమఱక కొలచిన నితఁడే దైవము ॥ పల్లవి ॥

ఘనముగా నిందరికిఁ గన్ను లిచ్చుఁ గాళ్లిచ్చు।
పనిసేయఁ జేతు లిచ్చు బలియుఁడై ।
తనుఁ గొలువుమని చిత్తము లిచ్చుఁ గరుణించి।
వొనర లోకాన కెల్ల నొక్కఁడే దైవము ॥ ఏమి ॥ 1

మచ్చిక తనుఁ గొలువ మనసిచ్చు మాట లిచ్చు।
కుచ్చితములేని కొడుకుల నిచ్చును।
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు।
నిచ్చలు లోకాన కెల్ల నిజమైనదైవము ॥ ఏమి ॥ 2

వంతమాడి కొలచినఁ బ్రాణ మిచ్చు బ్రాయమిచ్చు।
యెంతటిపఁ క్రతైన నిట్టె యిచ్చు।
వింతవింత విభవాల వెంకటేశుం డిదే మా।
యంతరంగమున నుండే అరచేతిదైవము ॥ ఏమి ॥ 3

అన్న. అధ్యా. 1౨8 రేకు.

స్వామిదర్శనము (చూ. 22, పుట.) ఇక్కడి వర్ణనము వంటిదే పరమయోగివిలాసమునను స్వామివర్ణనమున్నది.

ఆవరణంబుల కాదిమై మిగులఁ
గోమగారు వైకుంఠగోపురంబునకుఁ
బ్రమదంబుతో మున్ను బ్రణమిల్లి యంతఁ
జనుదెంచి గారుడ స్తంభంబు చక్కి

వినతొండై చెంతఁ గొప్పిరిసాల కేఁగి
వలనొప్పు చంపకావరణంబు వేగ
వలచుట్టి వచ్చి యాస్వామిపుష్కరిణి
తోయంబు లాని యుత్తుంగభాగమున
నాయహికులపతి యవతారమగుచుఁ
దిరుగనిచింతలం దేఱలించు నీడ
తిరుగనిచింత కెంతే భక్తి మ్రొక్కి
రమణ రెండవగోపురము దాఁటి లోని
కమల మహానసాగార సేవించి
నెలకొని యానందనిలయాఖ్య మగుచుఁ
నలువొందు మణివిమానంబు సేవించి
పటుమహామణి మంటపంబు సేవించి
యట వచ్చి తుదగతార్క్ష్యా హినాయకుల
సేవించి నిత్యుల సేవించి కూర్మి
నావేళ లోనికి నరుదెంచి యచటి
పంచాస్త్రకోటుల భావంబు మించి
పంచవిగ్రహముల భాసిల్లి పసిఁడి
గజ్జెలు నందియల్ కనకాంబరంబు
గొజ్జంగిముత్యాలకుచ్చుకటారి
బెడఁగుగాఁ గటిమీఁద బెరసిన కేలు
నుడుగక 'వరముల నొసగు కెంగేలు
నుదరబంధంబు కేయూరహారములుఁ
బొదలుతావుల తట్టుపునుఁగుపై పూఁత
కుడిరొమ్ముమచ్చ యక్కున నెలకొన్న
కడలికన్నియదివ్యకంఠసరంబు

ధళధళదులకించు దరము చక్రంబు
బలసి చూపట్టెడుపాణి పద్మములు
బింబాధరంబు నొప్పెడుకపోలములు
కంబుపోతంబు నెక్కసమాడుగళము
మకరకుండలములు మణికిరీటంబు
వికసితధవళారవిందనేత్రములు
చల్లనిచూపును జారునాసికము
తెల్లనిమెఱుఁగుమ త్తియపు నామమును
గలిగి యెంతయును శృంగారభావంబు
మలయు నయ్యలమేలుమంగామనోజు.

పరమయో 8 ఆశ్వా.

బంగారుగజ్జెలుఁ బసిఁడియందియలు
జెంగావిచాయమించినపైఁడివలువ
మొగపులమొలనూలు ముత్యాలకుచ్చు
బిగిసి చూపట్టుముప్పిడికఠారంబుఁ
గటిఁ ఘటియించిన కరపల్లవంబుఁ
బటువరంబుల నిచ్చు పాణిపద్మంబు
వలమురి నెఱవాఁడి వలయపుఁగత్తి
బలసి చూపట్టెడు పాణియుగ్మమును
బొడ్డుమానికము కెంపులబిటారించు
నొడ్డాణముచే మించునుదరబంధంబు
భుజకీర్తులును బాహుపురులు తాయెతులు
భుజగభూషలుఁ దట్టుపునుఁగుమైపూఁత
యక్కునవెలకొన్నయలమేలుమంగ
యక్కజంబగుమై జయంతిసరంబుఁ

దారహారములు పుత్తడిజన్నిదములుఁ
జారుమౌక్తికకంఠసరముఁ బేరురము
కంబుకంధరమును గౌస్తుభమణియు
బింబాధరంబు నొప్పెడికపోలములు
మందస్మితంబును మకరకుండలము
లిందుబింబము హసియించు నెమ్మోము
తెలిదమ్మికన్నులుఁ దిలనాసికంబుఁ
దెలిమించునాణిము త్రియపునామంబు
కనకపిప్పలదళ కలిత పట్టంబు
ననుపమమణిమయం బగుకిరీటంబు
గలుగు శ్రీవేంకటగ్రామాధినాథు."

పరమయో 2 అశ్వా.

పై యన్నింటను స్వామిముఖమున ముత్యాలనామ మున్నట్లు వర్ణనమున్నది. అది యాభరణరూపము.

స్వామికి శుక్రవారమునాఁటి తిరుమజ్జనోత్సవమును అన్నమయ యుఁదత్పుత్రులును బదింబదిగా వర్ణించిరి.

అది యీనాఁట నిట్లు సాగుచున్నది:— పునుఁగుతైలపుటభ్యంజనమును క్షీరఘటాభిషేకమును కుంకుమపూవు కస్తురి, కప్రము, నూఁటి బంగరుగిన్నెలనించిన యనుకుతో నలుఁగును స్వల్పజలాభిషేకమును, అనుకనలుఁగుతోఁ గలసిన యాతీర్థము స్వామిపాదతీర్థముగా సేకరమయిన మీఁద నిరివిగా జలాభిషేకమును జరగును. తలకుఁ దడియారఁగా బొడివలువ పిడిచుట్టు చుట్టి దివ్యమంగళవిగ్రహము నెల్లఁ బొడివలువతో దుడిచి నీరుపూఁతగా ముఖమున దూమెఱుఁగుగా సర్వాంగమున పునుఁగుతైలముపూఁత ముఖమునఁ గర్పూర చూర్ణముతో నామము సాఁతుట యానామమునకు నడుమఁ గస్తూరీ తిలకము దిద్దుట అలమేల్మంగహారము (మంగతాళి) మొదలగు దివ్యాభరణములను పీతకౌశేయములను ధరింపించుట జరగును.

తాళ్లపాకవారినాఁట నిట్లు సాగెడిది:—

ఆపాదమస్తకము పునుఁగుతైలపుటభ్యంజనముచేసి కుంకుమపువ్వు మొదలగువాని యనుకుతో నలుఁగువెట్టి పన్నీటను శుద్ధోదకమునను జలకమార్చి తుడిచి సర్వాంగములందు నారఁగాఁ గర్పూరధూళిచల్లి మేదించి దానిపై నారఁగాఁ బునుఁగుతైలమురాచి ముత్యాలతిరునామము మంగతాళి మొదలగుదివ్యాభరణములను వస్త్రములను పుష్పహారములను నలంకరించు టయ్యెడిది.

అభిషేకసమయమునఁ దాళ్లపాకవారు దగ్గఱనుండి నలుఁగుపాటలు అభిషేకపుఁబాటలు మొదలుగునవి పాడుట అభిషేకానంతరము వారికొఱకయభిషేకపుఁబన్నీటిచెంబును తాంబూలచందనాదులను నొసఁగి సత్కరించుట జరగెడిది. తిరుమజ్జనోత్సవ మిట్లు శాశ్వతముగా జరగుటకుఁ దాళ్లపాకవారే స్వామి కగ్రహారముల నర్పించిరి.

## శుక్రవారాభిషేక దర్శనము.

కంటి శుక్రవారము గడియ లేడింట।
అంటి అలమేల్మంగ అండనుండేస్వామిని ॥ పల్లవి ॥

సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణముగట్టి।
కమ్మని కదంబము కప్పు పన్నీరు।
చెమ్మతోన వేష్టువలు రొమ్ముతల మొల చుట్టి।
తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండేస్వామిని ॥ కంటి ॥ 1

పచ్చకప్పురమె నూఱి పసిఁడిగిన్నెల నించి।
తెచ్చి శిరసాదిగ దిగ నలఁది।
అచ్చెర పడిచూడ అందరికన్నుల కింపై ।
నిచ్చమల్లెపూవువలె నిటు తా నుండేస్వామిని ॥ కంటి॥ 2

తట్టుపునుఁగె కూర్చి చట్టలు చేరిచి నిప్పు ।
పట్టి కరఁగించి వెండిపళ్యాల నించి ।
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది ।
బిట్టువేడుక మురియుచుండే బిత్తరిస్వామిని ॥ కంటె ॥ 3

శేషాచార్యులవారి ప్రాఁతప్రతి.

### శ్రీరాగము.

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమునం గళలెల్లా మొలచిన ట్లుండె ॥ పల్లవి ॥

జగదేకపతిమేనఁ జల్లినకర్పూరధూళి ।
జిగిగొని నలువంకఁ జిందగాను ।
మొగిఁ జంద్రముఖి నురమున నిలిపెఁ గనుక ।
పొగరువెన్నెల దిగఁబోసిన ట్లుండె ॥ ఒక ॥ 1

పొరి మెఱుఁగుఁజెక్కులఁ బూసినతట్టుపునుఁగు ।
కరఁగి యిరుదెసలఁ గారఁగాను ।
కరిగమన విభుఁడు గనక మోహమదము ।
తొరిగి సామజసిరి దొలఁకిన ట్లుండె ॥ ఒక ॥ 2

మెఱయ శ్రీవెంకటేశుమేన సింగారముగాను ।
తఱచయినసొమ్ములు ధరియించఁగా ।
మెఱుఁగుఁబోడి యలమేలుమంగయుఁ దాను ।
మెఱుపు మేఘముగూడి మెఱసిన ట్లుండె ॥ ఒక ॥ 3

### శ్రీరాగము.

పులుగడిగినయట్టి పురుషోత్తముఁడు వాఁడే
ఎలమి నారతులు మీ రెత్తరే దేవునికి ॥ పల్లవి ॥

గొప్పయింద్రనీలాలకొండ మంచు గప్పినట్టు ।
నెప్పు మింట పాలవెల్లి నెరసినట్టు ।
విప్పు నీలమేఘముపై వెన్నెల గాసినయట్టు ।
కప్పురధూళి మేనఁ గప్పిరి దేవునికి ॥ పులు ॥ 1

నిండు నైరావతముపై నీలిజగ గప్పినట్టు ।
వెండిమేడపైఁ జీఁకటి విడిసినట్టు ।
పుండరీకపుఁగొలను పొరిఁ దేంట్లాఁగినట్టు ।
మెండగు తట్టుపునుఁగు మెత్తిరి దేవునికి ॥ పులు ॥ 2

అదె నల్లగలువల నకరువు లుండినట్టు ।
మెదిగి కస్తూరిభూమి మేరువున్నట్టు ।
యెదుట శ్రీవెంకటేశునెద నలమేల్మంగను ।
గుదిగుచ్చి సొమ్ములెల్లా గుప్పిరి దేవునికి ॥ పులు ॥ 3

పెదతిరుమల. శృ. సం 94 తే.

శంకరాభరణ.

ఏమని చెప్పుదుమమ్మ యీతని సౌభాగ్యము
కోమలపుజవ్వనము గుఱుతై నట్టుండె ॥ పల్లవి ॥

ఒట్టుచుఁ గప్పురకాపు ఊడిగపువారెల్లా ।
అట్టె దేవునికి శలఁదగాను ।
దట్టముగ మంచితెల్లఁదామెరపువ్వనకు ।
ముట్టి అవయవములు మొలచినట్టుండె ॥ ఏమని ॥ 1

తనివొంద గిన్నెలతోఁ దట్టుపునుఁగులు దెచ్చి ।
పొలుపొంద దిరుమేనఁ బుయ్యగాను ।
పనివడి గొప్పనీడుపాటినే రేడుఁబండు ।
కనుపట్టు పురుషాకార మైన ట్టుండె ॥ ఏమని ॥ 2

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ములెల్లా ।
పలువిధముల నించి భావించగాను ।
అలర శ్రీవేంకటేశుం డనెడిపుష్పాడిరాశి ।
వెలయ మరుఁడు ముద్రవేసినట్లుండె ॥ ఏమని ॥ 3

నేఁడు స్వామినామపుఁగర్పూరచూర్ణమును తిలకపుఁగస్తూరిని బునుఁగుతైలమునుగలపి శ్రీపాదరేణువని వేఱుగాను అభిషేకపుసుగంధి తీర్థమును పాదతీర్థమని వేఱుగాను భక్తులకుఁ బ్రసాదించుటజరుగుచున్నది. రేపణూరి వేంకటాచార్యుఁడురచించిన శ్రీపాదరేణుమాహాత్మ్యమున స్వామి మేనెల్ల మేదించిన, మేదించుటలో శ్రీపాదములందుఁ దొరిగిన, కర్పూరధూళితోడి పునుఁగుతైలమును, దన్మిశ్రమయిన పాదతీర్థమును శ్రీపాదరేణు నామమునఁ బ్రస్తుతిగన్నది.

తాళ్లపాకవారి సంకీర్తనములలో నిప్పటికి నేఁజూచినంతలో పునుగుతైలముతోడి కస్తూరీకర్పూరమిశ్రితమయిన పాదతీర్థమే ప్రస్తుతమయినది గాని నేటిశ్రీపాదరేణుసంకలనరీతిగాని శ్రీపాదరేణునామముగాని కానరాలేదు. ఒకసంకీర్తనము:—

శంకరాభరణము.

శ్రీహరిపాదతీర్థంబే చెడనిమందు ।
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు ॥ పల్లవి ॥

కారమై కంటగించని కడుఁ జల్లనిమందు ।
నూటనికాచనియట్టి నున్ననిమందు ।
కోరికతో వెలవెట్టి కొనితేవల్లనిమందు ।
వేరువెల్లంకులు కూర్చనట్టి వెందువోనిమందు ॥ శ్రీహరి ॥ 1
గుఱుతైనరోగములు గుణముచేసేమందు ।
దురితములు పెడఁబాపే దొడ్డమందు ।

నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించేమందు ।
నరకము సోరనట్టినయమయినమందు ॥ శ్రీహరి ॥ 2
పొంకముతో భయములు పొందనియ్యనిమందు ।
మంకు బుద్ధులు మాన్పి మన్నించేమందు ।
పంకజాక్ష వేంకటరమణ ప్రపన్నునిమందు ।
సెంకించక తనదాసులఁ జేపట్టేమందు ॥ శ్రీహరి ॥ 3

అన్నమాచార్యునిసంకీర్తనములలో గురుస్తుతిపరములుగా రచనలు చాలఁగలవుగాని ఆగురువుపేరేమో సరిగాఁ దెలియరాలేదు. ముద్రాధారణానంతరము వైష్ణవు లీతని బంతి నిడుకొని భుజించిరట (చూ 2వ పుట) అన్నమాచార్యునినాఁడే యీవంశమువారు వైష్ణవు లయిరి. ఈవిషయము నీతని పెద్ద మనుమఁడు చిన తిరుమలాచార్యుఁ డిట్లు చెప్పుకొన్నాఁడు.

దేసాళం.

ఎట్టిహితోపదేశకుం డెటువంటి దయాళువు ।
అట్టె తాళ్లపాకన్నమాచార్యుఁడు ॥ పల్లవి ॥

వచ్చితామసుల మమ్ముం బరమసాత్వికులఁగా ।
నిచ్చటనే చేసినాఁడు యెంతచిత్రము ।
ఇచ్చగించి మాకులాన నెన్నఁడు లేనివైష్ణవ ।
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥ 1

ముదిరినపాపకర్మములు సేసినట్టి మమ్ము ।
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంతసోద్యము ।
కదిసి యేజన్మానం గాననిసంకీర్తన ।
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥ 2

అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ములెల్లా ।
పలువిధముల నించి భావించగాను ।
అలర శ్రీవేంకటేశుం డనెడిపుష్పాడిరాశి ।
వెలయ మరుఁడు ముద్రవేసినట్లుండె ॥ ఏమని ॥ 3

నేఁడు స్వామినామపుఁగర్పూరచూర్ణమును తిలకపుఁగస్తూరిని బునుఁగుతైలమునుగలపి శ్రీపాదరేణువని వేఱుగాను అభిషేకపుసుగంధి తీర్థమును బాదతీర్థమని వేఱుగాను భక్తులకుఁ బ్రసాదించుటజరుగుచున్నది. రేణూరి వేంకటాచార్యుఁడురచించిన శ్రీపాదరేణుమాహాత్మ్యమున స్వామి మేనెల్ల మేదించిన, మేదించుటలో శ్రీపాదములందుఁ దొరిగిన, కర్పూరధూళితోడి పునుఁగుతైలమును, దన్మిశ్రమయిన పాదతీర్థమును శ్రీపాదరేణు నామమునఁ బ్రస్తుతిగన్నది.

తాళ్లపాకవారి సంకీర్తనములలో నిప్పటికి నేఁజూచినంతలో పునుగుతైలముతోడి కస్తూరీకర్పూరమిశ్రితమయిన పాదతీర్థమే ప్రస్తుతమయినది గాని నేటిశ్రీపాదరేణుసంకలనరీతిగాని శ్రీపాదరేణునామముగాని కానరాలేదు. ఒకసంకీర్తనము:—

శంకరాభరణము.

శ్రీహరిపాదతీర్థంబే చెడనిమందు ।
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు ॥ పల్లవి ॥

కారమై కంటగించని కడుఁ జల్లనిమందు ।
నూఱనికాచనియట్టి నున్ననిమందు ।
కోరికతో వెలవెట్టి కొనితేవల్లనిమందు ।
వేరువెల్లంకులు కూర్చనట్టి పొందువోనిమందు ॥ శ్రీహరి ॥ 1
గుఱుతైనరోగములు గుణముచేసేమందు ।
దురితములు పెడఁబాపే దొడ్డమందు ।

నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించేమందు ।
నరకము సొరనట్టినయమయినమందు ॥ శ్రీహరి ॥ 2
పొంకముతో భయములు పొందనియ్యనిమందు ।
మంకు బుద్ధులు మాన్పి మన్నించేమందు ।
పంకజాక్షు వేంకటరమణ ప్రపన్నునిమందు ।
సెంకించక తనదాసులఁ జేపట్టేమందు ॥ శ్రీహరి ॥ 3

అన్నమాచార్యునిసంకీర్తనములలో గురుస్తుతిపరములుగా రచనలు చాలఁగలవుగాని ఆగురువుపేరేమో సరిగాఁ దెలియరాలేదు. ముద్రాధారణానంతరము వైష్ణవు లీతని బంతి నిడుకొని భుజించిరట (చూ 2వ పుట) అన్నమాచార్యునినాఁడే యీవంశమువారు వైష్ణవు లయిరి. ఈవిషయము నీతని పెద్ద మనుమఁడౌ చిన తిరుమలాచార్యుఁ డిట్లు చెప్పుకొన్నాఁడు.

దేసాళం.

ఎట్టిహితోపదేశకుం డెటువంటి దయాళువు ।
అట్టె తాళ్లపాకన్నమాచార్యుఁడు ॥ పల్లవి ॥

పచ్చితామసుల మమ్ముం బరమసాత్త్వికులఁగా ।
నిచ్చటనే చేసినాఁడు యెంతచిత్రము ।
ఇచ్చగించి మాకులాన నెన్నఁడు లేనివైష్ణవ ।
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥

ముదిరినపాపకర్మములు సేసినట్టి మమ్ము ।
మొదుటఁ బుణ్యులఁ జేసె నెంతసోద్యము ।
కదిసి యేజన్మానం గానని సంకీర్తన ।
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥ 2

గడుసుందనపుమమ్ముఁ గడువివేకులఁ జేసి ।
యిడుమ లెల్లాఁ బాపె నేగురుఁడు ।
నడుమనే యెన్నడుఁ గాననిశ్రీవెంకటనాథు ।
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు ॥ ఎట్టి ॥ 8

చినతిరు, అధ్యా. 9 తేకు.

అన్నమాచార్యచరిత్రమున (చూ 28 పుట.) నిక్కడఁ గొంత గ్రంథపాత మున్నది. అందుఁ గొన్ని యేండ్లకాల మేమో గురుసన్నిధి నన్నమాచార్యుఁ డుండుట ఆతని వెదకికొనుచు నాతనితల్లి తిరుమలకు వచ్చి కొడుకును జూచి యింటికి రమ్మని పిలుచుట ఆతఁడు సమ్మతింప కుండుట అందుపై గురుఁడేవో దివ్యోపదేశములు చేసి యింటికిఁ బొమ్మని మీవంశమునఁ బుట్టఁబోవువారు మహానీయులు కాఁగలరని యాశీర్వదించుట ప్రధానముగా నుండఁదగినకథాంశము. తొలుతనింటికిఁబో సమ్మతింప కున్నను గుర్వాజ్ఞ గనుక నన్నమాచార్యుఁ డెట్టకేలకందుకు సమ్మతించెను. ఈసందర్భమున సంకీర్తనములున్నవి:—

మలహరి.

సర్వోపాయముల జగతి నా కితండె
పుర్విధరుఁడు పురుషోత్తముం డితండె ॥ పల్లవి ॥
సకలగంగాదితీర్థస్నానఫలము లివి
స్వామిపుష్కరిణీజలమె నాకు ।
సకలపుణ్యక్షేత్రవాసయాత్ర లివి
సరివేంకటాచలవిహార మిదియె ।
సకలవేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి
శౌరిసంకీర్తనం బిదియె నాకు ।

సకలకర్మానుష్ఠానము లితని కీర్తనటఁ
జాతుపడికై ంకర్య మిదియె ॥ సర్వో ॥ 1
ఉపవాసతపము లివి యితనిప్రసాదంబు
లొగి భుజించుటె నాకు దినదినంబు ।
జపరహస్యోపదేశంబు లితనిపాద
జలములు శరణనేటిసేవయొకటె ।
ఉపమింపఁ బుణ్యపురుషులదర్శనము నాకు
నొగి నిచటిబహువృక్షదర్శనంబు ।
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచోటి
యెన్నఁ గలబహుపక్షికలకలంబు ॥ సర్వో ॥ 2
తలఁపుగలయోగంబులందు శ్రీవైష్ణవులఁ
దగులునంవాసనహయోగంబు ।
వెలయ నిండుమహోత్సవంబు లిన్నియు నితని
విభవంబు లెనఁగుతిరునాళ్లు నాకు ।
చెలఁగి యిటుదేవతాప్రార్థనింతయు నాకు
శ్రీవెంకటేశ్వరుని శరణాగతి ।
అలరునానాసంపదలు యితనిపట్టపురాణి
అలమేలుమంగకడగంటిచూపు ॥ సర్వో ॥ 3

అన్న. అధ్యా. 133 రేకు.

భౌళి.

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను ॥ పల్లవి ॥
తనువే వొళవు తలయే దండెకాయ ।
ఘనమైనవూర్పులు రెండు కట్టినత్రాళ్లు ।

మనసె నీ బద్ధితాడు మతి గుణాలె జీవాళి ।
మొనసినపుట్టుగె మూలమైనకరడి ॥ పాడే ॥ 1
పాపపుణ్యా లిరువంక పైఁడివెండియనుసులు ।
పైపైఁ గుత్తికె మేటి పైచనిగె ।
కోపులనాలికె లోనఁ గుచ్చికట్టినట్టిత్రాడు ।
చూపరాని సంసారమె సూత్రపుఁగణిక ॥ పాడే ॥ 2
జీవునకు నీదండె సేసిన వాఁడవు నీవు ।
వావాతిమాటలే నీపై వన్నెపదాలు ।
ఈవే మాకు సిహపరా లిచ్చితివి మెచ్చితివి ।
శ్రీవెంకటేశ నీవే చేకొన్నదాతవూ ॥ పాడే ॥ 3

అన్న. అధ్యా. 231 రేకు.

గుండక్రియ

దాఁచుకొని పాదాలకుఁ దగ నే జేసినపూజ లివి ।
పూఁచి నీకీరితి రూపు పుష్పము లివి యయ్యా ॥ పల్లవి ॥
ఒక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ ।
తక్కినవి భండారాన దాఁచి వుండనీ ।
వెక్కసము నీనామము వెలసులభము ఫలమధికము ।
దిక్కై నన్నేలితి వింక నవి తీరనినాధనమయ్యా ॥ దాచు ॥ 1
నానాలికపై నుండి నానాసంకీర్తనలు ।
పూని నాచే నిన్నుఁ బొగడించితివి ।
వేనామాలవెన్నుండా వినుతించ నెంతవాఁడ ।
కానిమ్మని నాకీపుణ్యము గట్టితి వింతేయయ్యా ॥ దాచు ॥ 2
ఈమాట గర్వముగాదు నీమహిమే కొనియాడితిఁ గాని ।
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాఁడఁ గాను ।

నేమానం బాడేవాఁడను నేరము లెంచకుమీ ।
శ్రీమాధవ నే నీదాసుఁడ శ్రీవేంకటేశుఁడవయ్యా ॥ దాచు ॥ 8

అన్న. అధ్యా. 169 రేకు.

లలిత.

బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటి బారి నింకం దోయకు మోయయ్య ॥ పల్లవి ॥
చిక్కులభవములఁ జేరం జిక్కి వోపలేక ।
నిక్కి నీమఱుఁగు చొచ్చి నిలిచితిని ।
అక్కజమై యల్లనాఁటి అప్పులకర్మము లెల్ల ।
ఇక్కడనే చుట్టుముట్టీ నేమిసేతునయ్య ॥ బల్లి ॥ 1
లచ్చి సంసారమునకు లగ్గ మచ్చితీరలేక ।
యిచ్చట నిన్నుఁగొలిచి యెక్కువైతిని ।
పొచ్చముల నల్లనాఁటి వూఁటదీరదని కొన్ని ।
బచ్చన బందాలు వచ్చెఁ బాపఁగదవయ్య ॥ బల్లి ॥ 2
అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక ।
ముంచి నీపాదలకు మొఱవెట్టితి ।
పొంచిన శ్రీవేంకటేశ భువనరక్షుఁడవు ।
పంచలనున్నాఁడ నన్నుఁ బాలించవయ్య ॥ బల్లి ॥ 3

అన్న. అధ్యా. 361 రేకు.

నారాయణి

ఏలికవునీవట యింకా దైన్యమేల
తాలిమి నీచేతలకుఁ దగవుగా దనరా ॥ పల్లవి ॥
ఘనకర్మానుభవమె కావలె నొండె నాకు ।

వనజాక్షు నీసేవె వలెనొండె।
కినుకఁ బూఁటయు సంకెలయు రెండునేల।
ననిచి యిందుకు నిన్ను నవ్వేరుసుమ్మి ॥ ఏలి ॥ 1
పై కొని నేఁజేసినపాపమె కావలెనొండె।
తూకొని నీనామముచేఁ దుంచుటయొండె।
సాకిరి చంకదుడ్డు శరణార్థి రెండునేల।
మేకొని యీమాట వింటె మెత్తురా నిన్నును ॥ ఏలి ॥ 2
ఇరవుగా మఱపొండె యెఱుక గావలె నొండె।
సరస రెండును నైన సంగతౌనా।
గరిమ శ్రీవెంకటేశ కరుణించితివి నన్ను।
సరిచేసి జంటమాట జఱపకు మింకను ॥ ఏలి ॥ 3

అన్న. అధ్యా. 335 రేకు.

ఎట్టకేలకన్నమాచార్యుఁడు తిరుమలవీడి తల్లితో నింటికిఁజేరెను. నవయౌవనముననున్న కుమారునికిఁ దల్లిదండ్రులు పెండ్లి ప్రయత్నములుచేసిరి. తిరుమలమ్మయని అక్కలమ్మయని భార్యల నిద్దఱినిచ్చి పెండ్లి చేసిరి. అన్నమాచార్యచరిత్రమున నిర్వురను సమకాలముననే పెండ్లాడె ననదగినట్లు రచనమున్నది. (చూ. 30 పుట.)

తాళ్లపాకలో తిరుమలమీఁద అహోబలమున ఇంక ననేకపుణ్యస్థలముల వర్తించుచు గార్హస్థ్య మనుభవించుచు నన్నమాచార్యుఁడు నవయౌవనమున స్వామిమీఁదఁ జాల శృంగారకీర్తనములు విరచించెను.

అహోబల నృసింహస్వామి గురువై తానే త్రిదండమును మంత్రములను ననుగ్రహింపఁగా హయగ్రీవానుగ్రహముఁ బడసి సన్యాసియై వేదాంతదేశికుని సంప్రదాయము ననువర్తించుచున్న శఠకోపయతినియొద్ద

సకల వేదాంతశాస్త్రము నన్నమయ యధ్యయనముగావించెను. ఈ శఠకోపముని అహోబలమఠ ప్రతిష్ఠాపనాచార్యులయిన యాదివణ్ శఠకోపమునీశ్వరులగుదురు. అన్నమయనాఁట నీశఠకోపయతులే వర్తిల్లిరి. ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలవా రీశఠకోపయతిని సన్నుతించిరి. (చూ. ఆశ్వా 7 వచనము) అన్నమాచార్యుఁ డీయతివర్యు నిట్లు కీర్తించెను.

భైరవి

చూడుఁ డిందఱికి సులభుఁడు హరి ।
తోడునీడ యగు దొరముని యితఁడు ॥ పల్లవి ॥

కైవల్యమునకుఁ గనకపుఁదాపల ।
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై ।
పావన మొకరూపమై విరజకు ।
నావై యున్నాఁ డీదె యితఁడు ॥ చూడు ॥ 1

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన ।
దీపమై జగతికిఁ దేజమై ।
పాపా లడపఁగ భవపయోధులకు ।
తేప్పై యున్నాఁ డిదేయీతఁడు ॥ చూడు ॥ 2

కరుణానిధికి రంగపతికిఁ గాంచీ ।
వరునకు వేంకటగిరిపతికిఁ ।
నిరతి నహోబలనృకేసరికిఁ ద ।
త్పరుఁ డగుశఠకోపముని యితండు ॥ చూడు ॥ 3

అన్న. అధ్యా. I వాల్యూం.

అన్నమాచార్యుఁడు మంచిప్రాయముననే రామాయణమెల్ల ంకీర్తనాత్మకముగా వెలయించెను. (చూ. 30 పుట,) అన్నమాచార్యుని సంకీర్తనములలో రామాయణకథా ఘటితములుచాలఁగలవు; అన్నమయ

సంకీర్తనపద్ధతి జగన్మోహనమై ప్రఖ్యాతి కెక్కెను. అది విని సాళ్వనరసింగ రాయఁడన్నమయదర్శనమపేక్షించెను. ఈనరసింగరాయఁడుటంగుటూరి[1] పాలకుఁడని నాళీకబాంధవాన్వయుఁ డని యిం దున్నది (చూ. పుట 31) అతఁడు చంద్రవంశమువాఁడని శాసనములందును గ్రంథములందునున్నది. ఇందునాళీక 'బాంధవా' ఉండుట 'శాత్రవా' ఉండుటకు వ్రాఁతగాని చేతప్పుగాఁబోలును. నరసింహారాయఁడు విజయనగరవుఁ బ్రథమరాజ వంశ్యుఁడగు విరూపాక్షరాయలతర్వాత నావంశము నుత్సారించి రాజ్య మాక్రమించు కొన్నాఁడు. ఇంచుమించుగా నాతఁ డన్నమయవయసు వాఁడు. అతఁడు తొలుత దండనాథుఁడుగా విద్యానగరరాజులక్రిందనుండి యారాజులదౌర్బల్యముచే సనసన్నగఁ బెంపొంది తుదికి విద్యానగరా ధీశ్వరుఁ డయినాఁడు. విద్యానగర మాక్రమించుకొనక పూర్వము క్రీ. 1450 ప్రాంతముల నీతఁడు పొత్తపినాఁటిలోని టంగుటూర దండనాథుఁడై ప్రాభవమున వర్తిల్లుచుండఁ బోలును. అన్నమాచార్య చరిత్రమున నాతడు 'రాచమూఁకలలోఁబరాక్రమశాలి' యని కలదు. అతఁడన్నమా చార్యుని వేఁడికొని తనయూరికిఁ బిలుచుకొనిపోయినాఁడు. అపుడు "శ్రీకృష్ణుమన్ననఁ గ్రీడి భూచక్ర । మేకచక్రంబుగా నేలినపగిది । నాలాగు మీసహాయము నాకుఁ గలుగ । నేలుదుధరయెల్ల నేకచక్రముగ" నని తనకోర్కి తెల్పుకొన్నాఁడు. రాయఁడు నన్నమయయుఁ బొంది పోఁగి టంగుటూరఁ గొన్నాళ్లుండిరి. అన్నమయ యాశీస్సుచే శ్రీవేంకటేశ్వరస్వామిదయచే నరసింగరాఁడు విజయనగరరాజ్య మాక్రమించుకొనెను. తిరుపతిశాసనములఁబట్టియు సాళ్వాభ్యుదయమునుబట్టియు నాతఁడు కొన్నాళ్లు తిరుపతిదగ్గఱిచంద్రగిరిలోరాజ్య మేలినట్లు తెలియనగును. టంగుటూ రాతనిజన్మస్థలమో దండనాయకతాస్థానమో కాఁబోలును.

---

1 టంగుటూరు కడపజిల్లా రాజంపేట తాలూకాలోనున్నది.

విజయనగరరాజ్యపు విప్లవ (విరూపాక్ష చంద్రశేఖరరాయల) కాలమునఁ గాఁబోలును కపిలేశ్వర గజపతి యొకమాఱును, పురుషోత్తమ గజపతి యింకొకమాఱును విజయనగరము మీఁదికి దండెత్తి వచ్చిరి. తొలితూరి కొంత కప్పము చెల్లించి విరూపాక్షరాయఁడు గాఁబోలును విజయనగరమును రక్షించుకొనెను. రెండవతూరి పురుషోత్తమ గజపతికి సాళ్వనరసింహరాయఁ డుదయగిరిరాజ్యమున నొసంగి విజయనగరమును గాపాడఁగలిగెను.

కపిలేశ్వరజగపతి:—

ప్రసహ్యాకర్ణాటమహేపతేఃపురం నిరుధ్యవిద్యానగరీంనిజైర్బలైః।
సమున్నతం మానమివోచ్ఛ్రయంకరం సమాదదేకర్కశచక్రవిక్రమః॥

పురుషోత్తమగజపతి:—

యస్మైన్నిత్యతరప్రతాపదహన జ్వాలాయమానధ్వజ।
స్తంభాబద్ధకుసుంభరక్తవసన ప్రేక్షావిభగ్నద్విషే।
సంధాయాభయయాచనాంజలి మహోదతోర్వేదయాద్రింభయా
దాత్మానంముముచే నృసింహనృపతిః కర్ణాటదేశాధిపః॥ [1]

చరిత్రకారు లీసందర్భము నిట్లు గుర్తించిరి.

"విమయా సక్తుఁడగు విరూపాక్షరాయని నాతని పెద్దకొమారుఁడగు రాజశేఖరరాయలు చంపించెను. (౧౪౭౮) ఇతనిని ఈతని తమ్ముఁడగు రెండవవిరూపాక్షరాయలు చంపించెను. కాని యీభ్రాతృహంత పరిపాలనము ప్రజల కిష్టమైనది గాదయ్యెను. ఆతని దండనాయకుఁడగు

1 అనంతవర తామ్రశాసనము, భారతిసంవత్సరాది సంచికలోను, కళింగదేశ సంచికలోను ప్రకటితము.

సాళువనరసింహరాజు సర్వజనులు తనకు అనుకూలురుకాఁగా రాజును వెడలఁగొట్టి రాజ్యమును ఆక్రమించుకొనెను. అంత నీప్రథమవంశ మంతరించెను. (౧౪౮౬) తర్వాత సాళ్వనరసింహరాజు ౧౪౮౬ నుండి ౧౪౯౦ దాఁక రాజ్యమేలెను." [1]

సాళ్వనరసింగరాయనికి బ్రహ్మహత్యాపాపము చుట్టుముట్టఁగా దానిని మాధ్వమతాచార్యులగు శ్రీపాదరాయలవారు విడఁగొట్టిరట. ఈ బ్రహ్మహత్య కారణముగాఁ దిరపతి వేంకటేశ్వరస్వామి యర్చనము నిలిచిపోఁగా వ్యాసరాయలు పండ్రెండేడ్లు స్వామియర్చనముసలిపి నెమ్మదిఁగా మరల వైఖానసులఁజేర్చిరట ! శ్రీపాదరాయాష్టకములో నీశ్లోక మున్నది.

శ్రీమద్వీరనృసింహరాయనృపతే ర్భ్రూదేవహత్యావ్యథాం
దూరీకృత్య తదర్చితోజ్జ్వలమహాసింహాసనే సంస్థితః
శ్రీమత్పూర్వకవాటనామకపురే సర్వేష్టసిద్ధిప్రదః
శ్రీ శ్రీపాదయతీంద్ర శేఖరమణి ర్భూయా త్సనః శ్రేయసే. [2]

క్రీ. 1440 నాఁటికిఁ బదునాలేండ్లవాఁడయిన యన్నమాచార్యుఁడీరాజోత్సవముల నెల్ల నెఱుఁగున్నాఁడు. నరసింహరాయలప్రార్థనమునఁ గాబోలును దఱచుగా విద్యానగరమున కరుగుచు నక్కడ వెలసియున్న వేల్పులపై పెక్కుసంకీర్తనముల రచించినాఁడు. ఆయాకాలములలో నాతని కక్కడిరాజుల దౌర్జన్యములు ప్రత్యక్షము లగుచుండెడివి. రాజ్యలబ్ధికై నాఁటిరాజులుచేసిన పితృభ్రాతృ పుత్రహత్యాదుల నాతఁడు సంకీర్తనములలో వివరించి విలపించినాఁడు.

---

1 మహామ్మదీయమహాయుగము.
2 దీనిని దొలుత కర్ణాటచరిత్రకారులు గుర్తించిరి.

శ్రీరాగం

వెఱతు వెఱతు నిందు వేడుకపడ నిట్టి
కుఱుచబుద్ధుల నెట్టు గూడుదునయ్యా ॥ పల్లవి ॥

దేహమిచ్చినవానిఁ దివిరిచంపెడువాఁడు।
ద్రోహిగాక నేఁడు దొరయటా।
ఆహికముగ నిట్టిఅధమవృత్తికిఁ కే।
సాహసమున నెట్టు చాలుదునయ్యా ॥ కుఱు ॥ 1

తోడఁబుట్టినవానిఁ దొడరి చంపెడువాఁడు।
చూడ దుష్టుఁడుగాక సుకృతియటా।
పాడై నయిటువంటి పాపబుద్ధులు నేసీ।
నీడ నిలువ నెట్టు నేరుతునయ్యా ॥ కుఱు ॥ 2

కొడుకు నున్నతమతిం గోరి చంపెడువాఁడు।
కడుఁ ఘాతకుఁడుగాక ఘనుఁడటా।
కడలేని యిటువంటి కలుషవృత్తికి నాత్మ।
వొడఁబఱపఁగ నేనెట్లోపుదునయ్యా ॥ కుఱు ॥ 3

తల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడు గాక।
యెల్లవారల కన్న నెక్కుడటా।
కల్లరి యనుచు లోకము రోయువని యిది।
చెల్లఁబో నే నేమిసేయుదు నయ్యా ॥ కుఱు ॥ 4

యింటివేలుపు వెంకటేశ్వరుఁ దనవెంట।
వెంటఁ దిప్పెడువాఁడు విభుఁడటా।
దంటనై యాతని దాసానుదాసినై।
వొంటి నుండెద నేమి నొల్ల నోయయ్యా ॥ కుఱు ॥ 5

అన్న. అధ్యా. 88 రేకు.

విజయనగర రాజ్యముమీఁదికి (కపిలేశ్వర, పురుషోత్తమ) గజపతులు దండెత్తి వచ్చునపుడో యింకెపుడో అన్నమయ విజయనగరములోనో స్వగ్రామముననో ఉండఁగా నాతని దేవతార్చన విగ్రహములను శత్రువు లెత్తుకొనిపోవుటో, స్థలముమార్పు గజిబిజిపాటులో నేమో అయిపోవుటో జరగి కానరాకపోఁగా సంకీర్తనరూపమున నిట్లు విలపించినాఁడు.

బౌళి

ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మా కిటువలె ।
పొంది యీతనిఁ బూజించఁ బొద్దాయ నిపుడు ॥ పల్లవి ॥

ధారుణి మైరావణు దండించి రాముఁ దెచ్చి ।
నేరుపు మించిన యంజనీతనయా ।
ఘోరనాగపాశములఁ గొట్టి వేసి యీతని ।
కారుణ్య మందినట్టి ఖగరాజ గరుడా ॥ ఇంది ॥ 1

నానాదేవతలకు నరసింహుఁ గంభములో ।
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా ।
మానవుఁడై కృష్ణుమహిమల విశ్వరూపు ।
పూని బండి నుంచుకొన్న పోటుబంట యర్జునా ॥ ఇంది ॥ 2

శ్రీవల్లభునకు నశేషకైంకర్యములా ।
శ్రీవెంకటాద్రివైన శేషమూరితి ।
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుఁడా యీ ।
దేవుని నీవేళ నిట్టె మాకుఁ దెచ్చి యీయరే ॥ ఇంది ॥ 3

అన్న. అధ్యా. 378 రేకు.

క్రీ 1440 ప్రాంతములనో తర్వాతనో తురుష్కులు గాఁబోలును జరపిన దౌర్జన్యము నన్నమాచార్యు డిట్లు చెప్పిచెప్పి చింతిల్లినాడు.

రామక్రియ.

తతిగాని యీపాటు దైవమా విచారించవే।
కతలాయఁ జెప్ప నేఁడు కలికాల మహిమా ॥ పల్లవి ॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు।
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో।
అటుబాలుల రొదలు ఆకాశ మెట్టోరిచెనో।
కటకటా యిట్లాయఁ గలికాలమహిమా ॥ తతి ॥ 1

అంగలార్చే కామినుల యంగభంగపు దోఁపు।
లింగితాన మింటసూర్యుఁ డెట్టు చూచెనో।
పొంగు నానాజాతిచేత భువన మెట్లానెనో।
కంగి లోక మిట్లాయఁ గలికాలమహిమా ॥ తతి ॥ 2

అరుదు గోహత్యలు సేయఁగ దూఁక లంగలార్వ।
పరిధర్మదేవ తెట్టు సమ్మతించెనో।
పరధనచూఱ కెట్టు పట్టాయనో లక్ష్మి।
కరుణ యెం దణఁగెనో కలికాలమహిమా ॥ తతి ॥ 3

దేవాలయాలు నానాదేశము లెల్లాఁ జొచ్చి।
దేవఁగా నెట్టుండిరో దేవతలు।
తావు లేలే రాజులకు దయ గొంత పుట్టదాయ।
కావరమే ఘనమాయఁ గలికాలమహిమా ॥ తతి ॥ 4

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను।
తెరల కెట్టుండిరో దిక్పాలులు।
విరసవర్తను లుండే విపరీతకాలమున।
గరువాలుం గపటాలె కలికాలమహిమా ॥ తతి ॥ 5

వృషమించి దంపతులు వొకరొకరినిం జూడ ।
చపలదుఃఖములతో సమయఁగాను ।
తపములు జపములు ధర్మము లెం దణఁగెనో ।
కపురుంబాపాలు నిండెఁ గలికాలమహిమా ॥ తతి ॥ 6

తలలు వట్టీడువఁగాను తల్లులు బిడ్డలవేయ ।
తలఁపెట్టుండెనో యంతర్యామికి ।
మలసి ముక్కులు గోయ మరుఁ డెట్టు వోరిచెనో ।
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమా ॥ తతి ॥ 7

దీనతలోఁబడి గుండెదిగు లసురుసురులు ।
వాని నెట్లు లోఁగొనెనో వాయుదేవుఁడు ।
గూనువంచి తల్లిచూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ ।
గానఁబడె నింతేసి కలికాలమహిమా ॥ తతి ॥ 8

పలుమాఱు నమ్మించి ప్రాణములు గొనఁగాను ।
యిలఁ దమలోఁ బ్రాణా లెట్లుండెనో ।
నెలవై శ్రీవెంకటేశ నీవే యెఱుంగుదువు ।
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమా ॥ తతి ॥ 9

అన్న. అధ్యా. 373 రేకు.

గజపతులు విద్యానగరము నాక్రమించినప్పు డాతఁ డొడ్డెబాన నేర్చుకోవలసినవాఁ డయినాఁడు గాఁబోలును. దీనిని సంకీర్తనమునఁ జెప్పుకొన్నాఁడు:—

మాళవి.

అన్నియు నాయందె కంటి నన్నిటివాఁడా నేన ।
మున్నె నా భావముతో ముడిచివేసినది ॥ పల్లవి ॥

చెలఁగి సంసారమే చింతించి సంసారినైతి ।
ములిఁగి ముక్తి దలంచి ముక్తుండనైతి ।

పలుమతాలు దలంచి పాషండబుద్ధినైతి।
చెలంగి శ్రీపతిఁ దలంచి శ్రీవైష్ణవుఁడనైతి ॥ అన్ని ॥ 1
పొసంగఁ బుణ్యముసేసి పుణ్యాత్ముఁడనైతి।
పసలఁ బాపముసేసి పాపకర్ముఁడనైతి।
వెస బ్రహ్మచారినైతి వేఁతే యాచారమున।
ముసిఁగి మఱి లోకాచారమున సన్యాసినైతి ॥ అన్ని ॥ 2
వాగి నొడ్డె భాషలాడి వొడ్డెవాఁడనైతిని।
తెగి తెలుంగాక నేర్చి తెలుఁగు వాఁడనైతి।
అగడై శ్రీవెంకటేశ అన్నియు విడిచి నేను।
తగు నీదాసుండనై దాసరినైతి ॥ అన్ని ॥ 3

అన్న. అధ్యా. 266 రేకు.

విజయనగరరాజ్యప్రధానరాజధాని విజయనగరమే అయినను నరసింహారాయఁ డందు స్థిరవాసముచేయ లేదేమో! రాజ్యసర్వస్వాక్రమణానంతరమో తత్పూర్వమో కొన్నాళ్లాతఁడు గొప్పదుర్గమగు పెనుగొండలోఁగూడ నుండెను గాఁబోలును. అన్నమాచార్యునిఁ బెనుగొండకు రావించుకొని సంకీర్తనములు వినిపింపవేఁడెను.

## అన్నమయపాడుట.

తేనెలపై తేట తిన్ననిచెఱకు
పానకముల నేరుపఱిచిన మేలు
చక్కెరలో తీపు చల్లఁదెమ్మెరలు
చిక్కని కపురంబు జీవరత్నములు
కలయమృతంబు మీఁగమీఁదిచవులు
చిలుకుచుఁగవు లెల్లఁజేయెత్తిమొక్క (చూ. 33 పుట.)

నన్నమయ పాడెను. తిరుమలాచార్యుఁడుగాఁబోలును అన్నమాచార్య సంకీర్తనముల నిట్లుసన్నుతించెను.

సురలకు నరులకు సొరిది వినవిన।
అరుదుతాళ్లపాక అన్నమయ్య పదములు ॥ పల్లవి ॥
చక్కెరలై చవిచూపీ జాలై తావి చల్లీ।
నక్కజపుమాఁతువజ్రాలై మెఱసీని।
నిక్కటద్దములై మానిలువు నీడలుచూపీ।
నక్కరతాళ్లపాక అన్నమయ్య పదములు ॥ సుర ॥ 1
పన్నీరై పైఁబూసీఁ గప్రంబై చలువ రేఁచీ।
మిన్నగల ముత్యములై మెయినిండీని।
వెన్నబలములై మావెంటవెంటఁ దిరిగీని।
అన్నిట తాళ్లపాకాన్నమయ్య పదములు ॥ సుర ॥ 2
నెట్టన వేదాంతములై నిత్యములై పొడచూపీ।
పుట్టుతోనె గురువులై బోధించీని।
గట్టి వరాలిచ్చే శ్రీవేంకటనాథుని మెప్పించీ।
నట్టె తాళ్లపాకఅన్నమయ్య పదములు ॥ సుర ॥ 3

శేషా. వ్రాఁతప్రతి.

వానిని విని యానందపరవశుఁడై నరసింహరాయఁ డాచార్యునిఁ జాల సత్కరించెను. పచ్చలకడియాలు మొదలుగా నాభరణాంబరాదు లొసఁగెను. అన్నమాచార్యుల కాలముననే తాళ్లపాకవారికి అగ్రహారములు లెన్నో ఉన్నట్లున్నవి. ఏలనఁగాఁ దత్పుత్రుఁడు పెదతిరుమలయ్య చాలా అగ్రహారములను స్వామికి సమర్పించెను. అందుఁ గొన్ని యేని యన్నమాచార్యుఁడు నరసింగరాయాదులవల్ల నార్జించి యుండును. అన్నమాచార్యచరిత్రలో 43 పుటలో నిట్లున్నది. "వెంకటాద్రిచెంగటను తనయగ్రహారమైతనరుచున్న [1] మరులుంకు(?)నొకజీడిమామిడిదాన"

---

1 ఇది "మరువాకర" కావచ్చును. ఈ పేరియగ్రహారమును అన్నమాచార్యుల కొమారుఁడు పెదతిరుమలాచార్యుఁడు స్వామికి సమర్పించెను.

అన్నమాచార్యుఁడు రాజనముతోఁ జాల వైభవముతోఁ గొన్నాళ్లు వెలుఁగొందెను. (చూ ౩౫ పుట).

## అన్నమయశృంగారకీర్తనలు.

ఈ రాయఁడు మరల నన్నమాచార్యుని నొకనాఁడు పిలిపించి స్వామివారిపై రచించిన శృంగార సంకీర్తనములు గొన్ని పాడ వేఁడెను. అన్నమయపాడెను. (చూ పుట ౩౯) అందు:—

చెలులార వెంకటశిఖరినాయకుని
"కలికికిఁ గడగంటఁ గనుపట్టునెఱుపు
చెలువ మేగతి నుండెఁ జెప్పరే" యనిన
"నలువునఁ బ్రాణేశునాటిన చూపు
నిలువునఁ బెఱుక నూనినశోణితంబు
తలపోయఁ గాదుగాదా యన్నపదము
పలుమఱుఁ బాడించి పాడించి చొక్కినాఁ" డట.

ఆ శృంగార సంకీర్తనమిది.

నాదనామక్రియ.

యేమొకో చిగురుటధరమున యెడనెడఁ గస్తురినిండెను।
భామిని విభునకు వ్రాసినపత్రిక కాదుగదా ॥ పల్లవి ॥
కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన।
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు।
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు।
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా ॥ ఏమొ ॥ 1
పడతికి చనుఁగవమెఱుఁగులు పైపైఁబయ్యెద వెలుపల।
కడుమించిన విధమేమో కనుఁగొనరే చెలులు।

ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖశశిరేఖలు ।
వెడలఁగ వేసవికాలపు వెన్నెల కాదుగదా ॥ ఏమొ ॥ 2
ముద్దియచెక్కుల కెలఁకుల ముత్యపుజల్లుల చేర్పుల ।
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు ।
గద్దరి తిరువేంకటపతి కౌఁగిటియధరామృతముల ।
అద్దిన సురతపువేళల అందము కాదుగదా ॥ ఏమొ ॥ 3

అన్న. శృంగా. 14 రేకు.

## రాజధిక్కారము.

రాయఁడు గర్వించి మైమఱచి వెంకటపతిమీఁది పదములవంటి పదములు నామీఁదఁ జెప్పు మని కోరఁగా అన్నమాచార్యుఁడు "హరి ముకుందునిఁ గొనియాడునాజిహ్వ నిన్నుఁ గొనియాడఁగ నేర" దని చెప్పి తిరస్కరించినాఁడు. (చూ. 31 పుట.) ఇట్టికథయే తిరుమళిశై ఆళ్వార్ల చరిత్రమునను గలదు. (చూ. పరమ. ఆళ్వా 2. పుట 92.)

లలిత

తలఁగరో లోకులు తడవకురో మమ్ము ।
కలిగిన దిదేమాకాపురమూ ॥ పల్లవి ॥
నరహరికీర్తన నానినజిహ్వ
ఒరుల నుతింపఁగ నోపదు జిహ్వా ।
మురహరుపదముల మ్రొక్కినశిరము ।
పరులవందనకుఁ బరగదుశిరము ॥ తల ॥ 1
శ్రీపతినే పూజించిన కరములు ।
చోఁపి యాచనకుఁ జొరవు కరములు ।
యేపున హరికడ కేఁగినకాళ్లు ।
పాపులయిండ్లకుఁ బారవుకాళ్లు ॥ తల ॥ 2

శ్రీవెంకటపతిఁ జింతించుమనసు ।
దావతి నితరముఁ దలఁచదు మనసు ।
దేవుం డతని యాధీనపు తనువు ।
తేవల నితరాధీనముగాదు ॥ తల ॥ 3

అన్న. అధ్యా. 135 రేకు.

పాడి.

పుట్టుభోగులము నేము భువి హరిదాసులము ।
నట్టనడిమిదొరలు నా కియ్యవలెనా ॥ పల్లవి ॥

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు ।
వెల్లివిరి మహాలక్ష్మి విలాసములు ।
తల్లి యాకె మగనినే దైవమని కొలిచేము ।
వొల్లనే మా కీసిరులు వొరులియ్యవలెనా ॥ పుట్టు ॥ 1

గ్రామములు రత్నములు గజముఖ్య వస్తువులు ।
ఆమని భూకాంతకు నంగభేదాలు ।
భామినియాకె మగని ప్రాణధారిలెంకలము ।
వోమి మాకాతఁడె యిచ్చీ వొరులయ్యవలెనా ॥ పుట్టు ॥ 2

వసగలబ్రహ్మపదవులు బ్రహ్మనిర్మితములు ।
వెస బ్రహ్మతండ్రి శ్రీవేంకటేశుండు ।
యెసఁగి యాతఁడే మమ్ము నేలి యిన్నియు నిచ్చె
వొసఁగిన మా సొమ్ములు వొరులియ్య వలెనా ॥ పుట్టు ॥ 3

అన్న. అధ్యా. 316 రేకు.

శుద్ధవసంతం.

చీచీ వివేకమా చిత్తపువికారమా
యేచి హరిఁగొలువక హీనుఁడాయ జీవుఁడు ॥ పల్లవి ॥

బతికే నంటాఁ బోయి పయిఁడి వచ్చుకతన ।
పతియవసరమునఁ బ్రాణ మిచ్చీని ।
బతు కందులోన నేది పసిఁడే యెక్కుడనుండు ।
గతి హరిఁ గొలువక కట్టువడె జీవుండు ॥ చీచీ ॥ 1

దొడ్డవాఁడ నయ్యేనని దొరలఁ గొలచి వారి ।
కడ్డము నిడుపు మొక్కి నతిదీనుఁడై ।
దొడ్డతన మేది యందు దొర యాఁడనున్నవాఁడు ।
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుండు ॥ చీచీ ॥ 2

చావనేల నోవనేల సారెఁ గిందుపడనేల ।
యీవల శ్రీవెంకటేశుఁ డింట నున్నాఁడు ।
దేవుఁ డాతఁడె నేఁడు తెలిసి కొలిచెఁగాని ।
భావించ కిన్నాళ్లదాఁకా భ్రమపడె జీవుండు ॥ చీచీ ॥ 3

అన్న. అధ్యా. 103 రేకు.

వరాళి.

ఎవ్వరివాఁడాఁ గాను యేమందు నిందుకు ।
నవ్వుచు నాలోని హరి నన్నుఁ గావవే ॥ పల్లవి ॥

కోపుల రాజుల నెల్ల కొలచి కొన్నాళ్లు మేను ।
చూపుడుఁ బూఁటవెట్టితి సొగిసి నేను ।
యేపున సంసారమున నిదిగాక కమ్మటాన ।
దాపుగ తొర్లుంబూఁట తగిలించుకొంటిని ॥ ఎవ్వ ॥ 1

మొదలఁ గర్మములకు మోనపోయి యీ బ్రదుకు ।
కుదువవెట్టితి నే గుఱిగానకా ।
వెదకి కాముని కివిషయములకు నే ।
నదివో నావయ నెల్ల నాహివెట్టితిని ॥ ఎవ్వ ॥ 2

ఇప్పుడే శ్రీవెంకటేశ యీడేర్చి నామనసు।
కప్పిన గురుఁడు నీకు క్రయమిచ్చెను।
ఒప్పించి రిందఱు బలువుఁడు చేపట్టె ననుచు।
అప్పు లెల్లఁ బాసి నీసొమ్మైతి నే నయ్యా ॥ ఎవ్వ ॥ 3

అన్న. అధ్యా. 325 రేకు.

## ఆచార్యునికి సంకెల.

రాయఁ డన్నమాచార్యునికి మూరురాయరగండ మని పేరుగల సంకెలవేయించి చెరసాలలోఁ బెట్టించెను. "సంకెల లిడువేళఁ జంపెడు వేళ సంకిలి ఋణదాత లాఁగెడువేళ" ఇత్యాదిగా నాతఁడు సంకీర్తనము చెప్పి సంకెల విడలించుకొన్నాడు. (చూ. 48 పుట.)

ముఖారి.

ఆఁకటివేళల నలపైనవేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱిలేదు ॥ పల్లవి ॥
కొఱమాలి వున్నవేళ కులము చెడినవేళ।
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ।
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక।
మఱచి తప్పిననైన మఱిలేదు తెఱఁగు ॥ ఆఁక ॥ 1
ఆపద వచ్చినవేళ నాఱడిఁ బడినవేళ।
పాపపువేళల భయపడినవేళ।
వోపినంత హరినామ మొక్కటే గతిగాక।
మాపుదాఁకాఁ బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ ఆఁక ॥ 2
సంకెలఁ బెట్టినవేళ చంపఁ బిలిచినవేళ।
అంకిలిగా నప్పులవా రాఁగినవేళ।

వెంకటేశు నామమే విడిపించ గతిగాక ।
మంకుబుద్ధిఁ బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ ఆఁక ॥ 3

అన్న. అధ్యా. 26 రేకు.

దేసాక్షి.

నీదాసులభంగములు నీవు చూతువా ।
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా ॥ పల్లవి ॥

పాలసముద్రముమీఁదఁ బవళించి నట్టి నీకు ।
జేలలై సురలు మొఱవెట్టినయట్టు ।
వేళతో మామనవులు విన్నవించితిమి నీకు ।
యేల నిద్దిరించేవు మ మ్మిట్టే రక్షించరాదా ॥ నీదాసు ॥ 1

ద్వారకానగరములో తగ నె త్త మాడే నీకు ।
బీరాన ద్రౌపది మొఱ వెట్టినయట్టు ।
ఘోరపు రాజసభలఁ గుంది విన్నవించితిమి ।
యేరీతి పరాకు నీకు నింక రక్షించరాదా ॥ నీదాసు ॥ 2

ఏనసి వైకుంఠములో నిందిరఁ గూడున్న నీకు ।
పెనఁగి గజము మొఱవెట్టినయట్టు ।
చనవుతో మాకోరిక సారె విన్నవించితిమి ।
విని శ్రీవెంకటేశుండ వేగ రక్షించరాదా ॥ నీదాసు ॥ 3

అన్న. అధ్యా. 247 రేకు.

సామంతం.

దానవర్గముల కెల్లా దరిదాపు మీరే కాన ।
వానికి నెక్కించరాదా వసుధలో మమ్మును ॥ పల్లవి ॥

సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా ।
శ్రీనాధునికి నేము సేసేవిన్నపము ।

ఆనుక భాష్యకారులు అట్టే మీరుం జేయరాదా ।
మానక విన్నపముల మామనవిచనవులు ॥ దాస ॥ 1
వేయినోళ్ల భోగి నీవు విన్నపముసేయరాదా ।
వేయేసి మావిన్నపాలు విష్ణునికిని ।
ఆయితమై గరుడండ అట్టే మీరుం జేయరాదా
యేయెడ విన్నపము మా కేమి వలసినాను ॥ దాస ॥ 2
దేవులమ్మ యిందిర మాదిక్కై విన్నవించరాదా ।
శ్రీవెంకటపతికి చిత్తమందను ।
ఆవేళ శేషాచలమ అట్టే మీరుం జేయరాదా ।
యీవేళ మావిన్నపము లీడేరే నింకను ॥ దాస ॥ 3

అన్న. అధ్యా 247 రేకు.

ఆచార్యుని మాహాత్మ్యమున కచ్చెరువడి నరసింగరాయఁడు ?రణువేఁడి యాతనిచే ననుగ్రహీతుఁ డయ్యెను (చూ 39 పుట.)

## రాయలకైంకర్యములు.

విజయనగరరాజ్యమున సురక్షితుఁడై నరసింగరాయఁడు 1495 ?ాఁక రాజ్యమేలెను. సంస్కృతమునఁ దచ్చరిత్రము సాళ్వాభ్యుదయమని ?చితమయ్యెను. రాయఁడే రామాభ్యుదయమని కావ్యము రచించెను. ?రన యాతనిని శ్రీవెంకటాద్రినాథ దయావర్ధితరాజ్యుఁడని రత్నాంశుమ ?త్కాంచీవెంకట కాళహస్తి నగరీకళ్యాణసౌధాంచల ప్రాంచచ్చాళనుఁడనీ ?ాను గృతిచేసిన జైమిని భారతమున వర్ణించినాఁడు.

శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి కీర్తఁ డనేకోత్సవ విశేషములు ? వేద్యవిశేషములు, ఆభరణవిశేషములు, ప్రాకారమండప సోపానాది ?ర్మాణవిశేషములు ధనవ్యయముతో వెలయించినాఁడు, వానిని ?ార్చి

శాసనములు పదునాలు గున్నవి. స్వామి కైంకర్యపరాయణులై కొండ మీఁదఁ బ్రఖ్యాతి గాంచియున్న కందాళ రామానుజ జియ్యంగారి కీతఁడు శిష్యుఁ డయ్యెను. పై కైంకర్యములు స్వామికిఁ గావించుటలో నన్నమాచార్యులయు నా జియ్యంగార్లయు నుపదేశముల నాతఁడు పాటించు చుండవచ్చును.

## నాఁటియన్నమయ.

ఆనాళ్ళలో నన్నమాచార్యుఁడు తనయగ్రహారములలోను దాళ్ల పాకలోను గొంతకాలము వసించుచువచ్చినను దిగువ తిరుపతిలోను గొండమీఁద స్వామిసన్నిధిని నెక్కువకాలము గడపుచువచ్చెను. ఆ చోట్ల గృహాదివసతు లాతనికాలముననే యేర్పడెను. ఆతని కుమారుని నాళ్లలోఁ గొండమీఁదను దిగువతిరుపతిలోను దమగృహములముందు మండపముల గట్టించి యక్కడ స్వామిని వేంచేపు చేయించి యుత్సవాదులు జరపించుట సాగెను.

### గుండక్రియ.

కోటికిం బడగెత్తి కొంకనేల ।
యీటులేని పదమెక్కి ఇంకనేల చింత ॥ పల్లవి ॥

పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి ।
కట్టినది మొలఁ జిన్న కౌపీనము ।
పట్టినది శ్రీహరిపాదపద్మమూలము ।
యెట్టయినా మాకుమేలె యింకనేలచింత ॥ కోటి ॥ 1

చిక్కినాలో నైనది శ్రీవైష్ణవధర్మము ।
తొక్కినది భవముల తుది పదము ।
యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగు ।
యెక్కువ కెక్కువేకాక యింకనేల చింత ॥ కోటి ॥ 2

చిత్తములో నిండినది శ్రీపతిరూపము।
హత్తినది వైరాగ్య మాత్మధనము।
యెత్తలం జూచిన మాకు నిదివో శ్రీవేంకటేశుం।
డెత్తి మముc గావcగాను యింకనేల చింత ॥ కోటి ॥ 3

అన్న. అధ్యా. 307 రేకు.

## కొండకుcబయనము.

అన్నమాచార్యుcడు పెనుగొండ (రాయలరాజ్యస్థాని) నో తాళ్ల పాకనో వీడి స్వామిని దర్శింప రాcగోరి చెప్పినసంకీర్తనము:—

లలిత.

రామ కృష్ణ నీవు నందె రాజ్యమేలుచుండుదువు।
యేమి నేనే విక్కడ నీయిరవుకే పదవే ॥ పల్లవి ॥

లంక విభీషణునుంచ లక్ష్మణుని నంపినట్టు।
అంకె సుగ్రీవుc గిష్కింధ కంపినయట్టు।
వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు।
వెంకటాద్రి వొంతనుండ వేగ మమ్ము నంపవే ॥ రామ ॥ 1

ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు।
అనుcగుc గవులనిండ్ల కంపినట్టు।
వొనర గోపికలొద్ద కుద్ధవుని నంపినట్టు।
ననువు శేషాద్రి నుండ నన్ను నంపవే ॥ రామ ॥ 2

పెండిలికిc బరుసలc బిలువcగ నంపినట్టు।
అండనె ముందరc గంత కంపినయట్టు।
పెండియు శ్రీవెంకటేశ వెంటవచ్చి మరలితి।
వుండువోటనుండి నన్ను వూడిగాన కంపవే ॥ రామ ॥ 3

అన్న. అధ్యా. 275 రేకు.

## అన్నలజోల

అన్నమాచార్యుఁడు శృంగారమంజరి[1] యనుమంజరీచ్ఛందోమ యరచనను భాషచే భావముచే శృంగారసుందరమైనదానిని శ్రీవెంకటేశ్వరస్వామివారిపై రచింపఁగాఁజిత్తగించి స్వామి యన్నమాచార్యు నిట్లను గ్రహించెను. ( చూ. పుట. 41. )

శృంగారమంజరిఁ జేసి శేషాద్రి
శృంగవాసునకు నర్పించి యిచ్చుటయు
నాడుచుఁ బతకమాకన్నల జోల
పాడఁగ నాఁడెల్లఁ బసిబిడ్డనైతి
నాకృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి
రాకఁ గొన్నాళ్లు విరక్తుండనైతి
జగతి నీశృంగార సంకీర్తనముల
కగపడి మంచిప్రాయపువాఁడ నయితి
నని వెంకటేశ్వరుఁ డన్నమాచార్యుఁ
గనుఁగొని వాక్రుచ్చి గారవించుటయు

పై గ్రంథభాగమునఁ దొలుత పతకమాకన్నలజోల, తర్వాత కృష్ణమాచార్యునధ్యాత్మవినుతి కలవు. కష్ణమాచార్యుఁడు కాకతీయ ప్రతాప రుద్రుని నాఁటివాఁడు. కాన యాతని వినుతికి ముందు గల పతకమా' కన్నలజోల యంత కింకను బ్రాచీనము కాఁబోలును. అది యెట్టిదో యెక్కడేని కలదేమో తెలియఁ జాలకున్నాను. వాక్యము సరిగానున్నదో లేదో కూడఁ దెలియదు. పతకమాక ఊరిపేరేమో! అది పతకమాకో లేక పతకమూరో పొతకమూరో ఇంకేదో అయూరివాఁ డయిన అన్నలు అనుగేయకవి జోలపాట రచించి యాడుచు నొండె

---

1 ముద్రితము. తాళ్లపాకరచనలు 1 వాల్యూం.

స్వామి బాలుఁడై యాడఁగానొండొఁబాడెడివాఁడని యర్థముకాఁబోలును. పయిపతకమాకయన్నలజోల సుప్రఖ్యాతమయితాళ్ల పాకవారు మెచ్చిన దయి యుండును.

రాగితేకులలో అన్నమాచార్యుఁడు రచించినవే యనేకములు జోలలున్నవి. వేలకొలఁదిగా నున్నయాశృంగారసంకీర్తన లెల్ల నీఁక సుపరి శోధితములు ముద్రితములును గావలసియున్నవి.

## అన్నమయజోల.

ఇటీవల నొక జోలపాటను లోకమున వ్యాపించిన దానిని నన్న మాచార్యుని పేరనుండుట గుర్తించితిని.[1]

రాగం. అటతాళం.

జో వచ్యుతానంద జోజో ముకుంద ।
రావె పరమానంద రామగోవింద ॥ జో ॥

❖ ❖ ❖

అంగజునిగన్నమాయన్న యిటు రారా ।
బంగారుగిన్నెలోఁ బాలు పోసేరా ।
దొంగ నీవనిసతులు పొంగుచున్నారా ।
ముంగిట నాడరా మోహనాకారా ॥ జో ॥

❖ ❖ ❖

గోవర్ధనం బెల్ల గొడుగుగాఁ బట్టి ।
కావరమ్మున నున్నకంసుఁ బడగొట్టి ।
నీవు మధురాపురము నేలఁ జేపట్టి ।
ఠీవితో నేలిన దేవకిపట్టి ॥ జో ॥

---

1 శ్రీవిస్సా అప్పారావుగారి యింట వారి పూర్వులువ్రాసి యుంచుకొన్న మంచి సంకీర్తనములసంచయములోనిది. చిరంజీవి తి. కోదండరామయ్య ఆంధ్ర 8-9-48 వార్త పత్రికలోఁ బ్రకటించెను.

అంగుగాఁ దాళ్లపాకాన్నయ్య చాల ।
శృంగారరచనగాఁ జెప్పె నీజోల ।
సంగతిగ సకలసంపదల నీవేళ ।
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥ జో ॥ 3

ఈ జోలలో అన్నమాచార్యుని పేరున్నది గాని యది తిరుపట్ల బాలగోపాలదేవునిముద్రతో మాత్రమే యున్నది. నేను ముప్పదేండ్లకుఁ బూర్వము తంజావూరిలైబ్రరినుండి ఈజోల కొన్నిచరణములు వ్రాసి యుంచుకొనుట నిటీవలఁ జూచితిని. అది వేఱుతీరుగానున్నట్టున్నది. అందీ చరణమున్నది:—

అలిగి తృణావర్తు నవనిఁ గూల్చితివి ।
బలిమిమైఁ బూతనఁ బట్టి పీల్చితివి ।
చెలఁగి శకటాసురునిఁ జేరి డొల్చితివి ।
తలఁచి మద్దులు రెండు ధరణి వ్రాల్చితివి ॥

అన్నమయ శ్రీవెంకటేశ్వరస్వామి మీఁదనే కాక యింక ననేకపుణ్యక్షేత్రములలోని దేవతలమీఁదఁగూడ సంకీర్తనములు రచించినాఁడు. ఆసంకీర్తనములలోఁ బెక్కింట నాయాక్షేత్రముల దేవతలపేర్లతో సభేదము గల్పించి తుదిచరణమున శ్రీతిరుపతివెంకటేశ్వరస్వామి నామముద్రికను నెట్టుకొల్పుచుండును. ఈజోలలో స్వామినామముద్ర లేదు. ఇది యిక్కడి రాగిరేకులలో నున్నదో లేదో.

## అన్నమయలాలి.

తంజావూరిపుస్తకశాలనుండి యిటీవలఁ గొన్ని తాళ్లపాకసంకీర్తనములు వ్రాయించి తెప్పించితిమి. అందు మీఁదిజోలవంటి దొకలాలి కలదు. దానఁగూడ గండవరపు బాలగోపాలుని నామాంకమున్నదిగాని శ్రీవెంకటేశ్వరస్వామినామాంకము గానరాదు. అన్నమయపేరందు లేకపోయినను గండవరము తాళ్లపాకవారికిఁ జెల్లుచువచ్చినగ్రామమని తెలియుటచేఁ దమయూరిస్వామి మీఁద నన్నమాచార్యుఁడో తత్పుత్త్రపౌత్త్రులో దానిని రచించి యుందురనుకొంటిని, అదియిది:—

శ్రీరాగం. జంపెతాళం

లా లనుచు నూచేరు లలన లిరుగడల ।
బాల గండవరగోపాల నినుఁ జాల ॥ పల్లవి ॥

ఉదుటుగుబ్బలసరము లుయ్యాల లూఁగ ।
పదరి కంకణరవము బహుగతుల మ్రోఁగ ।
వొదిఁగి చెంపలకొప్పు లొక్కింత వీఁగ ।
ముదురుచెమటల నళికములు తొప్పఁదోఁగ ॥ లాలి ॥

సొలపుఁదెలిగన్నుఁగవచూపు లిరువంక ।
మలయురవళులకుఁ బలుమాఱును బెళంక ।
కొలఁదికోవిలగములు క్రోలుమదనాంక ।
ములఁ గ్రేణిసేయు రవములు వడిఁ దలంక ॥ లాలి ॥ 2

సరసపదములు జంగచాపుచేఁ బాయ ।
గురులీల మీఁగాళ్లఁ గుచ్చెళ్లు రాయ ।
కరమూలములకాంతి కడుఁజాయఁ జేయ ।
సరస నురుకుసుమవాసన లెదురు డాయ ॥ లాలి ॥ 3

కొలఁది నునుమేను లతకూన లసియాడ ।
మెలఁకువతో నొకరొకరి మెచ్చి సరిగూడ ।
తల లూఁచి చొక్కి చిత్తరుబొమ్మ లాడ ।
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ ॥ లాలి ॥ 4

లలితతాంబూలరసకలితంబు లైన ।
తళుకుదంతములు కెంపులగుంపులీన ।
మొలకవెన్నెలడాలు ముసురుకొనితోఁప ।
చెలఁగి సెలవుల ముద్దుచిఱునవ్వులాన ॥ లాలి ॥ 5

మలయమారుతగతులు మాటికిఁ జెలఁగ।
పలుకుఁగపురపుతావి పైపై మొలఁగ।
బలుగానలహరి యింపుల రాల్గరఁగ।
బలసి వినువారిచెవి బడలిక దొలఁగ ॥ లాలి॥ 6

లలనాజనాపాంగలలితసుమచాప।
జలజలోచనదేవ సద్గుణకలాప।
తలఁపులోపలమెలఁగు తత్వప్రదీప।
భళిర గండవరేశ పరమాత్మరూప ॥ లాలి ॥ 7

## అన్నమయమహిమలు.

మండెమురాయనామక నరసింహదండనేత్రు (తృ?) నకిష్టధనబల స్ఫూర్తి నిత్యాదివాక్యములకు (చూ 43 పుట.) స్పష్టముగా నర్థమెఱుఁ గరాదు. మండెమురాయఁ డన్నపేరు మండెముగ్రామమున వెలసిన నరసింహస్వామికిఁ గలదు. చండనేత్రుఁ డనియో? దండనేత్రుఁడనియో? దండనేతృఁడని దిద్ది దండనాథుఁడని యర్థముగుదుర్చుకొనఁగా నాతఁడు సాళువనరసింహరాయని విద్యానగర సామ్రాజ్యలాభమునకుఁ జాలఁ దోడుపడినవాఁడును, నరసింగరాయని తర్వాత నిమ్మడినరసింహరాయఁ డను తత్పుత్త్రుఁడు పేరి కల్పకాలము రాజుగా నున్నను విద్యానగర సామ్రాజ్యము నాక్రమించుకొన్నవాఁడును నగు నరసింహదండనాథుఁడు కాఁగలఁడు. అన్నమాచార్యు నగ్రహారము మరులుంకు (మరు వాకరై ?) ఆదండనాథున కిష్టమగు ధనబలస్ఫూర్తి కలది గాఁబోలును. (చూ 43 పుట.) ఆగ్రామమునఁగల జీడికంపు పుల్లమామిడి పండ్లను స్వామికి నివేదనచేసి తా నారగింపఁగా నన్నమాచార్యునకుఁ బండ్లు పులిసెను. అపచారము క్షమింప స్వామినివేఁడి దానిని దియ్యమామిడిని జేయ నర్థింపఁగా స్వామియనుగ్రహమున నది తియ్యమామిడియయ్యెను. ఈవిషయము నీ యన్నమాచార్యచరిత్రమేకాక పెదతిరుమలాచార్యుని గూర్చియున్న సంకీర్తనము కూడ నిరూపించు చున్నది.

(రాగము పేరు లేదు)

కరము జీడిపులుసు గలిగిన మామిడి కరముసోకిన యంతనే।
సరవిఁ జక్కెరవలెఁజవిగలిగించువాని చనవరిసుతుఁడితఁడే ॥పల్లవి॥

వేఁకరి మండెముకోట వెళ్లుతా విచ్చనవిడిరాఁగా నొక।
వీఁకతో వేసిన కత్తి తునుకలాయ వెన్ను సోకినయంతనే।
ఆకాలమునాఁడు రాతినాతిఁ జేసె అతడేపో యీతఁడు।
వాకుచ్చి పొగడరో ఘనపుణ్యము తాళ్ళపాకతిరుమలయ్యను ॥ కర ॥ 1

గుములుగూడి యలుఁగులుతిరుగబాఱిచుట్టుకొన్న కురువదోవనతఁడు।
కమలనయనునిఁదలఁచినమాత్రాన కకపికలై పాఱెను।
అమరఁబాంచాలికి వలువ లొసఁగి నతఁడె వోయీతఁడు।
ప్రమదముతో దుత పేరుకొనరే తాళ్ళపాకతిరుమలయ్యను ॥ కర ॥ 2

దేవుఁ డొక కన్నుదయచేసి తనవద్దికి నంపిన నతఁడు।
పావనుఁ డితఁడు తానొక్కకన్నిచ్చి పరుషలు చూడఁగా।
శ్రీవెంకటప్పని సేవచేయఁగోరి చేకొన్నతను వితఁడు।
భావించి పొగడరో భాగ్యముగల తాళ్ళపాకతిరుమలయ్యను ॥ కర ॥ 3

శేషాచార్యులవారి వ్రాఁతప్రతి.

ఈ సంకీర్తనమున, 2. 3. చరణముల విషయములు పెదతిరుమలాచార్యునికి సంబంధించినవి. ప్రజ లన్నమయ మాహాత్మ్యమును వశ్యవాక్కును దెలిసికొని యేమేవో యర్థించి వెంటాడసాగిరి.

ఆవార్తవిని జను లరు దంది కొనుచు
వావిరి నొడి వళావళికి గాఁ బెగడి
చెలువొందు నా గురుశ్రీపాదరక్ష
తలనిడి తమయాపదల వీడుకొనిరి
అమాయికప్రజల యీ యలజడికి జడిసి చేసినసంకీర్తనము:—

ముఖారి.

పరమాత్మ నిన్నుఁ గొల్చి బ్రదికేము ।
నిరసపు జాలిఁ జిక్కి వెతఁబడ నోపము ॥ పల్లవి ॥

మగఁడు విడిచినా మామ విడువని యట్లు ।
నగినా మనసు రోసినా లోకులు మానరు ।
తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు ।
మొగి మోటలను నేను మోసపోవ నోపను ॥ పర ॥ 1

పొసఁగ దేవుఁ డిచ్చినా పూజరి వరమీఁడు ।
విసిగి నేవిడిచినా విడువడువరు లోకులు ।
కొసరేరు ముసరేరు కోరిక దీర్చుమనేరు ।
పసలేని పసులకు బడలనే నోపను ॥ పర ॥ 2

నుడుగుట దప్పినా నోముఫల మిచ్చినట్లు ।
కడఁగి వేఁడుకొన్నాఁ గానిమ్మనరు లోకులు ।
తడవేరు తగిలేరు తామె శ్రీవెంకటేశ ।
బుడిబుడి సంగాతాలఁ బొరల నే నోపను ॥ పర ॥ 3

అన్న. అధ్యా. 232 తేకు.

## అన్నమాచార్య పురందరదాసులు.

కర్ణాట భాషలో వేలకొలఁది సంకీర్తనముల రచించి మహానుభావుఁడని ప్రఖ్యాతి గాంచిన శ్రీపురందరదాసుఁ డన్నమాచార్యుని దర్శింప వచ్చి యతని సంకీర్తనములు విని తనిసి నీవు శ్రీవెంకటేశ్వరుని యవతారమవేయని సన్నుతింపఁగా నన్నమాచార్యుఁడు పురందరదాసుని సంకీర్తనములు విని తనిసి నీవు శ్రీపాండురంగవిట్ఠలుని యవతారమవే యని సన్నుతించెనట. (చూ. 44, పుట.) పురందరదాసులవారు

శ్రీవ్యాస తీర్థులవారి శిష్యులని ప్రతీతి. వ్యాసతీర్థులవారు సాళ్వనరసింగరాయనికాలమునఁ గూడఁ గలరు. శ్రీకృష్ణరాయలకు వారు గురువులు. వయసున చిన్నవారయినను వ్యాసతీర్థులను సన్న్యాసాశ్రమస్వీకారముచే గురువర్యులనుగాఁ బురందరదాసులవారు పూజించియుందురు. అన్నమాచార్యుని వార్ధకమునఁ బురందరదాసులవారు చాలఁ జిన్నవారై దర్శించి యుందురు. పురందరదాసుల పారన్నమార్యుల సంకీర్తనముల ననుకరించి సంకీర్తనముల రచించిరి. మచ్చునకొక్కటి:—

మాళవి రాగం.

శరణుశరణు సురేంద్ర సన్నుత శరణు శ్రీసతివల్లభా ।
శరణురాక్షసగర్వ సంహార శరణు వెంకటనాయకా ॥ పల్లవి ॥
కమల ధరుఁడును కమలమిత్రుఁడు కమలశత్రుఁడు పుత్రుఁడు ।
క్రమముతో మీకొలువు కిప్పుడు కాచినా రెచ్చరికయా ॥ శర ॥
అనిమిషేంద్రులు మునులు దిక్పతు లమర కిన్నర సిద్ధులు ।
ఘనతతో రంభాదికాంతలు కాచినా రెచ్చరికయా ॥ శర ॥
ఎన్నఁగల ప్రహ్లాదముఖ్యులు నిన్నుఁ గొలువఁగ వచ్చిరీ ।
విన్నపము వినవయ్య తిరుపతి వెంకటాచలనాయకా ॥ ॥ శర ॥

భజనపద్ధతిలో అన్నమార్యునిదిగా నాఁటనుండి నేఁటిదాఁక సాగుచున్న యీ పై సంకీర్తమును జదివి పురందరదాసుగారి యీక్రింది సంకీర్తనమును గూడఁ జదువుఁడు.

మాళవి రాగం

శరణు శరణు సురేంద్ర వందిత శరణు శ్రీపతిసేవిత ।
శరణు పార్వతితనయ మారుతి శరణు సిద్ధివినాయక ॥ పల్లవి ॥
నిటలనేత్రన దేవిసుతనె నాగభూషణప్రియనె ।
తటిల్లతాంకిత కోమలాంగనె కర్ణకుండల ధారనె। ॥ శర ॥

బటువుముత్తిన పదకహారనె బావులు హస్తచతుష్కనె।
ఇట్టితొడగియు హేమకంకణ పాశఅంకుశ ధారనె ॥ శర ॥
కుక్షియొళు మహాలంబోదరనె ఇక్షుచాప గెలిదనె।
పక్షివాహన నాద పురందరవిఠ్ఠలన నిజదాసనె ॥ శర ॥

అన్నమాచార్యులవారి సంకీర్తనచ్ఛాయనే పురందరదాసులవారి కీర్తన మున్నది.

## సంకీర్తన సంఖ్య.

అన్నమాచార్యుఁడు యోగవైరాగ్య శృంగార మార్గములలో ముప్పదిరెండువేల సంకీర్తనములఁ జెప్పెనని కలదు. (చూ. 45 పుట.) ఆతఁడు తన పదునాఱేండ్లవయసున నుపక్రమించి దివ్యధామ మందుదాఁక దినమున కొక సంకీర్తనము చొప్పున సంకీర్తనములు రచించినట్లున్నది.[1] అట్లు లెక్కింపగా నించుమించుగా నిర్వదిమూఁడువేల సంకీర్తనములు లెక్కకు వచ్చును. ఇందు ముప్పదిరెండువేల సంకీర్తనములు రచించినట్లున్నది. "పరమతంత్రమ్ములిర్వదిరెండువేలు" అనియుండవలెనో. కానిచో ఆరాగిరేకు మీఁదివాక్యమునకుఁ బ్రతిదినము నొక్కదానికిఁ దక్కువ కానీక సంకీర్తనములు రచించుచుండెనని యర్థము చెప్పికొనవలెనో. రెండవతీరను కొందుమేని ముప్పదిరెండువేల సంకీర్తనములు రచించెననుట సంగతమే. రచించిన యా సంకీర్తనములెల్ల రాగిరేకుల కెక్కనే లేదో? ఎక్కినను నిప్పుడు మనకు దొరకలేదో? తిరుపతిదేవస్థానమునఁ గాక అహోబలమునకుఁ గొన్ని రేకులు చేరియున్నట్లు తెలియుచున్నదిగదా. ఇంక నెన్ని యెప్పు డెక్కడికిఁ జేరినవో? క్రీ 1560 ప్రాంతములదాఁక సంకీర్తనములను రాగిరేకుల

1 (చూ) అన్నమాచార్యుల శృంగార సంకీర్తనముల మొదటి రేకు. అధ్యాత్మ సంకీర్తనముల మొదటి రేకు.

మీఁదఁ జెక్కించుట జరగినట్లున్నది. విద్యానగర విప్లవముకాలమున దక్కినవానిఁ జెక్కించుట సాగక తాళపత్రములమీఁదనే యుండఁగా కాలవశమున నవియుఁ జెడియుండును. 1560 క్రి పూర్వమే కొన్ని సంకీర్తనములు తంజావూరికిఁ జేరియుండును. అక్కడఁ గలసంకీర్తనములన్నియుఁ దిరుపతిరాగిరేకులమీఁద నున్నవో లేవో? శేషాచార్యులవారి తాళపత్రప్రతిలోనిసంకీర్తనములు గూడ నన్నియు రాగిరేకులమీఁది కెక్కినవో లేవో? పెదతిరుమలాచార్యుఁడుగూడ దినమున కొకసంకీర్తనముచొప్పునఁ దండ్రియానతిని రచించెను. అవికొన్ని వేలుండవలెనుగదా! కానరావు.

## ద్విపదరామాయణము.

అన్నమాచారుఁడు ద్విపదముగా నవముగా రామాయణమును గూడ రచించెనట. ద్విపదరచనమంతకు ముం దింకొకటి కలదని సూచించుటకు నవముగా ననుట. ఈతని రామాయణరచనము నేఁడు గానరాదు కాని రామాయణకథాప్రసక్తములు సంకీర్తనము లనేకము

1 తిరుపతి దేవస్థానమునగల రాగిరేకులలో నన్నమాచార్యుల రచనము లనఁ గొనఁదగినవి యించుమించుగా రెండువేలుండును. అన్నమాచార్యునిసంకీర్తనముల తొలిరేకున నామాంకముగలిగి ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఇత్యాది క్రమసంఖ్యాంకములతో రేకుల యడ్డము నిడుపుల సమపరిమాణముతో నున్న రేకుల సంఖ్యను, ఇంచుమించుగా రేకున కాఱు పాటల చొప్పుననున్న పాటలసంఖ్యను, బరిగణించి యీమొత్తము గుర్తింపఁగల్గితిమి. అట్లె తొలిరేకుపై పెదతిరుమలాచార్యుల నామాంకముతో 1, 2, 3, సంఖ్యాక్రమముగలరేకులను వానియడ్డము నిడువుకొల్తల పృథక్త్వమును గమనించి పెదతిరుమలాచార్యుల సంకీర్తనములసంఖ్యను, చిన్నతిరుమలాచార్యుల సంకీర్తనములసంఖ్యను గుర్తింపఁగల్గితిమి.

కాని, యన్నమాచార్యులరేకులని కొల్తలపరిమాణము, సంఖ్యాను[illegible]ర్వియుగల రేకులలోఁగూడఁ గొన్ని యన్నమాచార్యప్రసక్తములు తత్పుత్రుఁడో [illegible] పౌ[illegible]తుఁడో రచించినవికూడఁ గలవేఁగాఁ బోలునని కొన్నిసంకీర్తనములలోని వి[illegible]లఁబట్టి సందేహింప నవకాశముకలిగినది.

లున్నవి. రాగిరేకులమీఁద నన్నమాచార్యుల సంకీర్తనములను శృంగార మంజరిని మాత్రమే తత్పుత్రుఁడు పెదతిరుమలాచార్యుఁడు చెక్కించెను గాఁబోలును.[1]

## వెంకటాచలమాహాత్మ్యము.

సంస్కృతభాషలో శ్రీవెంకటాచలమహాత్మ్యము నన్నమాచార్యుఁడు రచించెను. (చూ. 46 పుట) వరాహపురాణాదులలో నిదిగా సంఘటితమయి పదునేడు పదునెనిమిది శతాబ్దముల పిదప తెల్గు పరివర్తనము పడసి ప్రాచీనతాళపత్త్రిప్రతులు గలిగి యిప్పుడు నాగ రాంధ్రాక్షరములలో ముద్రితమై వ్యాప్తిగాంచియున్న వేంకటాచల మాహాత్మ్యము నాఁడు తాళ్లపాకయన్నమాచార్యుఁడు రచించినది యయినను గావచ్చును. అష్టాదశపురాణములలోఁ జేరినవిగాఁ గాన వచ్చుస్థలమాహాత్మ్యముల నన్నింటిని సమకూర్చి గ్రంథసంఖ్యను గణించినచో నష్టాదశపురాణములకుఁ బ్రాచీనులే పరిగణించిన గ్రంథసంఖ్య కంటె నీ స్థలహాత్మ్యముల గ్రంథసంఖ్య చాల మీఁటిపోఁగలదు. వ్రాఁత ప్రతులుగలిగి పురాణక్రమ నిర్వచనమునఁ జెప్పఁబడిన మాను పూర్విగలిగి యనేకస్థలములం దుపలభ్యమానము లగుటచే ముద్రితములయిన యష్టా దశపురాణములలో నాయాస్థలపురాణములు నూటికిఁ దొంబదితొమ్మిది వంతులు గానవచ్చుటలేదు. పురాణపు ముద్రాపకులు కొన్నిస్థల పురాణములను నేటిపురాణముద్రణములందుఁ జేర్చుటయు జరగకపో లేదు. అది యొక మహత్తరచర్చ. అధ్యాయసంఖ్యలు, పురాణముల పేళ్లు ఉన్నను నేటిస్థలపురాణము లెల్ల నాయాపురాణములలో దొలుత రచితములు గావచుట ప్రఖ్యాతసత్యార్థము. ఇంచుమించుగా నిట్టిస్థల మహాత్మ్యములు పదుమూఁడు పదునాల్గు శతాబ్దములనుండి నిన్నటినేటి దాఁకఁగూడ నుప్పతిల్లుచునేయున్నవి. కాన అన్నమాచార్యుఁడురచించి నాఁడన్న వేంకటాచలమహాత్మ్యమిప్పుడు ప్రఖ్యాతముగానున్న వేంకటా

చలమాహాత్మ్యము కావచ్చుననుట నిర్ధారపడవలసిన విషయముకాదు. ఆతఁ డేదో సంస్కృతము ననుసరించి తెల్గున స్థలమాహాత్మ్యము రచించె ననఁ గాదు. "దివ్యభాష। నావేంకటాద్రిమాహాత్మ్య మంతయును। రచించె" ననికలదు. జియ్యర్ రామానుజయ్యంగా రనువారు క్రీ. 1491 నాఁడు (అప్పటికన్నమాచార్యుఁడెబువదియేడేండ్లవయసువాఁడు) తాను విన్నపముచేసిన తిరువేంకటాచలమాహాత్మ్యమునకు శ్రీ స్వామివారు స్వీకారముచిత్తగించి ఆలకింప ననుగ్రహించునట్లు చేయుటకును, గొన్ని యుత్సవములు జరుపుటకును ఉభయముగాఁ గొంత ద్రవ్య మొసఁగి. స్థానాధిపతులచే శిలాశాసనము చెక్కించుకొన్నారు.[1] ఆ రామానుజ జియంగారు కవీశ్వరుఁ డయిన యన్నమాచార్యునిచే వేంకటాద్రిమాహాత్మ్యమును రచింపించి తనసమర్పణముగా స్వామిసన్నిధిని విన్నపింపఁగోరి యుండవచ్చును. పెదతిరుమలాచార్యుఁడు స్వామిసన్నిధిని వేంకటాచల మాహాత్మ్యమును బఠించుటకుఁగాను అనంతాచార్యు లనువారికిఁ గొంత జీవిక యేర్పఱిచెనట. అది పితృదేవరచితమన్న యభిమానముచేఁ జేసిన దయినఁ గావచ్చును. అంతకుఁబూర్వమే యీస్థలమాహాత్మ్యసముచ్చ యము కలదని నిరూపింపఁగల సాధనములు గానరా నంతవఱకు నిది యన్నమాచార్య రచితమని తలఁచుట యసంగతముగాదు. ఇప్పుడున్న పురాణములలోని వేంకటాచలమాహాత్మ్య భాగములు వేర్వేఱు రచనము లను కొన్నచో నందుఁగొన్ని యయినను నీతని రచనములు గావచ్చును.

వరాహబ్రహ్మాండములలో వేంకటేశ్వర విషయ మున్న ట్టీక్రింది సంకీ ర్తనమున నన్నమాచార్యుఁడో పెదతిరుమలాచార్యుఁడో చెప్పినాఁడు.

1 చూ. తిరుపతి శిలాశాసనముల వాల్యూం II నెం 95 శాసనము.

బౌళి

శ్రీవేంకటేశుండు శ్రీపతియు నితఁడె।
పావనపు వైకుంఠపతియును నితఁడె॥ పల్లవి॥

భాగవతములోఁ జెప్పె బలరాము తీర్థయాత్ర।
నాగమోక్తమైన దైవత మీతం డితఁడె।
బాగుగా బ్రహ్మాండ పురాణపద్ధతియూఁ డితఁడె।
యోగమై వామనపురాణోక్తదైవ మీతఁడె॥ శ్రీవేంక॥ 1

వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము।
లలరఁ జేసినదేవుఁ డాతఁ డితఁడె।
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి।
కలిమిఁ దపమునేసి కన్నదేవుఁ డితండె॥ శ్రీవేంక॥ 2

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు।
తక్కక కొలిచియున్న తత్వ మీతఁడె।
చక్క నారదాదుల సంకీర్తనకుఁ జొక్కి।
నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుఁడు నితఁడె॥ శ్రీవేంక॥ 3

అన్న. అధ్యా. 87 రేకు.

నేఁటి వేంకటాచలమాహాత్మ్య కథలు సంకీర్తనములలో నంతగాఁ గానరాకున్నవి. కొన్ని స్థానికదేశిగాథ లున్నవి. (చూ. 25 పీఠికపుట.)

## ఇతర గ్రంథములు.

అన్నమాచార్యుఁడు పంద్రెండు శతకములు రచించెనట. సకల భాషలందును బ్రతిలేని నానాప్రబంధములు రచించెనట. అన్నమాచార్యుని వేంకటేశ్వర శతక మొకటి నేను ప్రకటించిన ప్రబంధరత్నావళిలో నుదాహృతమయినది. దేవస్థానపు రాగిరేకులలోఁ గానరాదు.

అలమేల్మంగాంబమీఁద నీతఁడురచించిన శతక మిదే.(చూ.పీఠిక 16 పు.) మఱిమిగిలిన పదిశతకములు నేయే వేల్పులమీఁద రచితము లయ్యెనో వాని పేళ్లేమో తెలియరాదు. ఇవిగాక యన్నమాచార్యుని పౌత్రుఁడు చిన తిరుమలాచార్యుఁడు సంకీర్తనలక్షణమునఁ దనతాత యన్నమాచార్యుఁడు సంస్కృతమున సంకీర్తనలక్షణము రచించినట్టును దానికి దనతండ్రి పెదతిరుమలాచార్యుఁడు వ్యాఖ్య చెప్పినట్లును వాని ననుసరించి తాను తెలుఁగు రచనచేసినట్టును జెప్పుకొన్నాఁడు. ఆసంస్కృత సంకీర్తన లక్షణమును గానరాదు.

## అన్నమాచార్యవిగ్రహము.

సంకీర్తనభండారమనీ తాళ్లపాకవారి యర అనీ, పేర్కొనఁబడు చుండుకొట్టు సరిగా భాష్యకారులసన్నిధికిఁ బ్రక్కగా నున్నది. స్వామి దర్శనము చేయువారు బంగారువాఁకిటికడ నిలిచి ముందుచూచిన స్వామి దివ్యవిగ్రహమును గుడిచేతి ప్రక్కకేసి చూచిన భాష్యకారుల విగ్రహమును గానఁగల్గుదురు. భాష్యకారులతో పాటు దర్శనీయులుగా నన్నమాచార్యులవిగ్రహము సంకీర్తనభండారము ద్వారమునెడమప్రక్క నున్నది. ఆద్వారమునకుఁ గుడిప్రక్కను పెదతిరుమలాచార్యుల విగ్రహమును గాననగును. బంగారువాకిలిదగ్గఱనుండి ఒకకంట స్వామిని, ఇంకొకకంట భాష్యకారులను (చిదంబరమున కనకసభాపతిని, వరదరాజులను దర్శించునట్లే) అన్నమాచార్యుని తత్పుత్రునిగూడ దర్శింపనగును. సరిగా నీయర్థమును నిరూపించునదిగాఁ జినతిరుమలాచార్యుఁడుగాఁబోలును రచించిన సంకీర్తనము లున్నవి.

దేవగాంధారి.

అతిమిఱికి జూడఁబోతే నజ్ఞాని నేను ।
మఱుఁగు సొచ్చితి మీకు మహిలో నారాయణా ॥ పల్లవి ॥

నిన్ను ధ్యానముచేసీ నిచ్చఁ దాళ్లపాక ।
అన్నమయ్యఁగా రెదుట నదిగో వయ్యా ।
పన్ని యాతనినే చూచి పాతకుల మైనమమ్ము ।
మన్నించవయ్యా వో మధుసూదనా ॥ అతి ॥ 1
సంకీర్తనలు చేసీ సారెఁ దాళ్లపాక అన్నమయ్య ।
అంకెల నీసన్నిధినే అదిగోవయ్యా ।
అంకించి నేవారివాఁడ నని దుష్టుండ నైనా నా ।
సంకె దీఱఁ గావవయ్య సర్వేశ్వరా ! ॥ అతి ॥ 2
పాదాలం దున్నాఁడు తాళ్లపాక అన్నమయ్య మీకు ।
ఆదరాన ముక్తుండై అదిగో వయ్యా ।
ఈదెస శ్రీవెంకటేశ యీసంబంధాననే నన్ను ।
నీదయ వెట్టి రక్షించు నెమ్మది భూరమణా ! ॥ అతి ॥ 3

అన్న. అధ్యా. 228 రేకు.

దేసాళం.

ఈతఁడే ముక్తిదోవ యీతండే మాయాచార్యుఁ ।
డీతఁడు గలుగఁబట్టి యిందరు బదికిరి ॥ పల్లవి ॥
అదివో తాళ్లపాక అన్నమాచార్యులు ।
యిదె వీఁడె శ్రీవెంకటేశునెదుట ।
వెదవెట్టి లోకములో వేదము లన్నియు మంచి ।
పదములునేసి పాడి పావనముసేసెను ॥ ఈతడే ॥ 1
అలరుచుఁ దాళ్లపాక అన్నమాచార్యులు ।
నిలిచి శ్రీవెంకటనిధియై తానై ।
కలిదోషములు వాప ఘనపురాణము లెల్ల ।
వలుకుల నించి నించి పాడినాఁడు హరిని ॥ ఈతఁడే ॥ 2

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
నమోదు సంఖ్య 2,3,20
తేది 30.5.83

అంగవించెం దాళ్లపాక అన్నమాచార్యులు ।
బంగారు శ్రీవెంకటేశు పాదములందు ।
రంగుమీఱ శ్రీవెంకటరమణుని నలమేలు ।
మంగను యిద్దఱిం బాడి మమ్ముఁ గరుణించెను ॥ ఈతఁడే ॥ 3

అన్న. అధ్యా. 232 రేకు.

శ్రీరాగము.

హరియవతార మీతఁడు అన్నమయ్య ।
అరయ మాగురుం డితం డన్నమయ్య ॥ పల్లవి ॥

వైకుంఠనాథునివద్ద వడిఁ బాడుచున్నవాఁడు ।
ఆకరమై తాళ్లపాక అన్నమయ్య ।
ఆకసపువిష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు ।
ఆకడీకడఁ దాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥ 1

క్షీరాబ్ధిశాయి నిట్టె సేవింపుచున్నవాఁడు ।
ఆరితేరి తాళ్లపాక అన్నమయ్య ।
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు ।
ఆరీతులఁ దాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥ 2

యీవలసంసారలీల నిందిరేశుతో నున్నవాఁడు ।
ఆవటించి తాళ్లపాక అన్నమయ్య ।
భావింప శ్రీవేంకటేశు పాదములందె వున్నవాఁడు ।
హావభావమై తాళ్లపాక అన్నమయ్య ॥ హరి ॥ 3

అన్న. అధ్యా. 117 రేకు.

భాష్యకారులకుఁబోలె నన్నమాచార్యులకును విగ్రహమును వెలయించి తాళ్లపాక యరలో ప్రతిష్ఠయే జరుపవచ్చునుగాని యానాఁడ

న్నమాచార్యుని నట్లు పూజించుటకు స్థానపతుల సమ్మతి దొరకవలెను. ఆయరగోడమీఁద వారివిగ్రహము చెక్కించుటకే దొరకెనేమో. అన్నమాచార్యునివలె గొప్పవిద్వాంసుఁడు సంకీర్తనాదికర్త మహాభక్తుఁడు స్వామి కగ్రహారములనేకములు సమర్పించినవాఁడు నగు పెదతిరుమలాచార్యునిమూర్తికూడ నుండవలసినదయ్యెను. పినతిరుమలాచార్యుఁడీ కొఱఁత తీరుటకు మంగాపురమున గుడి కట్టించి మఱొక వెంకటేశ్వర స్వామినే వెలయించి ప్రతిష్ఠించి యక్కడ నాళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతోసహా అన్నమాచార్యుని విగ్రహమునుగూడఁ బ్రతిష్ఠించి పూజాపురస్కారములు కల్పించెను. తాళ్లపాక యర ద్వారమున కిరుప్రక్కలనున్న విగ్రహములలో నొకటి ముదివయసుది ఇంకొకటి లేవయసుది గానున్నది. అన్నమాచార్యచరిత్ర (చూ. 35 పుట) లో నున్న వర్ణనమున కనుగుణముగానే యిక్కడ రూపకల్పనమున్నది.

## సంగీతరచన.

ద్రవిడకర్ణాటాంధ్ర భాషలలో కెల్లఁ బ్రాచీనములగు సంకీర్తనము లన్నమాచార్యునివే. సంకీర్తన శాస్త్రమును గల్పించినవాఁడు నన్నమాచార్యుఁడే. కనుకనే యాతనికిఁ బదకవితాపితామహుఁడని, సంకీర్తనాచార్యుఁడని హరికీర్తనాచార్యుఁడని బిరుదులుగలిగెను. కన్నడమునఁ బురందరదాసుల వారును ప్రాకృతమున వెంకటమఖియు నీయనకుఁ దర్వాతనే సంకీర్తనములను గీతములను రచించిరి. ప్రాఁతవగు కృష్ణాచార్యుని సంకీర్తనములు తాళగంధివచనములేకాని పల్లవి చరణములు గల పదకవితా రచనలుకావు. అట్టి తాళగంధివచనరచనలను పెదతిరుమలాచార్యుఁడుగూడ వైరాగ్యవచనరచనమాలికాగీతములని పేర్వెట్టి రచించినాఁడు.అవి వెంకటేశ్వరవచనములని వెంకటేశ్వరవిన్నపములని మద్రాసు తంజావూరి లైబ్రరీలలో నుండగా నేను గుర్తించి ప్రకటించితిని.

జాజఱలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెదపదములు, లాలి సువ్వి గొబ్బి ఉయ్యాల లాల జోల జోజో జేజే జయజయ విజయీభవ శోభన మంగళ వైభోగములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, గుజ్జెనగూళ్లు, చందమామగుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, అల్లోనేరేళ్లు, చాంగుబళాలు, బళాబళాలు, సొసముఖాలు, అవధానములు, తందానలు, వెన్నెలలు, చిత్తమా, మనసా, బుద్ధి(సంబోధనలు) మొదలగుమధురకవితారచనావిశేషము లీసంకీర్తనములలోఁ జాలఁ గలవు. అన్నమాచార్యుఁడు సంకీర్తనలక్షణమున వీనిలోఁ గొన్నింటిని బేర్కొనుటచే నంతకుఁ బూర్వమునుండియు నివి వాడుకలో వచ్చుచున్న వే యనవలెను. తుమ్మెదపదములు, ప్రభాతపదములు, పర్వతపదములు, ఆనందపదములు, శంకరపదములు, నివాళిపదములు, వాలేశుపదములు, గొబ్బిపదములు, వెన్నెలపదములు, సెజ్జవర్ణన గణవర్ణనపదములు, పాల్కురికిసోమనాథుఁడు తనగ్రంథములలోఁ బేర్కొన్నాఁడుగాని యవి యిప్పుడు గానరావు. అవి యేవో పాడిపాడిగా వెలసినలఘురచనలయి యుండునుగాని ప్రఖ్యాతకవులానుపూర్వితో రచించినవి గావేమో! త్యాగరాయలకృతులకుఁ బూర్వమాంధ్రగాయకు లాలాపించుచుండిన గేయము లేవి? యని పరిశీలింపఁగాఁ జాలినంత సమాధానము దొరకకున్నది. నేఁటిగాయకు లందఱును త్యాగరాయాదులను నూఱేండ్లక్రిందటి వారినే యెఱుఁగుదురు. సింగభూపాలుఁడు పెదకోమటివేమారెడ్డి ప్రౌఢదేవరాయఁడు (సంగీతరత్నాకరః అనఁబడినాఁడు) సంగీతగ్రంథకర్తలు అన్నమాచార్యునికించుకపూర్వులు. బయకారరామామాత్యుఁడు, కృష్ణరాయఁడు, అచ్యుతరాయఁడు, తిరుమలరాయఁడు, సంగీతగ్రంథములకుఁ గర్తలు, కారయితలును. వెంకటగిరి కాళహస్తి కార్వేటినగరము నూజివీడు చల్లపల్లి ముక్త్యాల పిఠాపురము పెద్దాపురము విజయనగరము

గద్వాల వనపర్తి ఆత్మకూరు మొదలగురాజస్థానములుసంగీతవినోదము లేనివి గావు. దక్షిణాంధ్రరచనలలో తంజాపుర్యాదులలో వెలసినగేయ రచనలు సురక్షితములుగా నున్నవిగాని తెలుఁగుదేశపురచనలు సరిగా దొరకుట లేదేల? కృష్ణరాయలమీఁదిగేయరచన లైనఁ గానరావే. ఆనుపూర్వితో క్షేత్రయపదములు ఏగంటిచిలుకపాటిపదములు రామదాసుకీర్తనలు ముత్తేవివారికీర్తనలు తాడంకివారికీర్తనలు నల్లఁబాటివారికీర్తనలు సారంగపాణిపదములు గుత్తెనదీవిరాయణకీర్తనలు అధ్యాత్మరామాయణకీర్తనలు శోభనాద్రీశ్వరసంకీర్తనలు నని కొన్నిగలవుగాని యవియెల్ల నంతప్రాచీనములు గావు. మద్రాసుప్రాచ్యలిఖితపుస్తకశాలలోఁ గొన్ని పాడి పాడి గేయరచన లున్నవిగాని యందుఁ గొన్ని ప్రాచీనతరము లయినను గావచ్చునుగాని యవి యానుపూర్వితో కర్తృనామాంకముతో లేవు. యక్షగానములు గొన్ని వానిలోనిగేయరచనలుఁగొన్ని కలవుగాని మొదటి కాయక్షగానములే యంతప్రాచీనములు గావు. తెలుఁగునఁ దొలుత శ్రీనాథుఁడే యక్షగానములఁ బేర్కొన్నవాఁడు. దాక్షారామమున సంగీత నాట్య విద్యా వినోదములు జరుగుట నాతఁడు వర్ణించినాఁడుగాని యానాఁటిగేయము లేవో సరిగాఁ దెలియరావు. చాళుక్యరాజులగ్రంథములలో (అభిలషితార్థచింతామణి, సంగీతచూడమణి) సంగీతవిషయములు చాలఁ గలవుగాని వానిలో వర్ణితము లయిన సంగీతప్రబంధము లంతముఖ్యమయినవి గావు. ఏలలు ధవళములు చర్చరులు ఏకతాళులు శరభలీలలు చిందులు మొదలయినవేవో కొన్నిమాత్రమే చిన్నిచిన్నిరచన లందుఁ జెప్పఁబడినవి. అందు గొన్ని నేఁడును వాడుకలో నున్నవి. వానినిగూర్చియభిలషితార్థచింతామణి సంగీతచూడామణులలోని ముక్కలు కొన్ని:—

"కథాసు షట్పదీ యోజ్యా వివాహే ధవళ స్తథా
ఉత్సవే మంగళో గేయ శ్చర్యా యోగిజనై స్తథా॥"

"పదేపదే భవే ద్రాగః తాళశ్చాన్యః పదేపదే
పదాన్తే స్వరతాళాభ్యాం గేయశ్చరభలీలకః"
"షోడశమాత్రాః పాదేపాదే యత్రభవన్తి నిరస్తవివాదే।
పద్ధళికా జగణేనవియుక్తా చరమగురుస్సా సద్భిరిహోక్తా"
"రాగో హిందోళక స్తాళః చర్చరీ బహావోంఘ్రయః
యస్యాం షోడశమాత్రాస్స్యుర్ద్వా ద్వాచప్రాససంయుతౌ
సావసంతోత్సవే గేయా చర్చరీ ప్రాకృతైః పదైః"
"పదమన్త్యంస మాదాయ యమకస్థితిభూషితః
ఆవృత్యాగీయతే యస్తు చక్రవాళస్స ఉచ్యతే
గదేవాపద్యబంధేవా పుణ్యానామాంతశోభితః
నామాంతే స్వరసంయుక్తో గీయతే చక్రవాళకః"

లక్ష్యమ్.

శశాంకశకలం కలంకికుముదం ముదంనవహాతేహా తేహిమకరే
కరేతదనమం సమంవివసితం సితంవిజయతేయతే తవయశః.
"నిరంతరమనుప్రాసో యతిర్యత్ర పదేపదే
క్రియతే గీతతత్త్వజ్ఞైః సాస్మృతా త్వేకతాళికా"
"ధవళాది పదైః పాదై రాశీర్వాదసమన్వితైః
ఛందసా యేనకేనాపి కర్తవ్యో ధవళాభిధః"

పై గ్రంథములలో లక్ష్యములు గొన్ని కర్ణాటభాషలో నున్నవి. చాళుక్యులు కర్ణాటకు లగుటచేతను రాజులగుటచేతను తొలుత సంగీత సంప్రదాయ మధికముగాఁ గన్నడమున బెంపొందించియుందురు. మొదటి కీగానమునకే కర్ణాటగానమని పేరయ్యెను. సంగీతశాస్త్రమున స్వరపద్ధతికి ధాతువని సాహిత్యపద్ధతికి మాతువని పేరు. శరీరమున సప్తధాతువు లుండుటఁబట్టి తత్సాదృశ్యమున సప్తస్వరములకు ధాతుసంజ్ఞ కుదిరెను. 'మాతు' కర్నాట భాషాపద మనుకొంఛును, మాతు=మాట

ఈశాస్త్రము తొలుత కర్ణాటమున నెలయుటచే సాహిత్యమునకు 'మాతు' అన్నకర్ణాటపదము గొనుటయ్యెను గాఁబోలును.

పై లక్షణ శ్లోకములలో నున్న చర్చరియే జాజఱ యయినది. అన్నమాచార్యసంకీర్తనములలోని జాజఱపాట లన్నియు గోవాళ్ళు వసంతోత్సవములోఁ బాడునవిగా నున్నవి.

ఒకటి:—

ముఖారి.

చాలుఁ జాలు నీజాజఱ, నన్ను
జాలిఁ బఱచె నీజాజఱ ॥ పల్లవి ॥

వలపువేదనల వాడేను యీ।
తలనొవ్వులచే తలఁకేను ।
పులకలమేనితో పొరలేను కడు ।
జలిగొని చల్లకు జాజఱ ॥ చాలు ॥ 1

వొల్లని నినుఁ గని వుడికేను నీ
చిల్లరచేఁతలఁ జిమిడేను ।
కల్లగందవొడిఁ గాఁగేను పైఁ।
జల్లకు చల్లకు జాజఱ ॥ చాలు ॥ 2

తివిరి వెంకటాధిప నేను నీ।
కవుఁగిటి కబ్బితి గదనేఁడు ।
రవరవ చెమటఁ గరఁగినదాయిదె ।
చవులాయెను నీజాజఱ ॥ చాలు ॥ 3

అన్న. శృంగా. 87 రేకు.

నాచనసోమనగూడ వసంతవిలాసమున జాజఱనిట్లువర్ణించినాఁడు:-

"వీణాగానము వెన్నెలతేట । రాణమీఱఁగొరమణులపాట ।
ప్రాణమైనపిన్నబాహ్మణుపీట । జాణలు మెత్తురుజాజఱపాట ॥

ఇంతకుఁ జెప్పవచ్చిన దేమనఁగా విద్యానగరవినాశనముపిదప ఆంధ్ర దేశమున సంగీత మన్నఁ గొంత యశ్రద్ధ పెరిగినదనుట. అదికారణముగాఁ బ్రాచీనగేయరచన లెన్నో అంతరించి పోయినవి. దాగియున్నను రాగి రేలకు మీఁదికెక్కియుండుటచే నేఁటికయినను దాళ్లపాక సంకీర్తనములు పైకి రాఁగల్గినవి.

## అన్నమయ సంతానము.

### నరసింహకవి

అన్నమాచార్యుని ప్రథమభార్యయగు తిరుమలమ్మకు నరసింగన్న, నరసయ్య, నరసింహాచార్యుఁడు అనిపేర్కొనఁబడువాఁడు చాలా గొప్పకవీశ్వరుఁడు కొడు కుండెను. నిరుపమాన సుకవితా నిర్వాహకుఁడయిన తెనాలి రామకృష్ణకవి తనసమీపకాలమువా రగు తాళ్లపాక కవుల నిట్లు సన్నుతించెను.

క॥ చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁ బెదతిరుమలయ్య పదమున కెఱఁగున్ ।
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబుః పద్య గద్య శ్రేణిన్ ।[1] 1

ఈపద్యమునఁ దనతో క్రీ 1530 దాఁక వర్తిల్లినవాఁడగు చిన్నన్నను, అతనితండ్రియు క్రీ 1453 దాఁక వర్తిల్లినవాఁడగు పెద తిరుమలాచార్యుని, ఆతని యన్నయగు నరసింగన్నను మెచ్చినాఁడు.

ద్విపదమునకుఁ జిన్నన్న వ్రాలును. పదములకుఁ బెదతిరుమలయ్య వ్రాలును. పద్య గద్య (ని) శ్రేణిని నరసింగన్న మిన్నందిమ్రోఁగును! అని దీనియర్థమనుకొందును. నరసింగన్న యిం దదికముగాఁ బ్రస్తుతుఁ

1 రామకృష్ణునికిఁ జిన్నన్నకు, నూఱేండ్లతర్వాత నప్పకవీయమున నీపద్య మదాహృతమయినది.

చోడ కుమారసంభవమును, ఎఱ్ఱన నృసింహపురాణమును, ఉత్తర హరివంశమును, శ్రీనాథరచనలను, ననుకరించునవిగా పలుకుబళ్లు, కూర్పు తీర్పులు, పద్యచ్ఛాయలు, నిండుఁజాలఁగలవు. కవికర్ణ రసాయనము తాళ్లపాక నరసింగన్న రచనమే యగుచో నందు రాజాశ్రయగర్వ సహేతుకమే యగును. కారణము సుస్పష్టముకాదు కాని బహువారములు తిరుపతికి విచ్చేయుచు వచ్చినవాఁడు కవి విద్వాంసుఁడు కవిపోషకుఁడు నగు శ్రీకృష్ణరాయఁడు సంస్కృతాంధ్ర విద్వాంసులు మహనీయులు కవులుగాయకులునగు నరసింహ పెదతిరుమల చినతిరుమలాచార్యాదుల నెలొక్కో యాదరింపఁడయ్యెను. పైఁగా వారి నివాస గ్రామమగు తాళ్లపాకను వ్యాసతీర్థుల కగ్రహారీకరించెను. అచ్యుత రాయలవారుమాత్రము తాళ్లపాకవారి నాదరించి యాదృతుఁడయ్యెను.

## పెదతిరుమలయ్య.

అన్నమాచార్యుని రెండవభార్యయగు అక్కలాంబయం దీతఁడు జన్మించెను. ఈ తనికి నరసమ్మ, తిరుమలమ్మయని యిర్వురు చెలియండ్రును గలరు. ఈ తిరుమలాచార్యుఁడు క్రీ 14[illegible]3 దాఁక జీవించినాఁడు. క్రీ 1503 దాఁక జీవించిన యన్నమార్యుఁ డీపెదతిరుమలయ్య పెదకుమారుఁడగు చినతిరుమలయ్యగారికి బ్రహ్మోపదేశముఁ జేసినాఁడు. 1500 ప్రాంతముల చినతిరుమలయ్య యుపనయనము జరగిన దనుకొన్నచో 1495 ప్రాంతముల జన్మించిన చినతిరుమలయ్య తండ్రి యప్పటి కిర్వదేండ్ల వాఁడేయను కొన్నను 1473 ప్రాంతముల జన్మించిన వాఁడగును. ఈతని నిండుయౌవనము శ్రీకృష్ణరాయలవారి కాలమున గడచినది. కృష్ణరాయల పరిపాలన కాలమున నీతఁడు శ్రీవెంకటేశ్వరస్వామికిఁ గొన్ని కైంకర్యములు జరపినను నందు సాళ్వతిమ్మరుసును నాతని తమ్ముఁడగు గోవిందయ్యయు నిర్వాహకులుగా నుండిరి. శాసనములలో శ్రీకృష్ణ

రాయలపేరు లేదు. పెదతిరుమలయ్యకును నాతని యన్నయగు నరసింహకవికిని శ్రీకృష్ణరాయనితో వైరస్యము గల దనుకొనుట కింకొక సాధనము:—

"మండెమురాయనామక నరసింహ దండనేత్రుం (తృ?) నకిష్టధన బలస్ఫూర్తి" నని యన్నమాచార్యచరిత్రముననున్న వాక్యమునకు మండెమురాయఁడను నామాంతరముగల నరసింహ దండనాథుఁడని యర్థముగావచ్చునని ఆతఁడు శ్రీకృష్ణరాయని తండ్రి యగుతుళువనరసింహ దండనాథుఁడు గావచ్చునని యను కొంటిమి. (చూ. పీఠిక 64 పుట.)

పయిమండెము కడపమండలమున చినమండెములనీ, చిత్తూరు మండలమున గాజులమండెము చిఱుమండెము అనీకల గ్రామములలో నొకటయి యుండఁబోలును. ఆయూర పెదతిరుమలయ్య నెవరో కత్తితో నఱికిరట. ఆకత్తిరేవే టాతనికిఁ గలువ దండ యైనసదట!

మండెము కోటలో మండలం బెఱుఁగ
మండలాగ్రాహతి మహనీయ పుష్ప
దామమై ధర్మాంగదస్థితిఁ బొలిచె
నేమహామయుని యహీన గాత్రమున

నని చిన్నన్న చెప్పినాఁడు. దేవకీపురవాస్తవ్యుఁడగు నరసింహ దండనాథుఁడిందు ప్రయోజకుఁడేమో! ఈ విషయము పెదతిరుమలాచార్యుఁడే యిట్లు సంకీర్తనమునఁ జెప్పుకొన్నాఁడు.

శంకరాభరణం.

నాఁటికి నాఁడు క్రొత్త నేఁటికి నేఁడు క్రొత్త।
నాటకపుదైవమవు నమో నమో ॥ పల్లవి ॥
సిరుల రుక్మాంగదుచేతికత్తిధార దొల్లి।
వరుసధర్మాంగదుపై వనమాలాయ।

హరి నీకృపకలిమి నట్లనే యరులచే ।
కరఖడ్గధార నాకుఁ గలువదండాయ ॥ నాఁటి ॥ 1
మునుపు హరిశ్చంద్రుమెునక త్తిధార దొల్లి ।
పొనిఁగి చంద్రమతికిఁ బూవుదండాయ ।
వనజాక్ష నీకృపను వరశత్రులెత్తి నట్టి ।
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ॥ నాఁటి ॥ 2
చలపట్టి కరిరాజు శరణంటె విచ్చేసి ।
కలుషముఁ బెడఁ బాపి కాచినట్టు ।
అలర శ్రీవెంకటేశ ఆపద లిన్నియుఁ బాపి ।
ఇల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ ॥ నాఁటి ॥ 3

ఈ కీర్తనమునఁ జెప్పఁ బడినదేకాక (చూ. పీఠిక 65 పుట) సంకీర్తనమున వర్ణితమయిన విషయములు గూడఁ బెదతిరుమలాచార్యుని మాహాత్మ్యమును వెల్లడించు చున్నవి. ఆసంకీర్తనమును జినతిరుమలాచార్యుఁడు రచించియుండఁ బోలును.

అచ్యుతరాయలవారు పూాండి, సంగమకోటగ్రామములఁ దామ్రశాసన పూర్వకముగా దానము చేయఁగాఁ బెదతిరుమలాచార్యుఁడు వానిని స్వామికే నమర్పించెను. ఆతఁ డచ్యుతరాయల జన్మనక్షత్రము నాఁడు తనద్రవ్యముతో స్వామికిఁ గైంకర్యములఁ గల్పించెను. అచ్యుతరాయలనాఁ డాతఁడు విజయనగరములో విట్ఠలేశ్వరస్వామి కైంకర్యములకై గొప్పభూసమర్పణము చేసెను. పెదతిరుమలయ్య స్వామికి అర్పించినగ్రామములు:— కావనూరు, మరువాకర్రై, కుప్పము, కీళంగుట్రము, మన్నసముద్రము, పూాండి, సంగమకోట, (ఈరెండూళ్ల సంవత్సరపు దాబడి 1000 రేఖ పొన్నులు) రాయలపాడు, సోమయరాజులపల్లి, కత్తమువారిపల్లి, ఎఱ్ఱగుంటపల్లి, వల్లిపురము, (133 వరాహాల

సంవత్సరాదాయముకలది.) గండతిమ్మాపురము (100 రేఖ హొన్నులు సంవత్సరాదాయముగలది.) ఈగ్రామములుగాక— భిన్న భిన్న సమయము లలో 4600 పణాలు 5203 పణాలు 2000 వరహాలు 450 పణాలు 1900 పణాలు 1020 నర్పణాలు 2300 నర్పణాలు సమర్పించినారు.

శ్రీస్వామి వారికిని ఎగువ దిగువ తిరుపతులను కడమ చోట్లను వెలసిన వేల్పులకు బహువిధభక్ష్యభోజ్యాది నివేదనలను నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవ వర్షోత్సవాదులలో నింకననేకవిధముల కైంకర్య ములను వనభోజన వినోదములను తమ వంశపారంపర్యముగా తమ పేర జరపించుటకు బయిగ్రామములను ధనమును శ్రీభండారమున నర్పింపగాఁ గోవెల స్థానపతు లందుకు సమ్మతిగా శాసనములు చెక్కించిరి.

ఇవిగాక వీరు కట్టించిన కట్టడములు వగైరాలు:— స్వామిపుష్క రిణి జీర్ణోద్ధారము, మెట్లు, మండపములు, నీరాడుమండపము కొండమీఁద తాళ్లపాకవారి యింటి ముందు మండపము, సంకీర్తన (సంకీర్తనములు చెక్కినరాగిరేకులు దాచి ఉంచినది) భండారము, అక్కడ దీపారాధనలు, అక్కడ సంకీర్తనలు పాడే వైష్ణవులకు జీతాలు, గుడిగ్రామాలలో చెరు వులు కాలువలు బాగు చేయించుటకు ధనదానము, ఆళ్వారుతీర్థము దగ్గఱ శ్రీలక్ష్మీనారాయణస్వామి ప్రతిష్ఠ ఇత్యాదులు.

కొన్ని ఉత్సవములలోని ముఖ్యాంశములు:— శ్రీనివాసమూర్తికి ప్రతి శుక్రవారము తిరుమంజనము పిదప పునుఁగుతైలము పూయునప్పుడు పన్నీరుచెంబు సత్కారముపడయుట (తాళ్లపాకవారు సంకీర్తనములు అప్పుడు పాడేవారు) అచ్యుతరాయల జన్మనక్షత్రమగు మృగశిరనాఁడు ఉత్సవముజరపుట స్వామిపుష్కరిణి గట్టున తాళ్లపాకవారు నిర్మించినరాతి స్తంభముమీఁద సంవత్సరముపొడుగునా ప్రతిగురువారము దీపారాధన, ముక్కోటి ఏకాదశినాఁడు స్వామిపుష్కరిణి గట్టున ముప్పది దీపాలు,

సంకీర్తన భాండారము దగ్గర నాల్గు తిరుబోనములు దీపాలనూనె ఆభాండారములో సేవచేసే శ్రీవైష్ణవుల జీతాలు వగైరాలు.

తిరుమయ్యగారికి శ్రీపతితొన్నడయ్యఅనీ తిరుపతి చేరువనున్న కులశేఖర పురవాస్తవ్యుఁడు పల్లివట్టురయ్య అనీ ఇద్దఱు సాతాని వైష్ణవులు శిష్యులుండిరి. వారుకూడస్వామికిఁ గైంకర్యములు జరపిరి. పెద తిరుమలయ్యగారు చేయించిన యుత్సవ విశేషములు సమగ్రముగా వ్రాసిన నదియే పుస్తకమగును.

ఈతఁడు రచించిన గ్రంథములు:—

| | |
|---|---|
| 1 శృంగార సంకీర్తనములు. | 7 వెంకటేశ్వరోదాహరణము. |
| 2 అధ్యాత్మ సంకీర్తనములు. | 8 నీతిసీస శతకము. |
| 3 వైరాగ్యవచన గీతాలు. | 9 సుదర్శనరగడ. |
| 4 శృంగార దండకము. | 10 రేఫఱకారములు. |
| 5 చక్రవాళ మంజరి. | 11 భగవద్గీత తెల్గువచనము. |
| 6 శృంగారవృత్త శతకము. | 12 ద్విపదహరివంశము. |

పైవానిలోకడపటిరెండుముద్రితములుగాలేదు. తొలిరెండింటిలోఁ గొంతభాగమును, గడమవి సమగ్రముగాను ముద్రితములయినవి. హరివంశము దొరకనే లేదు.

ఇవిగాక చిన్నన్న పేరోఁ-న్న యంధ్రవేదాంతము తొలుత కృష్ణమాచార్యుఁడును తర్వాత తనతాత యన్నమాచార్యుఁడును పిదప తనతండ్రి తిరుమలాచార్యుఁడును ననుక్రమముగా రచించినది సంకీర్తనాత్మకము. ఇట్లనుటకు సాధకముగా అష్టమహిషీ కల్యాణములోన నిట్లున్నది. "తొమ్మనుతద్రావిడాగమసార్వభౌము|లై నమావారలనాళువారలను| వేదంబులెల్లద్రావిడము.గాఁజేసి| వేదాంతవిదులు కోవిదులునై నట్టి|గురుతర

లగు పరాంకుశముఖ్యయోగి। వరుల" నని ద్రవిడవేదాంతకర్తల సన్నుతిపై "వనజాతజాతసర్వసురేంద్రముఖులు। గనలేని వెంకటగ్రావాధినాథు। పద ములశోభనాస్పదములౌ తనదు। పదములబహుదేశపదములజనులఁ। గనఁ జేసిపంచమాగమసార్వభౌముఁ। డనఁ బ్రసిద్ధికినెక్కి యఖిలవిద్యలను। నన్న యాచార్యుండెయనఁదాళ్ల పాక యన్న యాచార్యుఁ డాయతకీర్తిఁ జెలఁగె।" "వేదంబు తెనుఁగుగావించి సంసార। ఖేదంబు మాన్పిన కృష్ణమాచార్యు। ఘనతరపంచమాగమసార్వభౌము। నన ఘుశ్రీతాళ్ల పాకాన్నమాచార్యుఁ। దలఁచి" అనియు "ఉరుయోగసామ్రాజ్యవిభవ। జనకుండుతిరుమలాచార్య వర్యుండు। వేదాంతవిద్యాప్రవీణుఁడై యంధ్ర। వేదాంత మొనరించి, ద్విపద రూపమున। హరివంశకావ్యమాయతరసస్ఫూర్తి। హరివంశమిగురొత్తనను వొందజేసి" అనియు నాంధ్రవేదాంతకర్తలసన్నుతిగలదు.

ద్రవిడమున వేదవేదాంతములను పరాంకుశయోగిమొదలగు నాళ్వార్లు ద్రావిడీకరించి ద్రావిడాగమసార్వభౌములనిపించుకొనఁగా తెనుఁగున

కృష్ణమాచార్యుఁడు:—కృష్ణమాచార్యసంకీర్తనకర్త. [పితామహుఁడు.

అన్నమాచార్యుఁడు:—సంకీర్తనాచార్యుఁడు, సంకీర్తనకర్త, పదకవితా

పెదతిరుమలాచార్యుఁడు:— సంకీర్తనాదికర్త.

ఇట్లీముప్వురును వేదమును తెనుఁగుగావించి అంధ్రవేదాంతకర్తలని పంచమాగమసార్వభౌములనిపంచమాగమచక్రవర్తులని యనిపించుకొనిరి.

తిరుమలయ్యకు శ్రీమద్వైదమార్గప్రతిష్ఠాపనాచార్య శ్రీరామానుజసిద్ధాంతస్థాపనాచార్య వేదాంతాచార్య కవితార్కికకేసరి శరణాగ వజ్రపంజర బిరుదములు గలవు.

ఈతనికి వేంకటేశ్వరస్వామిత్రిపురుషపర్యంతముగా ప్రత్యక్షంబును సప్తపురుషపర్యంతముగా మోక్షంబు నొసంగెదనని వరమిచ్చె నట![1]

1 చూ. శకుంతలాపరిణయము. పీఠిక.

## సంకీర్తన భండారము.

ఈ పెదతిరుమలయ్యగారే సంకీర్తన భండారమునకుఁ బెంపువెల యించిరి. తొలుత అన్నమాచార్యుఁడే సంకీర్తన భండారమును నెల కొల్పినట్టున్నాఁడు. అందుకుఁదార్కాణగా సంకీర్తనము. (చూ. పీఠిక, పుట. 38)

అన్నమాచార్యుని నాఁటి సంకీర్తనములు తాటియాకులమీఁద వ్రాసియుంచఁబడెనేమో! అతని తర్వాత పెదతిరుమలాచార్యుఁడు వానిని రాగిరేకులమీఁదఁ జెక్కించెను. రాగివిలువయు, చెక్కించుకూలియు నిప్పటిలెక్కప్రకారము లక్షలగును. ఒకరో యిద్దఱో అక్షరములఁ జెక్కు వారగుచో నదియొక పురుషాయుషమునంతకాలము జరపినఁ దేల వలసిన పని యగును. రాగిరేకులను జెక్కినవాఁడు.- అన్నమరాజు తిమ్మయ్య అని కొన్నిరేకులమీఁద నున్నది.

పెదతిరుమలార్యుని తర్వాత చినతిరుమలాచార్యుని సంకీర్తన ములుకూడ రాగిరేకులకెక్కినవి. 1540 లో సంకీర్తనభండారము దగ్గఱ సేవచేయు వైష్ణవు లిర్వురుండుట, సంకీర్తనములు పాడేవారు కొందఱుం డుట, ఆభాండారముముందు స్వామిని వేంచేపుచేయించి ప్రసాదవినియో గాదులు కైంకర్యములు దీపారాధనలు జరుగుచుండుటయు తాళ్లపాక వారి శిలాశాసనములకెక్కి యున్నవి.[1]

ఈసంకీర్తనభండారము(తాళ్లపాకవారిఅర)ద్వారమున కిరుప్రక్క లనే విగ్రహములున్నవి. అవి యన్నమాచార్య తిరుమలాచార్యులవి.

---

1 చూ తిరుపతి దేవస్థానం శాసనము నెం 144 నెం 4 వాల్యూం.

## చినతిరుమలయ్య.

ఈతఁడు పెదతిరుమలయ్య పెద్దకుమారుఁడు. అన్నమాచార్యుఁడీతనికి బ్రహ్మోపదేశము (ఉపనయనము) చేసెను. ఇందుకుసంకీర్తనము:-

లలిత

తాళ్ల పాకాన్నమాచార్య దైవమవు నీవు మాకు।
వేళమె శ్రీహరిఁ గన వెర వానతిచ్చితివి ॥ పల్లవి ॥
గురుఁడవు నీవె సుమ్మీ కుమతి నైననాకు।
నరవి బ్రహ్మోపదేశము సేసితి।
పరమబంధుఁడ వైనా పరికింప నీవే సుమ్మీ।
వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి ॥ తా ॥ 1
తల్లి వైన నీవే సుమ్మీ తగినవిషయాలలో।
ప్రల్లదానం బడకుండా బ్రదికించితి।
అల్లుకొని తోడునీడ వైనా నీవే సుమ్మీ।
చిల్లర మాయలలోనఁ జెడకుండాఁ జేసితి ॥ తా ॥ 2
ధాతవు నీవే సుమ్మీ తగుశ్రీవేంకటనాథు।
నాతలఁపులో నిలిపి నమ్మంజేసితి।
యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవే।
ఆతల నీతల నన్ను నాదుకొనికాచితివి ॥ తా ॥ 3

చినతిరు. అధ్యా. 7 జేకు.

కాన యీతఁడు క్రీ 1495 ప్రాంతముల జన్మించినవాఁ డనుకొన వచ్చును. క్రీ. 1553 దాఁక నీతనిశాసనము లున్నవి. ఈతఁడు సంస్కృతాంధ్రములందు మహాకవి, మహావిద్వాంసుఁడు, అష్టభాషాకవిచక్రవర్తి యని బిరుదుగలవాఁడు. తండ్రితాతలవలెనే అధ్యాత్మ శృంగారసంకీ

ర్తనలను రచించినాఁడు. తెల్గుసంకీర్తన లక్షణము, అష్టభాషాదండకము రచించినాఁడు. (ఇవిముద్రితములు చూ. తాళ్లపాక I వాల్యూం)

శ్రీవెంకటేశ్వరస్వామికి దిగువతిరుపతిలోని వేల్పులకుఁ గూడఁ జాలా కైంకర్యములు కావించినాఁడు. అందు ముఖ్యములు గొన్ని:

గోవిందరాజస్వామికి, పెండ్లి తిరునాళ్లు (వైవాహికోత్సవము) జరుపుటకు నేడియం అను గ్రామము రాఁబడిలో సగమిచ్చినాఁడు.

గోవిందరాజ విట్ఠలేశ్వరాచ్యుతపెరుమాళ్ రఘునాథ వరదరాజ లక్ష్మీనారాయణులకును హనుమదాలయములోఁ దాను ప్రతిష్ఠించిన నరసింహస్వామికిని కైంకర్యములకై చిత్రిచిత్రానక్షత్రమునఁ దన తిరునాళ్లలో వైశాఖమృగశిరను దనతండ్రితిరునాళ్ళలో గోవిందరాజస్వామి గుడిదగ్గఱి సుదర్శన చక్రమునకుఁ గైంకర్యములకై 200 రేఖై పొన్నుల రాబడిగల వెదుమప్పాకం గ్రామము సర్పించినాఁడు.

మంగాపురమున కళ్యాణవేంకటేశ్వర దేవాలయ జీర్ణోద్ధారణము గావించినాఁడు. స్వామి దివ్యసుందరమంగళ విగ్రహమునుగూడ నీతఁడే క్రొత్త వెలయింపించినట్లున్నాఁడు. ఆళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతో సహా తనతాతగారగు అన్నమాచార్యువిగ్రహము నక్కడ ప్రతిష్ఠించినాఁడు. కాని యావిగ్రహము నేఁడు గానరాకున్నది.

## పెదతిరువెంగళనాథుఁడు.

ఈతఁడు సాత్త్వికశుభమూర్తి సంగీతసత్కవిత్వాధికుఁడు నని చిన్నన్నచే స్తుతింపఁబడెను. స్వామిసన్నిధి నీతఁడు సంకీర్తనములు పాడుచుండఁగా స్వామి యాడుచుండెడువాఁడట! వెంకటాచార్యుఁడు "విశేషించియు న త్తిరువెంగళనాథుండు సంకీర్తనంబుఁ బాడిన నాడందొడంగె."[1] నని చెప్పినాఁడు. ఈతఁడు చిన్నన్న జీవించియుండఁగా క్రీ 1546 పూర్వమే దివ్యధామ మందినాఁడు.

1 శకుంతలా పరిణయకృత్యవతరణిక,

## చిన్నన్న.

ఈతఁడే అన్నమాచార్య చరిత్రకర్త. చినతిరుమలాచార్యున కీతఁడుమూఁడవతమ్ముఁడు. ఈయిఁద్దరనడుమఅన్నమయ్యని పెదతిరు వెంగళనాథుఁ డనీ యిద్దరు సోదరులు. చిన్నన్నతర్వాత తమ్ముఁడు కోనేరు నాథుఁడు. వీరందఱును సుప్రసిద్ధులు. కోనేరునాథుఁడు 1560 తర్వాతఁ గూడనున్నాఁడు. తాళికోటయుద్ధమును విద్యానగరవినాశనమును జూచు దౌర్భాగ్యమునకుఁబాల్పడక 1565 పూర్వమే వీరందఱు దివ్యధామ మంది యుందురు.

## ధర్మకైంకర్యములు.

స్వామి కీతఁడును జాల ధర్మకైంకర్యము లొనర్చెను. అందొకటి:- క్రీ. 1546 లో కొండవీటిసీమలోని చెందలూరుమల్లవర గ్రామములను స్వామిశ్రీభండారమున కర్పించెను. రెండుగ్రామములనుండి సంవత్సరపురాబడి 620 గట్టివరహాలు. ఈసొమ్ముతో జరపవలసిన ధర్మకైంకర్యములలో మన కిక్కడ ముఖ్య మయినవి:-

1 వైశాఖమాస విశాఖానక్షత్రమున తాత అన్నమయగారి జన్మనక్షత్రోత్సవకైంకర్యము.

2 చైత్రమాసము మృగశిరానక్షత్రమున పెదతిరుమలయ్యగారి జన్మనక్షత్రోత్సవకైంకర్యము.


3 మాఘశుద్ధచతుర్థి తమ పెదతండ్రినరసయ్యగారి శ్రాద్ధదినకైంకర్యము.

4 జ్యేష్ఠమాసపూర్వపక్షచతుర్థి తనయన్నగారగుతిరువెంగళప్ప శ్రాద్ధదినకైంకర్యము.

5 ఆశ్వయుజమాజమాసబహుళత్రయోదశి తమతల్లిగారైన తిరుమలమ్మగారి శ్రాద్ధదినకైంకర్యము.

వీనివల్ల నన్నమాచార్యాదుల జన్మమాసనక్షత్రములు నిర్యాణ మాసతిథులు తెలియ నయినవి గాని వానిసంవత్సరనామములు తెలియ రాకుండట కొఱఁతగొల్పుచున్నది. ఒక్కయన్నమాచార్యునివే జనననిర్యాణసంవత్సరములు తెలియవచ్చినవిగాని తక్కినవారివి తెలియరాలేదు. సూర్యచంద్రాదు లున్నందాఁకఁబై వారిజన్మనక్షత్ర నిర్యాణతిథికైంకర్యములు సాగుచుండుటకే యీయగ్రహారసమర్పణములు జరగినవి గాని యాధర్మకైంకర్యములకు "శ్రీవైష్ణవులరక్ష" అనిమాట కలదు గాని అన్నీ అన్యథా అయిపోయినవి. పరమాచార్యుఁడయిన యన్నమాచార్యునిజన్మనక్షత్ర నిర్యాణతిథి కైంకర్యములను స్వామి కనేకాగ్రహారముల నొసఁగి యనేక కైంకర్యములు జరపినమహావిద్వాంసుఁడు మహాకవి యగు తిరుమలాచార్యుని నిర్యాణదినకైంకర్యములు నయిననిఁక మీఁద సాగుట యర్థింపఁదగినది.

అష్టమహిషీకళ్యాణము పరమయోగివిలాసము ఉషాపరిణయము అన్నమాచార్యచరిత్రము చిన్నన్న రచించిన గ్రంథములు. ఈతఁడు జలజాతవాసిని చనుబాలపుష్టిచే కవితారచన నేర్చినాఁడట. ఈతని యన్న పెదతిరువెంగళనాథుఁడు 'సంగీతసత్కవిత్వాధికుఁడు' సంకీర్తనములు పాడుచుండు నప్పుడు స్వామి యాడుచుండెడువాఁడట. ఈమహామహులకు (అయిదుగురుకు) స్వామి పాండవులకుఁ గృష్ణునట్లు సహాయమై యుండెడివాఁడట! వీరికి విచిత్రముక్తాతపత్రరత్నకిరీట ముద్రికా ప్రచండ మణిమండిత మకరకుండలోత్కరాహఃకరదీపికాపాదుకాది బహూకరణంబులను స్వామి కరుణించెనట! చిన్నన్న పరమయోగివిలాసాష్టమహిషీకళ్యాణములలో రత్నశుంభ దనుపమ శ్రీవేంకటాద్రీశ దత్తమకరకుండలరత్నమండితకర్ణుఁడ నని, కావ్యంబు చెప్పి శ్రీవేంకటేశు మెప్పించి సకలంబు నెఱుఁగ నసాధారణాంక మకరకుండలములు గొన్నవాఁడ నని దినములోననె వేయిద్విపదలింపొంద వినుతవర్ణలతో విరచించు



సంకీర్తనముల తొలిరేకు

వాఁడ నని చెప్పుకొన్నాఁడు. ద్విపదలక్షణము నీతఁడే నిష్కృష్టముగా నిర్వచించినాఁడు. లక్షణగ్రంథకారు లెవ్వరుగాని యితనివలె నిర్వచింపఁజాల రయిరి. ఈతఁడు కస్తురిపీఁణఁ గొసినకరణి తెలిగప్పురపుఁగ్రోవి దెఱచినసరణి విరవాదిపొట్లంబు విడిచినమాడ్కి పరిమళించుచుఁ గవుల్ బళిబళీ యనఁగ కవితసెప్పినసులక్షణకవి.

అర్వాచీనులు కొందఱు ' తాళ్ల పాక చినన్న దండెమీటులుగావు ' అనీ 'అలతాళ్లపాకచిన్నన్న రోమము లైతే తంబురాదండెకుఁ దంత్రులౌనె' అనీ యీతని గొప్పగాయకునిఁగా స్మరించిరి. చిన్నన్న గాయకుఁడ నుట కిక్కడి రాగిరేకులలోఁగాని గ్రంథములలోఁగాని యాధారములు గానరావు. చిన్నన్నకు అన్న తండ్రి తాత గొప్పగాయకులు గాన యిటీవలి వారు గ్రంథములఁబట్టి చిన్నన్ననే యెఱిఁగినవారుగాన వారియోగ్యత నీతనికిఁ జేర్చి చెప్పియుండవచ్చును. కాక యీతఁడును గాయకుఁడేమో ! గణవరపు వెంకటకవి ప్రబంధరాజమున చిన్నన్న నిట్లు సన్నుతించెను :-

క. ఎన్నఁ దెనుఁగునకు రాజను
గ్రన్నన యతిరాజునకును రమణయకును నేఁ
జిన్నను ద్విపద నొనర్పను
జిన్నన్నను బిరుదుగద్య చెప్పినఘనుఁడఁట.

నూలినేతచే వస్త్రములు గల్పించి లోకమును నాగరకపఱిచి యుద్ధరించువా రయిన సాలెవారి కీతఁ డాచార్యపురుషుఁడు. వారి వంశమర్యాదల కీతఁడు సంరక్షకుఁడుగా నుండెను. సాలెవారు వీరికి పదివేల వరహాలు పాదకానిక సమర్పించిరి. చిన్నన్న వంశపారంపర్యముగా దమ వంశపారంపర్యముగా గురుశిష్యతాసంబంధము వర్ధిల్లఁగోరిరి. ఇందుకు తామ్రశాసనము వెలయించిరి.[1]

1 చూ. తామ్రశాసనము. శ్రీ. వెం. ఓ. జర్నల్. 1 వాల్యూం. 1 పార్టు.

## కోనేటి తిరువెంగళనాథుఁడు.

ఈతఁడు సదాశివరాయలచే క్రీ 1544, 1545 అద్దంకిదగ్గఱి బొల్లాపల్లి ఓలపల్లి అని రెం డగ్రహారములఁ బడసినాఁడు. క్రీ 1559 లో కడపజిల్లా పుష్పగిరిచెన్నరాయనికిఁ గొంతభూమి సమర్పించినాఁడు. ఈతఁడు గొప్పవైభవ మనుభవించినాఁడనుట కీ క్రిందిపద్యముసాక్షి.

సీ॥ మొకరివా తెర కీరిముఖము బంగరుదండె
పాలకి యేగురుం డోలి నెక్కె
శ్రీజగన్నాథునూర్జితపదాంభోజముల్
సేవించి యేబుధాశ్రితుఁడు వెలసె
కాయసిద్ధిని లంబికాయోగమార్గంబు
తెలిసి యేఘనుఁడు సాధించి నెగడె
భక్తితోఁ బట్టాభిషిక్తులు ధరసాగి
మ్రొక్క నేవిభుఁడు పెంపెక్కి చెలఁగె
నతఁడు పొగడొందు హారనీహారగంధ
సారకర్పూరగోక్షీర సదృశయశుఁడు
ఘనుఁడు పెదతిమ్మదేశికగర్భజలధి
కువలయాప్తుండు కోనేటిగురువరుండు [1] ॥

## తిరువెంగళప్ప.

ఈతఁడు గొప్పవిద్వాంసుఁడు అమరుకావ్యమును దెలిఁగించినాఁడు. నామలింగానుశాసనమునకుఁ దెలుఁగువ్యాఖ్య రచించినాఁడు. కావ్యప్రకాశికకు వ్యాఖ్య రచించినాఁడు. క్రీ 1554 లో అంబత్తూరు తూప్పిల్ అగ్రహారములలో కొంతభాగము తిరుపతి గోవిందరాజస్వామి

1 ఈ పద్యము శ్రీతాళ్లపాక సూర్యనారాయణయ్యగారి వ్రాఁతకాగితములనుండి కైకొంటిని,

పెండ్లి తిరునాళ్లు జరపించుటకుగా సమర్పించినాఁడు. క్రీ 1553 లో చిన కంచిలో అరులాళప్పెరుమాళ్లకు వల్లాత్తంజేరి పేరిచ్చంబాకము అను గ్రామము లిచ్చినాఁడు.[1]

## తిరుపతి శాసనములు.

తిరుపతి దేవస్థానశాసనము లెల్ల నరవముననే కలవు. సర్వస్వతంత్రుఁడు దక్షిణాపథమునకెల్ల సార్వభౌముఁడును గాన యొక్క శ్రీకృష్ణదేవరాయఁడుమాత్రము గుడిలో సంస్కృత కర్ణాటాంధ్ర ద్రవిడములలోఁ దనశాసనములఁ జెక్కించుకోఁ గలిగెను. తిరుమల తిరుపతి దేవస్థానముల గుడిగోపురములలోఁ దాళ్లపాకవారి శాసనములు నరవముననే యున్నవి. తిరుమల కొండక్రిందనే తాళ్ళపాకవారి యగ్రహారముగానున్న మంగాపురమునఁ దాళ్లపాక చినతిరుమలాచార్యుఁడు తాను గట్టించిన కళ్యాణ వెంకటేశ్వర దేవాలయమున శాసనము లన్నింటిని తెలుఁగుభాషలోఁ దెలుఁగులిపిలోనే చెక్కించుకొనెను. శుద్ధాంధ్రు లయిన మహానీయులు సాళువ తిమ్మన, గోవిందన, బయకారరామయ మొదలగువారు శ్రీస్వామివారి కర్పించిన యగ్రహారాదుల శాసనములుగూడ ద్రవిడముననే ద్రావిడీకరణముఁ బడసినపేర్లతోనే యున్నవి. శాసనము లెల్ల ద్రావిడముననే యుండుటకుఁ గారణము దేవస్థాన స్థానపతులు ద్రవిడు లగుటయే. గుడిలో శాసనములఁ జెక్కించుట కధికారులు వారే. తిరుమలాచార్యాదులు వదులకొలఁది గ్రామములను స్వామికి సమర్పించుకొన్నారేకాని గుడిలో శాసనములఁ జెక్కించుకో లేదు. ఆయా దాత లిచ్చిన యీవులను బ్రతిగృహీత యగు దేవునికిఁ జెల్లింతుమని దేవస్థానస్థానపతులు బాధ్యత వహించి యుభయులకు నమ్మికగా శాసనములఁ జెక్కించిరి. దానికి

1 వై చరిత్రవిషయములు పెక్కులు శ్రీసాధుసుబ్రహ్మణ్యశాస్త్రిులుగారు రచించిన శాసనముల రిపోర్టులోని విషయములు శాసనములు చదివి సమకూర్చినవి.

'శ్రీవైష్ణవరక్ష' వ్రాసెట్టిరి. తిరుమలాచార్యులనాఁడు శాసనములఁ జెక్కించినయుద్యోగి తిరునిన్రార్ వుడయన్. స్వామిపుష్కరిణికడ మాత్రము పెదతిరుమలాచార్యుఁ డొక తెలుఁగుశాసనము వేయించుకొనెను. పద్యరూపముగాఁగూడ నది తాళ్లపాక సూర్యనారాయణయ్యగారి ప్రాఁత కాగితములలో నున్నది. అది యిది:-

సీ॥ శ్రీశాలివాహనాంచితశకాబ్దము లెన్న
నిల వేయునన్నూఁట యేఁబదియును
నాలవయేఁడగు నందనవత్సర
వైశాఖపూర్ణిమావాసరమున
శ్రీవేంకటాధీశ శృంగారసంకీర్త
నాచార్యతాళ్ళపాకాన్నమార్య
పుత్త్రతిమ్మార్యుండు పూర్వపుఁగోనేటి
కట్టించె నవశిలాకలితముగను
తత్తటాంకణగోపురద్వారములను
భువనసన్నుతుఁ డైనట్టి భూవరాహ
ఘనుని తిరుచుట్టుమాలె ప్రాకారవరము
తాను కట్టించె నాచంద్ర తారకముగ.

## నేఁటితాళ్లపాకవారు.

తిరుపతిలో స్వామికి సంకీర్తనకైంకర్యము జరుపుచుఁ దాళ్లపాక శేషాచార్యులగారు కుటుంబవృద్ధితో నున్నారు. మడితాడుగ్రామవాసి, సూర్యనారాయణయ్యగారు చిన్ననన్న కోవలోనివారట. నేఁడు తిరుపతిలోనె వైద్యాదివృత్తులతో సకుటుంబముగా నున్నారు. వీరే తాళ్లపాకవారి పూర్వగాథలకై చాల శ్రమించుచున్నవారు. అన్నమాచార్యుల దేవతార్చన విగ్రహాదులను మంగాపురమునకుఁ జేర్చినవారు వీరే.

ఠింకను కడపజిల్లాలో ముడుంపాడు, ఊటుకూరు, మాచనూరు, రాజు పాలెం, ఎఱ్ఱవారిపాలెం అను గ్రామములలోఁ గూడఁ దాళ్లపాకవారు పెద తిరుమలాచార్యుల యయిదుగురు కుమాళ్ల వంశపరంపరలవారు ఉన్నా రట. శ్రీసూర్యనారాయణయ్యగా రాయాగ్రామముల కరిగి యక్కడి విశేషములఁ దెలిసికొనివచ్చిరి. మఱి కొన్ని విగ్రహాదులు ముడుంపాడు గ్రామమునఁ గలవని తెలుపఁగా వానినేకరింపఁ గోరి వారి నాగ్రామ మున కంపితిని. కాని వారు విగ్రహముల నీయరయిరట. గ్రంథములు శిథిలమయిపోయినవట. తాళ్లపాకవారి యిండ్లనుండి (కడపజిల్లా) కొన్ని తాళపత్రగ్రంథము లాంధ్రసాహిత్య పరిషత్తువారు సేకరించిన ట్లున్నారు. (చూ. ౯ వాల్యూం. పరిషత్పత్రిక.)

## నందవరీకులు - వైష్ణవత.

అన్నమయ యాదివఁ శఠకోపయతిశిష్యుఁడై వైష్ణవుఁడై నట్టి యాకాలమున నందవరీకబ్రాహ్మణులు మఱికొందఱు వైష్ణవము స్వీకరించి శఠకోపయతిశిష్యు లయిరి. అల్లసాని పెద్దనకూడ నందవరీకబ్రాహ్మణుఁడే స్మార్తుఁడే. శఠకోపయతిశిష్యుఁడై వైష్ణవము పుచ్చుకొన్నాఁడు. ప్రబంధరాజవిజయ వేంకటేశ్వర విలాసము రచించిన గణపువరపు వెంకటకవి గూడ నందవరీకుఁడే. వారిపూర్వులు వైష్ణవము పుచ్చుకొన్నవారే. కాని యాతఁడు తాళ్లపాకవారికిఁ జాలఁ దర్వాతివాఁడు. శ్రీవెంకటే శ్వరస్వామిపై నాతఁడు రచించినకృతి వెంకటేశ్వరవిలాస మాతఁడన్నట్లు ప్రబంధరాజమే. నందవరీకులు గొందఱు వైష్ణవులగుటకుఁ బ్రధానముగా నన్నమాచార్యుఁడే కారణ మనుకొందును. ఆరాధ్యశైవుఁడగు తెనాలి రామకృష్ణుఁడు వైష్ణవుఁ డగుటకుఁగూడ నీతాళ్ళపాకవారిపలుకుబడి కల దేమో. ఆతని కృతిపతి విరూరివేదాద్రిమంత్రి నందవరబ్రాహ్మణుఁ డేమో. 'విరూరి' యింటిపేరివారు నందవరీకులు నేఁడున్నారట. రామ

కృష్ణునిగురువగు కందాడ అప్పలాచార్యుఁడు తాళ్లపాక పెదతిరుమలాచార్యునకును గురువు. కాన పెదతిరుమలయ్య రామకృష్ణుఁడు సతీర్థ్యులు.

## అన్నమాచార్యాదులు తిరిగినదేశములు.

అన్నమాచార్యుఁడు కడప, కర్నూలు, బళ్లారి, యనంతపురము, చిత్తూరు, చెంగల్పట్టు, ఆర్కాడు, నెల్లూరు, గుంటూరు, తంజావూరు, తిరుచినాపల్లి, మండలములలో సంచారముచేసిన ట్లున్నాఁడు. కృష్ణ గోదావరి మండలముల నెఱుఁగఁడేమో! అన్నమాచార్యుని మనుమఁడు చిన్నన్న గుంటూరు, కృష్ణామండలములఁగూడఁ దిరిగినవాఁడు. ఆతనికి శిష్యులు సాలెవారు సర్వాంధ్రదేశమున నుండిరి.

## కీర్తించినవేల్పులు.

అన్నమాచార్యుఁడును ఆయనకొడుకు పెదతిరుమలాచార్యుఁడును మనుమఁడు చినతిరుమలాచార్యులును నీక్రిందిపుణ్యస్థలములలోని దేవతలఁ జేర్కొని సంకీర్తనములు చాల రచించిరి. మూడుపూరి కేశవుఁడు కృష్ణుఁడు దాసరిపల్లె రాముఁడు మండెమునృసింహుఁడు కదిరి నృసింహుఁడు కదిరివసంతుఁడు చెంజినవనీతకృష్ణుఁడు కళసాహనుమంతుఁడు అహోబలనృసింహుఁడు విజయనగర వేంకటేశ్వర విట్ఠల నరసింహహనుమంతులు కడపవెంకటేశ్వరుఁడు తిరుపళాచ్చివిష్ణుఁడు తిరువళ్లూరి వీరరాఘవుఁడు కంచివరదరాజు గండవరముగోపాలుఁడు కుఱునూతుల చెన్నుఁడు చేగలమఱ్ఱిచెన్నుఁడు వావిలిపాడురాముఁడు ఉద్దగిరికృష్ణుఁడు గుత్తిరాముఁడు వెలుగోటికేశవుఁడు మంగాంబుధిహనుమంతుఁడు నల్లఁబల్లి చెన్నుఁడు ఊటుకూరిచెన్నకేశవుఁడు కోవెలగుంట్లగోపాలకృష్ణుఁడు ఓగునూతులనృసింహుఁడు కోనచెన్నరాయఁడు శ్రీరంగమురంగనాథస్వామి ఒంటిమెట్టవీరరఘురాముఁడు చుక్కపల్లిచెన్నుఁడు కోసువానిపల్లె

చెళ్లపిళ్ల, నెల్లూరు, అధ్యాత్మసంకీర్తనములలో చదివిచూచి నంతలోఁ గానవచ్చిన వివి. కడమఁట్టుఁబరిశీలించినపై నింక నెన్నియగునో!

## సంకీర్తనముద్రాసామ్యములు.

తాళ్లపాకఅన్నయ తిరుమలాచార్యులకు నిన్నూఱువర్షములకుఁ దర్వాతికాలమున క్రీ 1650 ప్రాంతముల వర్తిల్లినక్షేత్రయ్యయును క్షేత్రయ్య కించుమించుగా నిన్నూఱేండ్లతర్వాత వర్తిల్లినత్యాగరాయల వారును నిట్లే యనేకదివ్యస్థలముల దేవతలపై సంకీర్తనముల రచించిరి. తాళ్లపాకవా రాయాదేవలకుఁ దిరుపతి వేంకటేశ్వరునితో నభేదము గల్పించి వేంకటేశ్వరనామముద్ర యుంచినట్లు క్షేత్రయయు నాయాక్షేత్ర ములదేవతలకు మువ్వగోపాలునితో నభేదము గల్పించి మువ్వగోపాల ముద్రను సంకీర్తనములకుఁ గూర్చెను. త్యాగరాయలవా రాయాక్షేత్ర ములదేవతలఁ బేర్కొనుచుఁ గడపటిచరణమునఁ దనపేరే ముద్రగా వెల యించిరి.

రాజస్తుతిపరాఙ్ముఖత్వము దేవతార్చనవిగ్రహములను గోల్పో వుట మొదలగువిషయములు కొన్ని యన్నమాచార్యునకును, త్యాగ రాజునకును సమానముగాఁ దటస్థించినవి. అన్నమాచార్యుని శృంగారసం కీర్తనరచనాంశము క్షేత్రయ్యగాను అధ్యాత్మసంకీర్తనరచనాంశము త్యాగ య్యగాను నవతారముదాల్చె ననఁజెల్లును. అన్నమాచార్యునట్లు సంకెళ్లు వేసి చెరలోనుంచుట స్వామికృపవలన నాక్లేశము తొలఁగిపోవుట రామ దాసుగారికిని గలిగెను.

## అన్నమాచార్యుని పలుకుబళ్లు.

అన్నమాచార్యుని సంకీర్తనములభాష పశ్చిమాంధ్రదేశమున వాడుకగన్నది. ఆతనిపలుకుబళ్లు చాలా: కృష్ణరాయలయుఁ దదాస్థానక

వులయు రచనలలోని కెక్కినవి. రాయలతోఁ దలఁచుగాఁ దిరుపతికి వచ్చి స్వామిసన్నిధిని తాళ్లపాకవారిసంకీర్తనముల వినుచుండుటచే నాయా కవులకు వీరిపలుకుబళ్లు సుపరిచితము లయి యుండవచ్చును. మచ్చునకుఁ గొన్ని:—

చిగురుఁగొమ్మైనఁ జేవ, మీసాలపై తేనియల్, సందుసుడిమాయలు, తంగేటిజున్ను, నూతులుత్రవ్వితే బేతాళాలుబయల్పడును, కోలగగ్గెర, పొరిపిడంగాయములు, గోవాళ్లు, చిందువందు, తలపూవాడక,

తాళ్లపాకవారి సంకీర్తనముల ఛాయలు వేమన పద్యములలోని కెక్కినవి.

### ఛాయాపహారులు.

తనసంకీర్తనచ్ఛాయాపహారులను —వా రెవరో పేరుతెలియదు— అన్నమయ కటువుగా గర్హించెను.

రామక్రియ.

వెఱ్ఱులాల మీకు వేడుక కలితేను ।
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా ॥ పల్లవి ॥

ముడిచి వేసినపువ్వు ముడువ యోగ్యముగాదు ।
కుడిచివేసినపుల్లె కుడువఁగాఁ గాదు ।
బడి నొకరుచెప్పినఁ బ్రతిచెప్పఁ బోతేను ।
అడరి శ్రీహరికి నది అరుహము గాదు ॥ వెఱ్ఱు ॥ 1

గంపెడుముక దినఁ గా నొక్కవరిగింజ ।
తెంపునఁ గలసితే తెలియనెట్టువచ్చు ।
జంపులం బలవరించఁగ నొకమంచిమాట ।
ఇంపైతె హరి యందు కిచ్చునా వరము ॥ వెఱ్ఱు ॥ 2

ఉమిసినతమ్ములో నొకకొంత క్రమము ।
సమకూర్చి చవిగొని చప్పరించనేల ।
అమరంగ భార్యాపహారము చేసుక ।
తమమాట గూర్చితే దైవము నగఁడా ॥ వెఱ్ఱి ॥ 3

చిబికివేసినగింజ చేతఁ బట్టఁగనేల ।
గబుక కెంగిలిబూరె గడుగంగ మఱియేల ।
తొబుకకవిత్వాల దోషాలఁ బొరలితే ।
దిబుకార నవ్వఁడా దేవుఁ డైనాను ॥ వెఱ్ఱి ॥ 4

మించుచద్దికూటిమీఁద నుమిసినట్టు ।
మంచి దొకటి చెప్పి మఱి చెప్పనేరక ।
కంచుఁ బెంచు నొక్కగతి నదికితే మట్టె ।
పెంచువలెనే చూచుఁ బెరుమాళ్లు వాని ॥ వెఱ్ఱి ॥ 5

పుచ్చినట్టిపండు బూఁజిలోనని వుండు ।
బచ్చనకవితలు బాఁతిగావు యెందు ।
ముచ్చుఁ గన్నతల్లి మూల కొదిఁగినట్లు ।
మ్రుచ్చిమి నుతు లేల మ్రొక్కరో హరికి ॥ వెఱ్ఱి ॥ 6

ఉల్లిదిన్నకోమ టూరక ఉన్నట్టు ।
జల్లెడ నావాలు జాఱిపోయినట్లు ।
కల్లలు చెప్పి యాకత కుత్తరములీక ।
మెల్లనే ఉండితే మెచ్చునా దైవము ॥ వెఱ్ఱి ॥ 7

నేతిబీఱకాయ నేయి అందు లేదు ।
రాతిపీరునికి బీరము ఇంచుకా లేదు ।
ఘాత బూరుగుఁబండు కడుపులోన దూది ।
ఏతులసుడుగులు యెక్కునా హరికి ॥ వెఱ్ఱి ॥ 8

ఇరుగువా రెఱుఁగరు పొరుగువా రెఱుఁగరు।
గొరబైనమాటలు గొణఁగుచునుందురు।
పరులఁ గాదందురు బాతిగారు తాము।
విరసు లట్టివారి విడుచు దేవుండు ॥ వెఱ్ఱు ॥ 9
ఎన్నఁగ శ్రీవేంకటేశుఁ దాళ్లపాక।
అన్నమాచార్యులు అఖిలదిక్కులు మెచ్చ।
ఉన్నతితోఁ బాడి రోకఁ డెవ్వఁడో తాను।
సన్న నొరసునట నమ్మితా హరికి ॥ వెఱ్ఱు ॥ 10

అన్న. అధ్యా. 196 రేకు.

పాడి.

నరసింహ రామకృష్ణ నమో శ్రీవెంకటేశ।
సరుగ నాశత్రుల సంహారించవే ॥ పల్లవి ॥

బావతిట్లకు శిశుపాలునిఁ జంపిన।
యేపకోపకాఁడవు నేఁ డెందు వోయితివి।
నీవాఁడ నని నన్ను నిందించీ శత్రువును।
చావఁగొట్టి వాని నిట్టె సంహారించవే ॥ నర ॥ 1
దాసుని భంగించేటితటిఁ గసిపుఁ జంపిన।
యీసుకోపకాఁడ విపు డెందు వోతివి।
మేసుల నీలాంఛనాల మించి నన్ను దూషించీ।
సాసించి శత్రువును సంహారించవే ॥ నర ॥ 2
కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్దఁ జంపిన।
యెల్లఁగాఁగఁ గోపకాఁడ వెందువోతివి।
యిల్లిదె శ్రీవెంకటేశ యీనీమీఁదిపాటలు।
జల్లన దూషించుశత్రువు నంహారించవే ॥ నర ॥ 3

అన్న. అధ్యా. 378 రేకు.

చాలా కోపగాఁ డయి యీసంకీర్తనలు రచించి నాఁడు. కవితా శత్రు వెవ్వఁడో యీతనిఁ గాసిపఱిచిన ట్టున్నాఁడు.

## భాషావిశేషములు.

చక్కఁగా గ్రాంథికభాషను నేర్చినవాఁ డయినను నీతఁడు సంకీర్తనములలోఁ జాలాచోట్ల వాడుకభాషనే యుపయోగించినాఁడు. సంకీర్తనలక్షణమున నాతఁడు చెప్పినదానికి మనుమఁడు చినతిరుమలయ్య యిట్లు తెలుఁగు చేసినాఁడు.

క॥ పల్లవనారీమ్లేచ్ఛా
ద్యుల్లాసమనోజ్ఞబంధురోక్తులు చవులై
చెల్లును గ్రామ్యము లైనను
హల్లీసక ముఖ్యనాటకాదిక ఫణితిన్ ॥

క॥ జగతిఁ గడుఁ జెల్లుబడై
నగి నగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగ దన రహిఁ జెడుఁ బువ్వుల
సొగ సుడుగన్ బిసికి కంపుసూపినభంగిన్ ॥

వచ్చీని పోయీని చేసీని ఆడుతా చేయరంటా చిముడుతా ఏమి చెప్పేదమ్మా అమ్మలాలా అయ్యలాలా ఏవ్వారికేవ్వారు యేనాటి ఋణము (సంధికూర్పవలసినచోట్లు కూర్పక వ య ఆగమములుచేర్చుట) పోయె ఆయె ననుటకు పోయ ఆయ అనుట, లోకవాడుక దినదినకొత్తలు (వైరిసమాసములు) ఇత్యాదివిధముల వాడుకభాష నీకవులు ప్రయత్నముతోఁ గోరి ప్రయోగించినారు. అరవములోవలె నీకవులు ఉదాత్తశబ్ద క్త్వార్థకక్రియాజన్య విశేషణములకు సమాసములో ద్రుతముచేర్చిరి. పోవం ద్రోక్త చెప్పంబట్టుకులు ఇత్యాదులు. దీమసవఱ్ఱారివార (వాకిళ్లార అను

టకు) కట్టివార (వారలారఅనుటకు) ఇట్టిప్రయోగము నాచనసోమనయు 'వెజ్జివార పిడుగు వ్రేసినఁ దలటొప్పి యాగునే' అని చేసెను. నాచన సోమనరచనల యనుకృతు లీసంకీర్తనములలోఁ జాలఁ గలవు. 'ఎదిరి కిన్మడఁచువాఁడు తనకుఁ దగరంబు నఱచు టెంతటిభరమ్ము' నాచనసోమన నానుడి యిది 'ఎనలేక యెదిరికి యినుమడిచేవానికి తనకు తగర మడువఁ దడ వయ్యీనా' అని సంకీర్తనమున కెక్కినది.

నిఘంటువుల కెక్కని దేసితెలుఁగుపలుకు లీసంకీర్తనములలో నెన్నో కలవు. అట్టివాని నెల్ల సేకరించి వేఱుగా నిఘంటువులకుఁ బరిశిష్టములు వెలయింపఁ దగును.

## కవితారీతులు.

అన్నమాచార్యుఁడు నరసన్న (కవికర్ణరసాయనకర్త?) పెద తిరుమలయ్య చినన్న—శబ్దార్థశుద్ధి గలిగిన వరకవులు. అన్నమయ మఱిసరిగాఁ బోతనవలె సహజకవితావిశారదుఁడే. స్వామి పలికింపఁగా దాను పలికితి నని చెప్పుకొన్నాఁడు. అతఁ డాడినది యమృతకావ్యము పాడినది పరమ సంకీర్తనము నయినది. అన్నమయ తెలుఁగు నొడికారమునఁ గడుదిట్ట. సంస్కృతమునఁగూడ సత్కవితారచన నేర్చినవాఁడు. పెద తిరుమలాచార్యాదులు సంస్కృతాంధ్రాది భాషలలో నన్నమయవలె విద్వాంసులు. పెదతిరుమలాదులరచనలలో పాండిత్యప్రకర్షము పదబంధపుజిగిబిగి యధికముగా నుండును, అన్నమాచార్యసంకీర్తనములును శృంగారమంజరియు తేటతేటగా తేలికతేలికగా తియతియ్యగా హాయిహాయిగా గోస్తనీద్రాక్షాగుళుచ్ఛములవలె నాస్వాద్యములయినవి. వానియర్థవిశేషములు శ్రోతలహృదయములలో సులువుగాఁ జొరఁబాఱి వానిని చూఱగొని కొనిపోయి యేడుకొండల నెక్కించి భగవంతునిపాదారవిందముల వజ్జ నజంటువతో నత్తియుండునట్లు చేయఁగలవి! అన్నమాచార్యుఁడు

తిరుపతి కొండమీఁద జగదేకనాథుఁడు ప్రత్యక్షమై వెలసియున్నాఁడని ఓహో ప్రజలారా నామాటవినుఁడు దర్శించి కృతార్థులు కండు రండు రండని రెండుచేతు లెత్తి యాహ్వానించినరీతి రాలకింపఁదగినది.

రామక్రియ.

చాలెద నిదియే సత్యము సుండో ।
చేటులే దతని సేవించినను ॥ పల్లవి ॥

హరి నొల్లనివా రసురలు సుండో ।
సుర లితని దాసులు సుండో ।
పరమాత్ముఁ డితఁడె ప్రాణము సుండో ।
మరుగక మఱచిన మఱిలే దింకను ॥ చాలెద ॥ 1

వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో ।
సోదించె శుకుఁ డచ్చుగ సుండో ।
ఆది బ్రహ్మ గన్నాతఁడు సుండో ।
యేదెస వెదకిన నితఁడే ఘనుఁడు ॥ చాలెద ॥ 2

యిహపర మొసఁగను యీతఁడె సుండో ।
వహి నుతించెఁ బార్వతి సుండో ।
రహస్య మిదివో రహి శ్రీవేంకట ।
మహీధరంబున మనికై నిలిచె ॥ చాలెద ॥ 3

అన్న. అధ్యా. 138 రేకు.

వైష్ణవు లనఁగా నిట్టివారట:—

ఆహిరి.

మదమత్సరము లేక మనసు పేదై పోవ ।
పదరిన యాఫలవాఁడుచో వైష్ణవుఁడు ॥ మద ॥

ఇట్టు నట్టుఁ దిరుగాఁడి యేమైనాఁ జెడనాడి।
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కు లాడి।
ఎట్టివారి నైనా దూఱి యెవ్వరినైనాఁ జేరి।
వట్టి యాసలఁ బడని వాఁడువో వైష్ణవుఁడు ॥ పల్లవి ॥ 1
గడనకోఱకుం జిక్కి కాముకవిద్యలఁ జొక్కి।
నిడివి నేమైనాఁ గని నిక్కినిక్కి।
ఒడలి గుణముతోడ వుదుటువిద్యలఁ జాల।
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥ 2
ఆవల వారులఁ జెడనాడఁగ వినివిని।
చేవమీఱి యెవ్వరినిఁ జెడనాడక।
కోవిదు శ్రీవెంకటేశుఁ గొలిచి పెద్దలకృప।
వావివర్తన గలవాఁడువో వైష్ణవుఁడు ॥ మద ॥ 3

అన్న. అధ్యా. 9 తేకు.

ధన్నాసి,

వైష్ణవులు గానివార లెవ్వరు లేరు।
విష్ణుప్రభావ మీవిశ్వ మంతయుఁ గాన ॥ పల్లవి ॥
అంతయు విష్ణుమయం బట మఱి దేవ।
తాంతరములు గల వననేలా।
భ్రాంతిఁ బొంది యేభావము భావించి।
నంతటనే పుణ్యు లౌట దప్పదుగాన ॥ వైష్ణ ॥ 1
ఎవ్వరిఁ గొలిచిన నేమిగొఱఁత మఱి।
యెవ్వరిఁ దలఁచిన నేమీ।
అవ్వలివ్వల శ్రీహరిరూపు గాని వా।
రెవ్వరు లే రని యెఱుక దోచినఁ జాలు ॥ వైష్ణ ॥ 2

అతిచంచలంబైన యాతుము గలిగించు।
కతమున బహుచిత్తగతులై ।
యితరులఁ గొలిచిన యెడయక యనాథ।
పతి తిరువేంటపతి చేకొనుఁగాక॥ వైష్ణ॥ 3

అన్న. అధ్యా. 6 రేకు.

భూపాళం.

ఏకులజుఁ డేమి యెవ్వఁడైననేమి।
ఆకడ నాతఁడే హరి నెఱిఁగినవాఁడు॥ పల్లవి॥

పరగిన సత్యసంపన్నుఁడైన వాఁడే।
పరనిందసేయఁ దత్పరుఁడు గానివాఁడు।
అరుదైన భూతదయానిధి యగువాఁడే।
పరులుఁ దానే యని భావించువాఁడు॥ ఏకుల॥ 1

నిర్మలుండై యాత్మనియతిఁ గలుగువాఁడే।
ధర్మతత్పరబుద్ధిఁ దగిలినవాఁడు।
కర్మమార్గములు గడవనివాఁడే।
మర్మమై హరిభక్తి మఱవనివాఁడు॥ ఏకుల॥ 2

జగతిపై హితముగాఁ జరియించువాఁడే।
పగలేక మతిలోన బ్రతికినవాఁడు।
తెగి సకలము నాత్మఁ దెలిసినవాఁడే।
తగిలి వేంకటేశు దాసుఁ డయినవాఁడు॥ ఏకుల॥ 3

అన్న. అధ్యా 47 రేకు.

లలిత.

విజాతు లన్నియు వృథావృథా।
అజామిళాదుల కది యేజాతి॥ పల్లవి॥

జాతిభేదములు శరీరగుణములు।
జాతిశరీరము సరిఁ దోడనె చెడు।
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది।
యాతల హరివిజ్ఞానపు దాస్యం బిదియొక్కటె పో సుజాతి ॥విజా॥ 1
హరి యిందరిలో నంతరాత్ముఁ డిదె।
ధరణి జాతిభేదము లెంచిన।
పరమయోగు లీభావ మష్టమదము భవనికారమని మానిరి।
ధరణిలోనఁ బరతత్వ జ్ఞానము ధర్మమూలమే సుజాతి ॥ విజా॥ 2
లౌకికవైదిక లంపటులకు నివి।
కైకొనునవశ్య కర్తవ్యంబులు।
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతిసేసిన సంపాదనమిందఱికి।
మేకొని యిన్నియు మీఱినవారికి మీనామమే సుజాతి ॥ విజా ॥ 3
అన్న. అధ్యా. 177 రేకు.

నాదనామక్రియ.

ప్రపన్నులకు నిది పరమాచారము।
విపరీతాచారము విడువఁగ వలయు ॥ పల్లవి ॥
భగవదపచారము భాగవతాపచారముఁ।
దగులక దేవతాంతరము మాని।
నగధరు శరణము నమ్మి యాచార్యుని।
బగి వాయనిదే పరమవైష్ణవము ॥ ప్రప ॥ 1
దురహంకారము దుఃఖము సుఖమునుఁ।
బొరయక ప్రాకృతుల పొంతఁ బోవక।
దరిశనాభిమానాన ధర్మము వదలక।
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ ప్రప ॥ 2

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి।
యెపుడూఁ దీర్ఘప్రసాదేచ్ఛతోడ।
నిపుణత శ్రీవేంకట నిలయుండె గతియని।
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము॥ ప్రప॥ 3

అన్న. అధ్యా. 166 కీర్త.

లక్ష్మీవిలాసము:—

గుండక్రియ.

రూకలై మాడలై రువ్వలై తిరిగీని।
దాకొని వున్నచోటఁ దా నుండ దదివో॥ పల్లవి॥

ఒకరిరాజుఁ జేసు నొకరి బంటుగఁ జేసు।
వొకరికన్నుల వే ఆొకరికి నమ్మించు।
వొకచోట నున్నధాన్య మొకచోట వేయించు।
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము॥ రూక॥ 1

కొందరిజాళెలు నిండు కొందరికి సొమ్ములవు।
కొందరిపుణ్యులఁ జేసుఁ గొందరి పాపులఁ జేసు।
కొందరికొందరిలోనఁ గొట్లాట వెట్టించు।
పందె మాడినటువలెఁ బచరించు పసిఁడీ॥ రూక॥ 2

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు।
తగిలి శ్రీవేంకటేశు తరుణియై తానుండు।
తెగనిమాయై యుండు దిక్కుదెసయై యుండు।
నగుతా మాపాల నుండి నటియించుఁ బసిఁడీ॥ రూక॥ 3

అన్న. అధ్యా. 92 కీర్త.

తత్త్వవిచారణః—

భూపాళం.

చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు ।
ఎప్పుడును జింతించే నిదే పనై నేను ॥ పల్లవి ॥

పొలసి నీరూప మెట్టు పొడసూపేవో ।
ఎలమి నాభాగ్య మింక నెట్టున్నదో ।
అలరి నా కేబుద్ధి ఆన తిచ్చేవో ।
కలిగిననీమాయ యేగతిఁ గడచేనో ॥ చెప్పవే ॥ 1

వరుస నాకెట్లఁ గై వస మయ్యేవో ।
ఇరవై నాజన్మ ఫల మెట్లున్నదో ।
పరగ నామతినెట్లు పాయకుండేవో ।
కరుణానిధిని ని న్నే కరణి మెప్పించేనో ॥ చెప్పవే ॥ 2

వనిపడి యెట్లా నీభక్తి యిచ్చేవో నా ।
మనసుచంచల మెట్టు మట్టు పడీనో ।
ఎనలేనినాతలఁపు లెటేఁగి శ్రీవేంకటేశ ।
నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో ॥ చెప్పవే ॥ 3

భౌళి.

పట్టినచోనె వెదకి భావింపవలెఁ గాని ।
గట్టిగా నంతర్యామి కరుణించును ॥ పల్లవి ॥

ఇంటిలోనిచీకటే యిట్టె తప్పక చూచితే ।
వెంటనే కొంతవడికి వెలుఁ గిచ్చును ।
అంటి కానరాని తనయాత్మ తప్పకచూచు ।
కొంటెఁ దనయాత్మయును గొబ్బునఁ గాన్పించును ॥ పట్టి ॥ 1

మించికలినపురాతిమీఁదఁ గడువ వెట్టితే ।
అంచెలఁ దానే కుదురై నయట్టు ।
పొంచి హరినామ మేప్రొద్దు నాలికతుదను ।
ఎంచి తలఁచఁదలఁచ నిరవౌ సుజ్ఞానము ॥ పట్టి ॥ 2
ఒక్కొక్కయడుగడుగె ఒగి ముందు వెట్టితే ।
ఎక్కువౌ కొండైన నెక్కఁ గొనకు ।
ఇక్కువ శ్రీవేంకటేశు నిటు దినదినమును ।
పక్కనం గొలిచితె బ్రహ్మపట్ట మెక్కును ॥ పట్టి ॥ 3

లలిత.

ఆడుతాఁ బాడుతా నీతో నట్టె ముద్దు గునుసుతా ।
వోడక నీదండ చేరి వున్నారమయ్యా ॥ పల్లవి ॥
ఆసఁ దల్లిదండ్రిమోము అట్టె చూచి శిశువులు ।
యేసుఖదుఃఖములుఁ దా మెఱుఁగనట్టు ।
వాసుల శ్రీపతి మిమ్ము వడి నాత్మఁ దలఁచుక ।
యీసులఁబుణ్యపాపము లెఱుఁగమయ్యా ॥ ఆడుతా ॥ 1
ఏలినవారు వెట్టఁగా నేపునఁ దొత్తులు బంట్లు ।
ఆలకించి పరులఁ బో యడుగనట్టు ।
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించఁగా ।
యేలని యేమియుఁ గోర నెఱుఁగమయ్యా ॥ ఆడుతా ॥ 2
చేతఁ జిక్కి నిధానము చేరి యింటఁ గలవాఁడు ।
యేతులఁ గలిమిలేము లెఱుఁగనట్టు ।
ఆతుమలో శ్రీవెంకటాధిప నీ వుండఁగాను ।
యీతల నేవెలుతులు నెఱుఁగమయ్యా ॥ ఆడుతా ॥ 3

అన్న. అధ్యా. 268 తేకు.

భైరవి.

కరుణానిధి నీవే కనుఁగొంచు నున్నాఁడవు ।
యిరవై నాలో నున్నాఁడ వేది గతి యింకను ॥ పల్లవి ॥

పేరుచున్నవి నాలోనఁ బెక్కువికారములు ।
వూరుచున్న వెన్నైనా వూహా లెల్లాను ।
చేరుచున్న వాక్కొక్కటే నేనా సెన కోరికలు ।
యీరీతి నున్నాఁడ నాకు నేది గతి యింకను ॥ కరు ॥ 1

పట్టుచున్నవి నానాప్రకృతులవోజలు ।
పుట్టుచున్నవి యనేకభోగేచ్ఛలు ।
చుట్టుకొనుచున్నవి సులభపువేడుకలు ।
యిట్టివి నానడకలు యేదిగతి యింకను ॥ కరు ॥ 2

సందడింపుచున్నవి సారెకు నామమతలు ।
ముందువెనకై వున్నవి మోహా లెల్లా ।
చెందె నీపై భక్తి శ్రీవెంకటేశ్వర ।
యెందునూ నీవే కాక యేది గతి యింకను ॥ కరు ॥ 3

అన్న. అధ్యా. 238 రేకు.

లలిత

నమో నారాయణ నావిన్నప మిదివో ।
నమానుఁడఁగాను నీకు సర్వేశ రక్షించవే ॥ పల్లవి ॥

మనసు నీయాధీనము మాటలు నీ వాడేటివే ।
తనువు నీపుట్టించినధన మిది ।
మునునీపంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే ।
వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే ॥ నమో ॥

భోగము లెల్లా నీవి బుద్ధులు నీవిచ్చినవి।
యీగతి నాబతుకు నీ కిరవైనది।
చేగదేర నీవు నన్నుఁ జేసినమానిసి నింతే।
సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే ॥ నమో ॥ 2

నెలినీవే లోనీవే వేడుకలెల్లా నీవే।
కలకాలమును నీకరుణే నాకు।
యిల శ్రీవెంకటేశ నీవేలుకొన్న బంట నింతే।
నెలవు దప్పించక నీవే రక్షించవే ॥ నమో ॥ 3

అన్న. అధ్యా. 235 రేకు.

పెండ్లి తిరునాళ్లు:—

సామంతం.

పసిఁడి యక్షంత లివె పట్టరో వేగమె రారో।
దెసలఁ బేరంటాండ్లు దేవుని పెండ్లికిని ॥ పల్లవి ॥

శ్రీవెంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి।
వైవికపుఁ బెండ్లిముహూర్తము నేఁడు।
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె।
దేవతలు రారో దేవుని పెండ్లికిని ॥ పసిఁడి ॥ 1

కందర్ప జనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి।
పందిలి లోపలం దలఁబాలు నేఁడు।
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి।
అందక మునులు రారో హరి పెండ్లికిని ॥ పసిఁడి ॥ 2

అదె శ్రీవెంకటపతి కలమేలుమంగకును।
మొదలి తిరుణాళ్లకు మొక్కేము నేఁడు।

యెదుట నేగేరు వీరే యిచ్చేరు వరము లివె ।
కదలి రారో పరుషఘనులు పెండ్లికిని ॥ పసిఁడి ॥ 8

అన్న అధ్యా. 234 రేకు.

రామక్రియ.

గరుడధ్వజంబెక్కె కమలాక్షుపెండ్లికి ।
పరుషలదివో వచ్చేఁ బైపై సేవించను ॥ పల్లవి ॥

పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు ।
ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల ।
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి ।
వేడుకలు మీఱఁగ శ్రీవిభునిపెండ్లికిని ॥ గరుడ ॥ 1

కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన ।
మొరసె దేవదుందుభి మ్రోఁత లెల్లను ।
బెరసె సంపద లెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి ।
తిరమైమించిన దేవదేవుని పెండ్లికిని ॥ గరుడ ॥ 2

వేసిరి కానుక లెల్ల వేవేలు కొప్పెరల ।
పోసి రదే తలఁబాలు పుణ్యసతులు ।
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను ।
సేసలు వెట్టిన యట్టి సింగారపు పెండ్లికిని ॥ గరుడ ॥ 3

అన్న, అధ్యా. 204 రేకు.

వేంకటేశ్వరస్వామిపెండ్లి తిరునాళ్లు మన యన్నమాచార్యుఁడే తొలుత వెలయించినవాఁడుగాఁ దోచుచున్నాఁడు. ఆగమ శాస్త్రమున వివాహోత్సవముచేయుచున్న మాన్యుఁడే కన్యాదాతగావర్తిల్లనగునని కలదట. కనుకనే శ్రీపాదరేణు మాహాత్మ్యమున నిట్లున్నది.

శ్రీలలరంగ మంగమును శ్రీహరి కెన్నఁడు దారవోయుచోఁ ।
దాళులపాక యన్నమయ దాఁగడిగెంబదముల్, ధరిత్రిమా ।
తాళుపాక చిన్ననపదంబులు పాడిన నాడె సర్వరాట్ ।
శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁజెల్లదే ॥

శకుంతలా పరిణయ కృత్యవతరణిక నిట్లున్నది.

"మఱియు నమ్మహాదేవుండు మదీయ మాతామహ వంశశిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామాతరుండనిపించుకొని, భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించెనట."

దేవాలయములో సంవత్సరోత్సవములను తెల్గుదేశమున కళ్యాణోత్సవములనీ ద్రవిడదేశమున బ్రహ్మోత్సవములనీ నేఁడు పేర్కొనుట కలదు. ఆలయములలో స్వామిప్రతిష్ఠజరగిననాళ్లే యీ యుత్సవములనాళ్లట. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మప్రతిష్ఠితుఁడు గనుక అప్రతిష్ఠజరగించిన బ్రహ్మపేర తిరుపతి వర్షోత్సములు బ్రహ్మోత్సములయ్యెననీ దాని ననుసరించి దక్షిణదేశపు దేవోత్సములకెల్ల బ్రహ్మోత్సవములని పేరు సంక్రమించెననీ అయుత్సవములలో కళ్యాణము జరుపుట తెల్గుదేశమునఁగ్రొత్తగాఁగలిగిన యాచారమని శ్రీపరవస్తు రామానుజస్వామి ఎం. ఏ., గారు చెప్పుచున్నారు.

బ్రహ్మోత్సవము :—

అహిరి.

నానా దిక్కుల నరు లెల్ల ।
వానల లోననె వత్తురు గదలి ॥ పల్లవి ॥
సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు ।
హితులు గొలువఁగా నిందరును ।

శతసహస్ర యోజనవాసులు సు।
వ్రతములతోడను వత్తురు గదలి ॥నానా॥ 1

ముడుపులు జాళెలు మొగిఁ దలమూటలు।
కడలేనిధనము గంతలును।
కడుమంచిమణులు కరులు నురగములు।
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి॥ నానా॥ 2

మగుటవర్ధనులు మండలేశ్వరులు।
జగదేకపతులుఁ జతురులును।
తగువేంకటపతి దర్శింపఁగ బహు।
వగల సంపదల వత్తురు గదలి॥ నానా॥ 3

అన్న. అధ్యా. 331 రేకు.

అంపకాలు:—

ముఖారి.

భోగీంద్రులును మీరుఁ బోయి రండు।
వేగిన మీఁదటి విభవములకు॥ పల్లవి॥

హరుఁడ పోయిరా అజుఁడ నీవునుంబోయి।
తిరిగిరా మీఁదటి తిరునాళ్లకు।
సురలు మునులు భూసురులు పోయిరండు।
అరవిరి నిన్నాళ్లు నలసితిరి॥ భోగీం॥ 1

జముఁడపోయిరా శశియు నీవునుఁ బోయి।
సుముఖుఁడవై రా సురలఁ గూడి।
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయి రండు।
ప్రమదాన నిన్నాళ్లు బడలితిరి॥ భోగీం॥ 2

నారద సనక సనందనాదులు ।
భూరి విభవములఁ బోయి రండు ।
దూరముగాఁ బోకిట్టె తొరలి వెంకటగిరిఁ ।
జేరి నన్నిట్లనే సేవించుఁడి ॥ భోగి ॥ 3

అధ్యా. 353 II వాల్యం.

ఇంతవఱకు అధ్యాత్మసంకీర్తనలే ఉదాహరించినవి
శృంగారసంకీర్తనలు గూడ రెండు:—

కేదారగౌళ-అటతాళం.

నీవు గాఁగా నేను గాఁగా
నేఁటి కాయఁ బోయను ।
మీవంటి చులుకనివారము మేమైతే
మేమైనంత లేసిపనులు నేఁడౌను ॥ పల్లవి ॥

మంచిగందము నెఱపూఁత పూసుకొని
మావాడ కాతఁడు రాఁగాపోఁగాఁ జూచి ।
పొంచులు మాయింటిపంచ నుందువట
బోగాలవారము టే ।
ఎంచనేటికి తప్పు నీమగఁడైతే
యిలువెళ్ల కుండ నరికట్టుకొని వల ।
పించవలెఁగాక వూరివారిమీఁద
పొంచులుండవచ్చునా వోచెలియ ॥ నీవు ॥

ఎమ్మెకాఁ డాతఁడు మావీథి నిలుచుండి
యెవ్వరితోనో మాటలాడఁగా విని ।
కొమ్మరో చూపెట్టుకొనివుందువట
గుట్టు విడిచివున్నామా ।

అమ్మరో ఆతఁడు నీమగఁడై తే
ఆన లిడుకొని వుండవలెఁగాక ।
దిమ్మరిక త్తెవై మాయింటిచుట్టూ
తిరుగులాడ నాయమా ॥ నీవు ॥ 2

నాయముగా అలమేల్మంగ వెంకటనాథుఁడు
ననుఁగూడి నవ్వీనంతలోనే ।
వోయమ్మ నేఁజెల్ల వూర నాఁట చాట
వున్నపనులవారమా ।
పాయక ఆతఁడు నీపతియైతే పక్క-
పవ్వళించి వుండవలెఁ గాక ।
కాయనికావులు వూయనివూతలు గట్టి
కాపురాలు గుత్తగొందురటె ॥ నీవు ॥ 3

శేషా. వ్రాఁతప్రతి.

(రాగముపేరు లేదు)

కటకటా అయ్యో కాంత నింత యేపుదురా ।
అటమటముగాదు నీయానసుమ్మీ నిజమయ్యా ॥ పల్లవి ॥
కొసరినా నిన్నేకాని కోపించినా నిన్నే కాని ।
కసరినా నిన్నేకాని కాదన్నా నిన్నే కాని ।
విసరినా నిన్నేకాని వేసరినా నిన్నే కాని ।
ఇసుమంతైనా అన్యమెఱుఁగదయ్యా ॥ కట ॥ 1
అలసినా నిన్నేకాని ఆఁకొన్నా నిన్నేకాని ।
పిలిచినా నిన్నేకాని పేరుకొన్నా నిన్నేకాని ।
సొలసినా నిన్నేకాని సోకనాడినా నిన్నేకాని ।
కలనైనా తలఁపెందూ కలుగదు గిదవయ్యా! ॥ కట ॥ 2

కొనియాడినా నిన్నే కాని గుంపించినా నిన్నే కాని ।
పనివినా నిన్నే కాని పాడినా నిన్నే కాని ।
మనసిచ్చి యలమేలుమంగపతి వేంకటేశ ।
మొనసితివి మాచెలి నింత నేచ నేమిటికయ్యా ॥ కట ॥ 3

## ఆళ్వార్లు—అన్నమాచార్యుఁడు.

ద్రవిడవేదాంతరచనమునకై శఠకోపయతీంద్రు లవతరించినవిధముగా నంధ్రవేదాంతరచనమునకై యన్నమాచార్యుఁ డవతరించినాఁడు.

శఠకోపయతి వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరింపఁగా-నన్నమాచార్యుఁడును వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరించినాఁడు. శఠకోపయతి పదునాఱేండ్లవయసువాఁడయినతర్వాత సర్వవిద్యలు గోచరించి ద్రవిడసంకీర్తనములు రచింపఁ దైవానుగ్రహము నందఁగా - నన్నమాచార్యుడును నట్లే పదునాఱవయేఁట స్వామిప్రత్యక్షమై యుద్బోధింపఁగా సంకీర్తనరచనము సాగించెను. శఠకోపయతి శ్రీతిరు వేంగడనాథునిమీఁదను నింకననేకదివ్యస్థలములలోని విష్ణుమూర్తులమీఁదను సంకీర్తనములు రచింపఁగా నన్నమాచార్యుఁడును ప్రధానముగా శ్రీవేంకటనాథునిమీఁదను నింకననేకపుణ్యస్థలముల విష్ణుమూర్తులమీఁదను సంకీర్తనలు రచించెను. శఠకోపయతిస్వామికౌస్తుభాంశమున జన్మించినట్లు విజ్ఞలు విశ్వసింపఁగా నన్నమాచార్యుఁడు స్వామినందకాంశమున నవతరించినట్లు ప్రాజ్ఞులు పరిగణించిరి.

పెరియాళ్వార్లు (విష్ణుచిత్తులు) తులసీవనమున జనించిన గోదాదేవిని రంగనాథస్వామి కొసఁగి పెండ్లిచేసి మామగా రయినట్లే యన్నమార్యులుగూడఁ బద్మసరోవరమున జన్మించినమంగాంబికను వెంకటేశ్వరస్వామికిచ్చి పెండ్లిచేసి మామగా రయ్యెను.

ఇట్టిమహత్త్వముగలవాఁడు గనుకనే తిరుపతివేంకటేశ్వరస్వామి సన్నిధి నీతనికి, నీతనివంశమునకుఁగూడ నానాఁ డఖండగౌరవ మలవడినది.

## ఆంధ్రసంకీర్తనములు—ద్రవిడపాశురములు.

ఆళ్వార్లు రచింపఁగా నరవమున ద్రావిడవేదమనీ పంచమాగమ మనీ పేర్కొనఁబడుదివ్యప్రబంధము నాల్గువేలసంకీర్తనములు పాట్టులు (సీసపద్యాదులవంటివి) కలదికాఁగా అన్నమాచార్యుఁ డొక్కఁడే రచించినయంధ్రవేదము ముప్పదిరెండువేలపాటలు గలది. ఈసంకీర్తనలు దివ్యప్రబంధముల ననువర్తించియే పరమాత్మునకు భక్తజీవులకు పతిపత్నీభావము నాయికానాయకభావము కల్పించి యుజ్జ్వలరసానుభూతి నొదవించుచు ననేకదేవాలయములలోనియర్చామూర్తుల నభివర్ణించుచు శరణాగతిమహత్త్వము బ్రతిపాదించుచు నింక ననేకవిధముల లోకనీతి ధర్మోద్బోధభూతదయాదివిశేషాంశముల వెలయించుచు నెంతో వింతగా వేడుకగా సంగీతసారస్యముతో నవరనిభాషతో వేదవేదాంతేతిహాసాది సూక్తి తదర్థప్రతిపాదనములతో వెల్విరిసి పెరియవాచ్చాంబిళ్లైవంటిమహావ్యాఖ్యాత వెలసెనేని యఖండానందతాండవముగాఁ బెదపెద్దవ్యాఖ్యాచమత్కారములు ప్రవ్వతీయఁదగినట్లు విజ్ఞాననిధులై పరాజిల్లుచున్నవి.

తిరువాయ్మొజ్జి మొదలగు దివ్యప్రబంధరచనల కివి తీసిపోవు. దేశప్రజాదౌర్భాగ్యముచే నివి వెలసిననాఁటనుండి నేఁటిదాఁక రహస్య రక్షలో నున్నవే కాని రాణ కెక్కవయ్యెను. అన్నమాచార్యులయుఁ దత్పుత్రపౌత్రులయుఁ బ్రాభవము చెల్లునప్పుడు వారే స్వామికి వైభవములు కల్పించునప్పు డుత్సవములందే కాక యనుదినమును నీసంకీర్తనములు స్వామిసన్నిధిని విన్నవించుట జరగిది. తమతర్వాత నట్లు జరగుటకుఁ గూడ వారు వసతులు గల్పించిరి. తర్వాతఁ గొన్నాళ్లట్లు తనరె

నేమో ! ఇందుకుఁ దార్కాణగాభజనగోష్ఠులవారు తొలుదొలుత తాళ్ల పాకవారి సంకీర్తనములనే యాలాపింతురు. కాని యిటీవల వీనిమెఱుఁక మఱుఁగుపడిపోయినది. వీనిజన్మస్థానమగు తిరుపతిలోనే వీనిప్రాభవము వెలయలేదనఁగా నిఁక నితరస్థలములమాటచెప్పనేల ?

ఈ సంకీర్తనములు తెల్గునాఁటివిష్ణ్వాలయములలో దివ్యప్రబంధములుగా నిత్యసంకీర్తనార్హములుగా నెగడఁదగినవి. ఆయాదేవాలయముల యధికారులును ప్రభుత్వమువారును వీని కర్హమయినయాదరము కల్గింతు రుగాక ! త్యాగరాజకీర్తనలవలె నివి సంగీతచమత్కారములు రాగ స్వర విహారములు పుక్కిలించునవిగా నున్నవో లేదో నిరూపించుయోగ్యతనాకు లేదు. గానవిశారదులే దానిఁగనుఁగొనఁ దగినవారు.

ఈ సంకీర్తనఫలములు గాయకులగానామృతమునఁ దోఁగి మాఁగి యాస్వాద్యము లయినప్పుడే వానితీయన తెలియనగును.

## శ్రీవేంకటేశ్వర వైభవము.

ఉపనిషన్మంత్రములవలె శ్రీవేంకటేశ్వరమూర్తి తొలుత నాయా మతములవారికిఁ గొంతకొంత యానుకూల్యము గొల్పునవయవాలంకారాదికముతో వెలసి తన నిజాంతరంగమును నీరు కొలఁది తామరయన్నట్లుపాసకు లగువారి యోగ్యత కొలఁదిగా గోచరింపించుచు మహామాభిరామమై మెరహి కెక్కినది. పలుమతములువారు పలురీతులఁగుల వేంకటేశ్వరుని భావించుచుండుట నన్నమాచార్యుఁడును వివరించినాఁడు.

(మూ. 26 పుట. పీఠిక.)

శివుఁడని, శక్తియని, భైరవుఁడని, జినుఁడని, స్కందుఁడని, తమ తమ నిర్ణయముల కనుకూలము లయిన రూపరేఖలను ప్రమాణములను జూపుకొనుచు పలుమతములవారు పలుకుబడి చెల్లించుకొనుచు వైవిధ్య

ముతో నర్చించుచు వచ్చిన శ్రీవేంకటేశమూర్తిని ఆళ్వారాచార్యుల యభివర్ణనానాగుణముగావిష్ణుమూర్తినిగా శ్రీరామానుజాచార్యులవారు క్రీ. పదొకొండవ శతాబ్దిలో విఖ్యాతపఱిచిరి. సింహాచలము శ్రీకూర్మము మొదలగు స్థలములంగూడ నిట్టి నిర్ధారణములే వారు చేసిరట!

పర్వతారణ్యమధ్యస్థమై, దుర్గమమై పలుమతముల పలుకుబడికి చెల్లుబడికి లోఁబడుచు, పూజాపురస్కారములు సరిగా సాగక, ఎవరో ప్రగాఢభక్తిపరులగు నిశితవ్రతులే నిలువఁదగిన ట్లున్న స్వామి సన్నిధిని శ్రీవైష్ణవుల స్థానపతిత్వమును స్థాపించి శ్రీరామానుజులు తమకు రామాయణోపదేశముచేసిన గురువులు తిరుమలనంబిగారిని శిష్యులు అనందాళ్వార్లను ఇద్దఱు జియ్యంగార్లను ఇర్వదినల్గుర నేకాంగులను సదా స్వామిని గాచియుండునట్లుచేసిరి.

వైఖానసాగమ విధానమునకు తిరుపతి ప్రధానక్షేత్రము. ఇది మధ్యరంగముగా నాంధ్రద్రవిడకర్ణాట దేశములందు విష్ణ్వాలయములలో వైఖానసాగమ ప్రకారమునఁ బూజోత్సవాదికము లెప్పటనుఁడియో సాగుచున్నవి. స్వామి కీయుభయులు నుభయరక్షులు.

పదునాల్గవ శతాబ్దిలో దేశికులవారును వారిశిష్యులును మనవాళ మహామునులు వారిశిష్యులును స్వామివైభములకు విఖ్యాతిగూర్చిరి. పదునైదవ శతాబ్దిలో అహోబలమఠప్రతిష్ఠాపకులు శఠకోపయతులును, వారిశిష్యుఁడన్నమాచార్యుఁడునుస్వామివైభవమునకుఁబ్రఖ్యాతిగొల్పిరి. అన్నమాచార్యుఁడొకసంకీర్తనమున:—

"నేనొక్కఁడ లేకుండితే నీకృపకుఁ బాత్ర మేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు."

అనెను. అతఁడు స్వామిసన్నిధి నివసించి సంకీర్తనములు సాయించుట చేతను, బైఁడిమెల్లరు రాజుల నావర్జించుకొని వారికృతములుగాను స్వకృత

ముగాను ఆలయ గోపురారామ మార్గసోపానాది నిర్మాణములను ఉత్స వవిశేషములను బెంపొందించుటచేతను వైష్ణవమతపు శరణాగతి మాధు ర్యముచేతను కలౌవెంకటనాయకః యన్నసూక్తికిఁ దార్కాణగా లోక రక్షకమై యాపన్నివారకమై ప్రజ్వరిల్లుచుండు స్వామిమహాత్మ్యవిశే షముచేతను పదునైదవ శతాబ్దిలో తిరుపతి క్షేత్రము భక్తపరివత్తులరాక పోక లధికముగా గలదై జనరంజకమై వర్ధిల్లినది. పదునారవ శతాబ్దిలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణరాయఁడు, నంతకుఁ బూర్వుఁడు సాళ్వనర సింగరాయఁడును వమవిజయము లెల్ల శ్రీవేంకటేశ్వరానుగ్రహమున వెలసినవే యన్నవిశ్వాసముగలవారయి దిగ్విజయ యాత్రలలో శ్రీవై ష్ణవాచార్యులను, కవీశ్వరులను, శ్రీవేంకటేశ్వర విగ్రహమును దోడఁ గొంపోవుచు శ్రీవేంకటేశ్వరభక్తిని దేశ మెల్ల వెల్లివిరియించిరి. దిగ్వి జయ యాత్రారంభములందు విజయ నిర్వాహాంతములందు వారు శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనము చేసికొని కానుకలర్పించుకొను చునుండెడివారు. శ్రీకృష్ణరాయఁడు క్రీ 1512 నుండి, 1523 దాఁకనేడు తూర్లు తిరుపతి కివిచ్చేసెను.

తొలితూరి:— ఇర్వురుభార్యలతో వచ్చిస్వామికి నవరత్నఖచితకిరీ టమును కర్పూరహారతికి ఇర్వైయైదు వెండిపళ్లెములను భార్యలచే స్వామి పాలారగింప బంగారుగిన్నెను,

రెండవతూరి:— శ్రీభూదేవుల కనేకాభరణములను,

మూడవతూరి:— 5 గ్రామములను,

నాల్గవతూరి:— ముప్పదివేలవరహాలతో స్వామికి కనకాభిషేక మును కొన్నియాభరణములను తాళ్లపాకగ్రామమును (చిన్నాదేవిచే) కంఠమాల పదకము ఒక గ్రామమును (తానే) నవరత్నప్రభావళియును మకరతోరణమును,

అయిదవతూరి:— కంఠమాలను పదకమును ఆనందవిమానవుబం గారుపూతకు ముప్పదివేలవరహాలను పులికాపునిర్వాహమునకు వెయ్యి వరహాలను ఉదయాస్త నైవేద్యమునకు 500 వరహాలను,

ఆఱవతూరి:— కొన్ని భూములను,

ఏడవతూరి:— నవరత్నఖచితమయిన పీతాంబరమును నవరత్న ఖచితములయిన రెండువింజామరలను పదకమును పదివేలవరహాలను సమర్పించెను.

అచ్యుతరాయఁడు ప్రతివత్సరము స్వామికిఁ బ్రబంధపుష్పాంజలు లర్పించుచుండెను. సదాశివరాయఁడునుస్వామికెన్నో సేవలుచేసెను. దాన శ్రీవేంకటేశ్వరమాహాత్మ్యము దక్షిణభారతదేశమం దెల్లఁ బ్రజ్వరిల్లినది. పదునాఱుపదునేడు శతాబ్దుల తెలుగుప్రబంధములలో శ్రీవెంకటేశ్వర స్వామికి సమర్పితములే లెక్కకెక్కువగా నున్నవి. పుణ్యక్షేత్రయాత్ర లలో ముఖ్యములయిన యనేకవిష్ణ్వాలయ శివాలయ దేవతలతోపాటుగా నంతదాఁకఁగీర్తనీయమగుచున్న శ్రీవెంకటేశార్చామూర్తి పదునాఱవ శతాబ్ధియారంభమున నుండి సర్వభారతదేశమునకు ముఖ్యార్చామూర్తి కాఁజొచ్చినది. బ్రాహ్మణుల మొదలుగాఁ బంచములదాఁక నన్నిజాతుల వారును తమయిండ్లలో శుభకార్యములు జరగునప్పుడు మనుముందుగా వెంకటేశ్వర దీపారాధన, సమారాధన, జరుపుట, ఇంట నెవరికేఁగాని యనా రోగ్యము కలిగినప్పు డాపద మ్రొక్కుల వాఁడని స్వామికి ముడుపు గట్టి కొండకు వచ్చి వడ్డితో ముడుపు చెల్లించుకొనుట సంప్రదాయమయి నది. తలనీలా లిచ్చువారు నిలువుదోపిళ్లిచ్చువారు అనర్ఘ రత్నాభర ణము లిచ్చువారు బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవాదులు జరిపించువారునై ప్రజలు, ప్రభువులు, మహారాజులు తండోపతండములుగా తిరుపతికి రాశ

పోకలు జరపసాగిరి. భారతదేశమున నెక్కడగాని ప్రజలు తమకుం జేరువ యున్న దేవాలయూర్చామూర్తుల పేళ్లఁ బెట్టుకొనుటకలదు. కాళహస్తీశ్వరుఁడు, వరదరాజు, మల్లికార్జునుఁడు, పానకాలరాయఁడుఇత్యాది నామములు దాల్చినవా రాయాపుణ్యక్షేత్రములచేరిక గ్రామములవారని తెలివిడికలుగును. కాని వెంకటేశ్వర వెంకటాచలపతీ త్యాదినామములు దక్షిణాపథమందెల్ల నూరూర నింటింట సర్వసామాన్యమై వెలయసాగినవి. శ్రీతిరుపతి వెంకటేశ్వరస్వామి పోలికగా ననేకప్రదేశములలో వెంకటేశ్వర దేవాలయములు వెలసినవి. దక్షిణాపథదేవాలయములలో శ్రీతిరుపతి వెంకటేశ్వరాలయమున కున్నంత యాదాయమే దేవళమునకు నుండదు. విజయ నగరరాజ్యము తర్వాత మట్ల మైసూరు తంజాపురాద్యాది రాజ్యములు నేటిజమీందారీలు స్వామికెన్నో కైంకర్యములు జరపినవి. అవి నేఁడు ప్రజాస్వామ్యముచేఁ జిదికిపోయినను, పోవుచున్నను గూడ శ్రీవెంకటేశ్వరవైభవము ప్రజాసామాన్యపరమై యఖండమై యలరారుచునే యున్నది.

## అన్నమాచార్యచరిత్ర పరిశోధనము.

ఈశ్వరసంకల్ప మెట్టిదోకాని తాళ్లపాకవారి యధ్యాత్మసంకీర్తనములు చదువుచుండునపుడు నాహృదయ తంత్రులలో ననురణనము సాగుచు పరమానంద పారవశ్యముకలుగుచు కర్తవ్యమేదో వ్యక్తమగుచున్నట్లుండును. ఈయన్నమాచార్యచరిత్రము ముద్రించుచు నందు సాళ్వనరసింహరాయనిదగ్గఱ నన్నమాచార్యుఁడు పాడిన శృంగారసంకీర్తన ప్రతీకము చదివి ఈకథనిజమా? ఇట్టికీర్తనము దొరకఁగలదా? ఉన్ననునది వేలకొలఁది సంకీర్తనములలో నెక్కడనున్నదో కదా అనుకొనుచుఁ జేతనున్న తాళ్లపాకశేషాచార్యులుగారి వ్రాఁతప్రతిని దెఱతునుగదా సరిగా నా సంకీర్తనమే యందు నాకన్ను లెదురఁగానవచ్చెను. ఆనందమాయెను.

నాతోనిందుఁబరిశ్రమించుచున్న చిరంజీవి శ్రీనివాసాచార్యునకిది చూపి చెప్పి మఱొకసంకీర్తనము సంకెల విడిపించుకొనుటకుఁబాడినదాని ప్రతీకమును జదివి యిదికూడదొరకిన బాగుగదాయనఁగా ఇదిగో యిప్పుడే యిట్టి సంకీర్తనమును జదివితిని అని యాతడంతలోనే దానినెత్తియిచ్చెను. ఇట్లునాలుగు మూఁడు నాళ్లలోనే మాకుఁగావలసిన సంకీర్తనము లెన్నో పుటపుట దొరకసాగినవి ! అందుముఖ్యములఁ గొన్నింటి నీ పీఠికలో వెల్లడించితిని. ఇట్లు సంకల్పసిద్ధి సంతోషములతో పీఠిక రచించుచు దేవస్థానశాసనములలో మంగాపురమున తాళ్లపాక చినతిరుమలాచార్యుఁడు కట్టించిన కల్యాణవెంకటేశ్వర దేవాలయమున అన్నమాచార్యునివిగ్రహాపుఁ బ్రతిష్ఠయు జరిగినట్లుండుటచే నదికలదేమోయని బరిశీలింపఁ బోఁదలచి మిత్రులతో ముచ్చటించితిని. మహమ్మదీయ విప్లవముచే పాడుపడి విగ్రహములు విరిగి సర్వధ్వంసమైయున్న యీదేవళమునొక పుణ్యపురుషుఁడు (సుందరరాజరాయస్వామి) స్వప్నోద్బోధమువలన వెదకివచ్చి చేరి చాల శ్రమపడి తిరుపతి కొండమీఁది దివ్యమంగళమూర్తి వలెనే మహనీయమై దర్శనీయమైయున్న యక్కడిమూలమూర్తిని చక్కఁజూచుకొని పూజాపురస్కారములు ఉత్సవాదులు కొలఁదియేండ్లనుండి జరపుచున్నట్లును, వారప్పుడు తిరుపతిలోనే ఉన్నట్లును తెలియవచ్చెను. వారితో మిత్రులతో మూలమూర్తిని దర్శించి మాటమాటమీఁద తాళ్లపాకవారి విషయమెత్తఁగా తాళ్లపాకవారి దేవతార్చన విగ్రహాదులిక్కడికిఁ జేరినవనివారొక పెద్దకథ చెప్పిరి వానినెల్లఁజూపిరి. అందు అన్నమాచార్యునినాఁటి భజనచిఱుతలు, తులసితావళము, స్ఫటికహారము సాలగ్రామములు శ్రీవెంకటేశ్వర, తద్దేవ్యాదులదేవతార్చన విగ్రహములు ఆవిగ్రహముల యిత్తడిమకరతోరణము, వెండిఛత్రములు మొదలగునవియున్నవి. వానిని శ్రీతాళ్లపాక సూర్యనారాయణయ్యగారొసఁగిరని వారిప్పుడు తిరుపతిలోనే ఉన్నారని యాసత్పురుషుఁడు తెల్పి

యఁజెప్పెను. పరమానందముతో తిరుపతికిఁ దిరిగివచ్చి యా శ్రీసూర్య నారాయణయ్యగారిని గలసికొంటిని. వారే అన్నమాచార్యచరిత్రమును శ్రీతిరుపతి వేంకటేశ్వరప్రాచ్య విద్యాలయమునకు ఇచ్చినవారు. కడప జిల్లా మడితాడును బీదరికముచేవిడనాడి అన్నమాచార్యాదులర్చించిన దేవతావిగ్రహములను సరిగా నర్చిపననువుపడక తిరుపతిలో దేవునిసన్నిధిఁ నర్పింపఁగోరి తెచ్చితిననియు దమపూర్వులేకట్టించిన దేవాలయము పున రుద్ధారము చెంది పూజాపురస్కారములుగలదై యున్నందుకు పరితో షించి యావిగ్రహములనెల్ల నక్కడనర్పించితిననియు వారుచెప్పిరి.

ఆనాఁడెప్పుడో యన్నమాచార్యుఁడు తనదేవతార్చన విగ్రహ ములు పోయినందుకు విలపించిన సంకీర్తనము తలఁపున గోచరించెను. (చూ. 46పుట. పీఠిక) నాఁడాతని కవిమరలదొరకెనేమో దొరకినప్పుడెంత సంతోషించెనో ఏమిచేసెనో తెలియదుగాని యయిదువందలయేండ్ల తర్వాత నాతనిభజనచిరుతలు తాళములు దేవతార్చన విగ్రహములు వెదకఁబోయినతీవ కాలఁదవిలినట్లు నాకన్నులెదుటగానవచ్చుట, వారు వెలయించిన దేవళము పూజా పురస్కారములతో మరలవెలయుట, చూడఁగా నాకుఁ బరమాహ్లాదముగలిగినది. శ్రీయన్నమాచార్యుఁడు నిత్యసూరులతో నారదాది మహర్షులతో నాళ్వారులతోఁగలసి శ్రీ వెంక టేశ్వరస్వామి పుష్కరిణీతీరమున ఆకాశగంగా ఝురులలో దరులలో సూర్యమండలములో నిత్యానంద విహారము సల్పుచుండెనని యానాఁటి వారానందించిరి. (చూ. 75పుటపీఠిక) అన్నమాచార్యుఁడుపరమప్రాప్యము శ్రీవెంకటేశ్వర సన్నిధానమేయని యనేక సంకీర్తనములలో గొంతెత్తి చేయెత్తిగొప్పగాఁజెప్పుకొనెను. ఆయన పరమపదమందిన ఫాల్గున బహుళ ద్వాదశి ప్రత్యాబ్దికశ్రాద్ధదినముగాన యాతని కుమారుఁడు పెద తిరు మలాచార్యుఁడిట్లు తన తండ్రిగారి నాహ్వానించెను.

శ్రీరాగం.

దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు ।
జనకుండ అన్నమాచార్య విచ్చేయవే ॥ పల్లవి ॥

అనంత గరుడముఖ్యు లయిన సూరిజనులతో ।
ఘననారదాది భాగవతులతో ।
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ ।
వెనుకొని యారగించ విచ్చేయవే ॥ దిన ॥ 1

వైకుంఠాననుండి యాళువారలలోపలనుండి ।
లోకపు నిత్యముక్తులలోన నుండి ।
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశుఁ గూడి ।
ఈకడనారగించ నింటికి విచ్చేయవే ॥ దిన ॥ 2


సంకీర్తనము తోడ సనకాదు లెల్లఁబాడ ।
పొంకపు శ్రీవెంకటాద్రిభూమి నుండి ।
లంకె శ్రీవెంకటగిరి లక్ష్మీ విభుఁడ నీవు ।
అంకెల మాయింటవిందు లారగించవే ॥ దిన ॥ 3

అన్న. అధ్యా. తేకు.

మదరాసువిడిచి శ్రీతిరుపతి వేంకటేశ్వరుల సన్నిధిసేవ కావింప వచ్చుటలో నాతొల్లిటికోరిక తాళ్లపాకవారిరచనల నన్నింటిని వెల్లడించుట. ఎంతప్రయత్నించినను నడ్డంకులచే నింకి పోవుచున్న నాసంకల్పపు టూటలు చక్కసాగుట కద నిప్పటికి సమకూడినది. ఇక్కడనున్న తాళ్లపాకవారి సంకీర్తనముల రాగిరేకు లన్నింటిని స్వాధీనముచేసికొంటిని. అస్మదీయుఁడు నాకుఁ జేదోడుగా ననువర్తించు పరిశోధనకార్యసహాయ విద్వాంసుఁడు చిరంజీవి ఎ.వి. శ్రీనివాసాచార్యుఁడు వేలలెక్క నున్న రాగి



తాళ్లపాకవారి పూజా విగ్రహములు



తాళ్లపాకవారి చిరతలు

రేకుల భరము మోయుచు బడలుచున్నను సంకీర్తనముల స్వారస్యాస్వాదనమున శ్రమతీర్చుకొనుచు సర్వపరిశోధన సందర్భములందు జాకరూకుడై తోడ్పడుచున్నాఁడు. మిత్రులైన డైరెక్టరు శ్రీపరవస్తు వెంకట రామానుజస్వామి, ఎం. ఏ. గారు నాకీకార్య నిర్వాహములో సహాయపడు చున్నారు. దేవస్థానమునకుఁ బై ముఖ్యాధికారు లిందుకుఁ జాల ముచ్చట పడువారుగా నున్నారు. ఇఁకఁజక్కఁగా దాళ్లపాక సంకీర్తనముల ముద్రణము సాగగలదను కొందును. ముద్రితము లయిన సంకీర్తనములఁగొనింటిని సంగీతసాహిత్యపరిపుష్టులు శ్రీఅనంతకృష్ణశర్మగారు స్వరవిన్యాసముతోఁ బ్రకటించుచున్నారు. ఇట్లిన్నాళ్లకుఁ దాళ్లపాకమహనీయులస్వామి సేవాఫలము పరిపక్వమై సహృదయాస్వాద్య మగుచున్నది. అన్నమాచార్యాదులారా! ఆనందింపుడు! అయిదువందలేండ్లకుఁ బిదప మీయభీప్సితము లన్వర్థములుగావలసిన ట్లున్నదిగాఁబోలుచుస్వామియనుగ్రహము!

సీ॥ చెక్కుళ్లఁ జిఱునవ్వు చిందుఁద్రొక్కెడుతేఁడ!
యేడుకొండలవాఁడ! యేలుకొమ్ము
అలమేలు మంగాంబ చెలికాఁడ! యడుగడ్గు
దండాలవాఁడ! మా కండ వగుము
ఆమటమ్రొక్కులస్వామి! గోవింద గో
వింద సందడివేల్ప! వందనమ్ము
కలియుగప్రత్యక్షకులదైవమా! యెల్ల
డెందాలవిహరించువింద! శరణు

గీ॥ పిండివంటకములు కుండలవంచిన
దోరెములును మాత్ర లారగించి
భక్తులకుఁ బ్రసాదపఱచు మహాభోగి
వరకటాక్ష! పరమపురుష! రక్ష!

సీ॥ నిలువుదోపుడు దోచు నెఱదొంగతన మేమి ?
పాపముల్ హరియించు భావ మొక్కొ
నడ్డికాసులఁ గూర్చు వ్యాపార మది యేమి ?
మేలు పెంపొందించు లీల యొక్కొ
తలనీలాల దోలఁచిపుచ్చుట యేమి ?
చిక్కులం దెగటార్చు ఫక్కి యొక్కొ
ఏడుకొండలమీఁద వీడాటయేమి ? స
హస్రారవసతిరహస్య మొక్కొ

గీ॥ ఏటివో యివి పెద్దలనాఁటిమాట.
లీశ్వరుఁడు సర్వభూతసుహృత్తు, సుహృదు
డాపదవహర్త, యనవార్త కలరి యట్టి
వాఁడ వను కన్నెఱిఁగి కొల్చినాఁడ నిన్నె !

శా॥ ఏరీ కోరి మనోజ్ఞపుష్పములు నీ కీయెన్మిదే[1] యంచు నా
త్మారామమ్మునఁ బూవఁజేసితి నహింసాదిప్రసూనంబు లే
నారాధించెద వీనిచే నిను ననంతాశ్వర్యకైంకర్యపుం
దీరుల్ గా వని వేఱుచేసెదవె తండ్రీ ! వేంకటాధీశ్వరా !

---

: అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహః
క్షాంతిః పుష్పం దయా పుష్పం జ్ఞానం పుష్పమతః పరమ్ ।
సత్యం పుష్పం తపః పుష్పం ధ్యానపుష్పమథాష్టమమ్
ఏవమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం పరమ్ ॥

శా॥ దూరంబేల పరంబు నీ విహామునందున్ భక్తరక్షార్థమ
ర్చారూపంబు ధరించి యుంటివన నిచ్చల్ నిన్నె లోకన్ను చె
న్నారం గాంచెద దేహదేవకులమూలాధారమం దాసహ
స్రారంబున్ సుఖ సత్యచి త్కలిత దీపారాధనల్ సేయుచున్ !

చ॥ కరకరపల్కులన్ బిరుసు గల్గినశర్కర నన్నుఁ బాగుగాఁ
గరఁచిపొరంకొంటివి నిగన్నిగమీఁగడపాల పీవు ని
ల్వారమున నాకు మార్దవము వచ్చెను నీకు ఘనత్వ మబ్బె ని
ర్వారము రసాయనంబగుటపోలదె యుర్వికిఁ గ్రొత్తకోవగాన్.

వే. ప్రభాకరశాస్త్రి.

# అన్నమాచార్యచరిత్రలో.

## సంస్కరణములు.*

| పుట. | బంతి. | ఉన్నది. | సంస్కరణములు. |
|---|---|---|---|
| 1 | 2 | కాయజుఁగన, | జుకన, |
| | 7 | కీర్తినవ | కీర్తనపు |
| 6 | 4 | గావింప | గాసింప |
| | 6 | ఒంటు...యొక, | వంట...వక(వగ ?) |
| | 24, 25 | అరి, పర, | అఱీ, వఱ, |
| 10 | 22 | జతు | జోత, |
| 13 | 13, 14 | నెరు, నోర, | నెఱు, నోఱ, |
| | 15, 16 | ముల, | ములు, |
| | 20 | ముద్రికల | ముద్రికంలు |
| | 21 | బాణముల్ | (పాదముల్ ?) |
| | 25 | | వనములఁగోనేటివాఁడెతిమ్మప్ప<br>పనివిన్నపరునలవాఁడెతిమ్మప్ప |
| 14 | 16 | తలిసేఁలు | (తలయేరు ?) |
| 20 | 19 | నడగోపురము, | (నడిగోపురము ?) |
| 24 | 7 | యాగాశ | యాకాశ, |
| 31 | 5 | బాంధవా | (శాత్రవా ?) |
| 34 | 8 | కెంబట్లు<br>కుళ్లాయి | కబ్బాయికుళ్లాయి ? |
| 43 | 6 | దండనేత్రు | (దండనేతృ ?) |
| 43 | | 17 బంతితర్వాత | 16 బంతి ఉండవలెను |

---

* 16 పుటలముద్రణమయిన తర్వాత, మూలపుప్రాఁత ప్రతిదొరకెను. దానిలోని పాఠభేదములుకొన్ని. ఉన్న పాఠములకు ఊహసంస్కరణములు కొన్ని.